సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 147

గురువారం 17-8-2023

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



**పసిడి పోరుకు అర్హత**

ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీలో ఫైనల్ చేరిన భారత మహిళల, పురుషుల జట్లు -12లో



**సెన్సెక్స్ 507 పాయింట్ల అప్**

నిఫ్టీకి 30 పాయింట్ల లాభం.. ఐటీ, ఆటో, ఎఫ్ఎంసీజీ షేర్లకు డిమాండ్ -13లో


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**బీజేపీ ఎలక్షన్ కమిటీ భేటీ**

బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ బుధవారం సమావేశమై మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించింది.

వివరాలు 6లో ▶



**జాబిల్లి వైపు వడివడిగా..**

ఇస్రో గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ కక్ష్య దూరాన్ని ఐదోసారి పెంచే ప్రక్రియ విజయవంతమైంది.

వివరాలు 6లో ▶



**కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య**

రాజస్తాన్‌లో కోచింగ్ సెంటర్ హబ్‌గా పేరు పొందిన కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు 6లో ▶



**27న ఖమ్మంకు అమిత్‌షా!**

రాష్ట్రంలో ఎన్నికల సమర భేరికి బీజేపీ సన్నద్ధమైంది. 27న ఖమ్మంలో అమిత్‌షా సభతో ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది.

వివరాలు 3లో ▶

## న్యూస్‌రీల్

### అధిక మాసంలోనూ 'అదరగొట్టారు'



అధిక మాసంలోనూ వైన్‌షాపు టెండర్ల ప్రక్రియ అదిరిపోయింది. మొత్తం మీద 14, 16 తేదీల్లో కలిపి.. రెండు రోజుల్లోనే 23 వేల వరకు దరఖాస్తులు రాగా, ఈనెల 4 నుంచి 16 వరకు మొత్తం 43,500 పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం.

- వివరాలు 14లో▶

### ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు చివరి చాన్స్



ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కన్వీనర్ సీటు కౌన్సెలింగ్ ద్వారా పొందడానికి ఇదే చివరి అవకాశం. ఇప్పటివరకూ సీటు కోసం ప్రయత్నించని వారు ఉంటే 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలని సాంకేతిక విద్య కమిషనర్ వాకాటి కరుణ తెలిపారు.

- వివరాలు 14లో▶

# కారులో 'సిట్టింగ్' లొల్లి!

## బీఆర్‌ఎస్‌లో రోజుకో నియోజకవర్గంలో తెరపైకి పంచాయితీలు

### పార్టీ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న అసమ్మతులు, ఆశావహులు

- సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వవద్దంటూ పలుచోట్ల తీర్మానాలు
- తాజాగా ప్రగతిభవన్‌కు కూతవేటు దూరంలో జనగామ అసమ్మతి భేటీ
- పుట్ట మధుకు మంథని అసెంబ్లీ టికెట్ ఇవ్వొద్దంటూ మీడియా సమావేశం
- మరికొన్ని నియోజకవర్గాల్లోనూ అసంతృప్తులు.. అధిష్టానానికి విజ్ఞప్తులు
- ఫీల్ గుడ్ భావన ఉన్నా ఇలాంటి విభేదాలతో నష్టమనే అంచనాలో కేసీఆర్
- లోపాలను సరిదిద్దే బాధ్యతలు కేటీఆర్, హరీశ్, కవితలకు అప్పగింత



హైదరాబాద్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో ప్రజాప్రతినిధులు, పక్కనే ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

**సీన్ -1**

**హైదరాబాద్ బేగంపేటలోని హరిత ప్లాజా..**

జనగామ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ స్థానిక సంస్థల నేతలు భేటీ అయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి వ్యతిరేకంగా.. ఈసారి జనగామ బీఆర్‌ఎస్ టికెట్‌ను ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఇవ్వాలంటూ వారు సమావేశమయ్యారు. ఈ సమాచారం తెలిసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నేరుగా హరిత ప్లాజాకు వెళ్లడం, అక్కడి నేతలతో వాగ్వాదం వంటివి జరిగాయి. అసమ్మతి భేటీకి వచ్చినవారిలో ముఖ్య నేతలెవరూ లేరని ముత్తిరెడ్డి ప్రకటించగా.. నియోజకవర్గంలోని మున్సిపల్ చైర్మన్లు, పలువురు సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు భేటీకి వచ్చినట్టు అసమ్మతి వర్గం తెలిపింది.

**సీన్ -2**

**మంథని నియోజకవర్గంలో..**

ఆ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు మీడియా సమావేశం పెట్టారు. మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు ఈసారి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వొద్దంటూ బహిరంగంగా డిమాండ్ చేశారు. ఆయన పార్టీ నేతలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇతరులకు ఎవరికి బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. పుట్టమధుకు వ్యతిరేకంగా త్వరలో నియోజకవర్గంలో పాదయాత్ర చేపడతామనీ ప్రకటించారు.

..అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ అధికార బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసమ్మతి సెగలు బయటపడుతున్నాయి. ఆయా ఎమ్మెల్యేల తీరుపై అసంతృప్తిగా ఉన్నవారు, టికెట్ ఆశిస్తున్న ఇతర నేతల అనుచరులు బహిరంగంగానే ఈ వ్యతిరేకతను బయటపెడుతున్నారు. ఇప్పటికే కల్వకుర్తి, దేవరకొండ, చొప్పదండి, రామగుండం, నాగార్జున సాగర్, కోదాడ.. ఇప్పుడు జనగామ, మంథని.. ఇలా చాలాచోట్ల అసమ్మతి వ్యక్తమవుతోంది. వీటిపై దృష్టిపెట్టిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్.. చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

- వివరాలు 3లో



**ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే జాతీయస్థాయిలో బీజేపీ కూటమి ఘన విజయం**

- 296 నుంచి 326 స్థానాల్లో ఎన్డీయే గెలుపు
- బీజేపీకి సొంతంగానే 288 నుంచి 314 సీట్లు
- విపక్ష 'ఇండియా'కు 160 నుంచి 190 స్థానాలే
- ఏపీలో 51.3% ఓట్లతో 24-25 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం.. 'టైమ్స్ నౌ' సర్వేలో వెల్లడి

# మళ్లీ ఎన్డీయేనే..

## ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

## తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు 9 నుంచి 11 స్థానాలు

**ఏ కూటమికి ఎన్ని సీట్లు**

| కూటమి | సీట్లు | ఓట్ల శాతం |
|---|---|---|
| ఎన్డీయే | 296–326 | 42.60 |
| ఇండియా | 160–190 | 40.20 |
| మొత్తం సీట్లు | 543 | - |

**ఏ పార్టీకి ఎన్ని సీట్లు**

| పార్టీ | సీట్లు |
|---|---|
| బీజేపీ | 288–314 |
| కాంగ్రెస్ | 62–80 |
| వైఎస్సార్‌సీపీ | 24–25 |
| డీఎంకే | 20–24 |
| టీఎంసీ | 22–24 |
| బీజేడీ | 12–14 |
| బీఆర్‌ఎస్ | 9–11 |
| ఆప్ | 5–7 |
| ఇతరులు | 70–80 |

న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయిలో అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ప్రఖ్యాత 'టైమ్స్ నౌ'సర్వే తేల్చిచెప్పింది. మొత్తం 543 స్థానాలకు గాను ఎన్డీయేకు 296 నుంచి 326, విపక్ష ఇండియా కూటమికి 160 నుంచి 190 స్థానాలు లభిస్తాయని వెల్లడించింది. ఎన్డీయేలోని ప్రధానపక్షమైన బీజేపీ సొంతంగానే 288 నుంచి 314 సీట్లు గెలుచుకుంటుందని స్పష్టం చేసింది. ఇక విపక్ష ఇండియా కూటమిలో ప్రధాన పార్టీ అయిన కాంగ్రెస్ 62 నుంచి 80 స్థానాలకే పరిమితం అవుతుందని పేర్కొంది. ఓట్ల శాతంపరంగా చూస్తే ఎన్డీయేకు 42.60శాతం, ఇండియాకు 40.20 శాతం

మిగతా 6వ పేజీలో ▶

# 'పీఎం విశ్వకర్మ'కు కేబినెట్ ఓకే

### రూ.13,000 కోట్లతో పథకం అమలు

- వచ్చే ఐదేళ్లలో 30 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సంప్రదాయ వృత్తుల్లోని వారికి రూ.2 లక్షల దాకా రుణసాయం
- లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ సదుపాయం
- దేశవ్యాప్తంగా 169 నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ బస్సులు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



కేబినెట్ నిర్ణయాలు వెల్లడిస్తున్న కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన 'ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ' సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రానున్న ఐదేళ్లలో అమలు చేయనున్న 'పీఎం విశ్వకర్మ' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. అలాగే పర్యావరణ హిత రవాణా సాధనాలకు పెద్దపీట వేయాలని కేంద్రం నిర్ణయానికొచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాలకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తోంది. ఇందులో భాగంగా 'పీఎం ఈ-బస్ సేవ'కూ ఆమోదం తెలిపింది.

6లో

18న ఉత్తర బంగాళాఖాతంలో

# అల్పపీడనం

**దీని ప్రభావంతో పలుచోట్ల మోస్తరు వర్షాలు**



ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఈ నెల 18న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈశాన్య బంగాళాఖాతం, తూర్పు, మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది.

- 2లో




అటవీ ప్రాంతాల్లో కడుపులో పడిన బిడ్డ పురుడు వరకు చేరాలంటే పుట్టెడు కష్టాలే. అర్ధరాత్రి అయినా, అడవి నుంచి రావాలంటే ఏ అంబులెన్స్‌లు ఉండవు. ఎడ్లబండే ఆధారం. ఓ గిరిజన గర్భిణికి ఒక్కసారిగా నొప్పులు రావడంతో ఎడ్లబండిపై తరలిస్తుండగా, మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది.

- 2లో



# ఆస్పత్రులకు ఇస్తున్న బడ్జెట్ ఎంత?

- దవాఖానాల్లో వసతులపై నివేదిక అందజేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

2లో









రాంగ్‌రూట్‌లో వచ్చిన

# మృత్యువు

- ఆటోను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన లారీ
- ఆరుగురు దుర్మరణం..

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు..ఎప్పటిలా బుధవారం కూడా ఉపాధిని వెతుక్కుంటూ బయలుదేరారు. కానీ ఎప్పటిలా వారు క్షేమంగా ఇంటికి చేరుకోలేదు. ఉదయాన్నే వారు ప్రయాణిస్తున్న ఆటోను మృత్యు శకటంలా దూసుకొచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా మరొకరు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్న పేట మండలంలో ఈ ప్రమాదం జరిగింది.

- 5లో

# తీర్పుల్లో మహిళల పట్ల అనుచిత పదాలు వాడొద్దు

- హ్యాండ్ బుక్ విడుదల చేసిన సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్



న్యాయస్థానాల్లో కేసుల విచారణ, తీర్పులు వెల్లడించే సమయంలో మహిళలపై వివక్షకు తావు లేకుండా కీలక ముందడుగు పడింది. వేశ్య, పతిత, ఎఫైర్, హౌస్‌వైఫ్, ట్రాన్స్‌సెక్సువల్, వ్యభిచారం వంటి పదాలు ఇక ఉపయోగించకూడదని సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు నిర్దేశించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ బుధవారం ఒక హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. ''హ్యాండ్‌బుక్ ఆన్ కంబాటింగ్ జెండర్ స్టీరియోటైప్స్''పేరుతో ఉన్న ఈ హ్యాండ్‌బుక్‌లో న్యాయస్థానాలు గతంలో ఇచ్చిన తీర్పుల సమయంలో మహిళల పట్ల అనుచితంగా ఉండే 100కి పైగా పదాలు అందులో ఉన్నాయి. ఆ పదాలకు బదులుగా ఏం వాడాలో కూడా అందులో వివరంగా రాశారు. ఈవ్‌టీజింగ్ బదులుగా స్ట్రీట్ సెక్సువల్ హెరాజ్‌మెంట్, హౌస్‌వైఫ్ బదులుగా హోమ్‌మేకర్ అన్న పదాలు వాడాలని నిర్దేశించింది.

- వివరాలు 6లో

# టీఆర్‌టీ ఎప్పుడు?

### అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రకటన ఇవ్వాలంటున్న నిరుద్యోగులు

- రాష్ట్రవ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో 20 వేలకు పైగా ఖాళీలు
- విద్యార్థులు లేక మూతపడుతున్న స్కూళ్లు
- సర్దుబాటు పేరుతో కొద్దిమంది పిల్లలున్న స్కూళ్ల మూత
- ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో టీఆర్‌టీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) ఎప్పుడనే చర్చ సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే టీఆర్‌టీ నిర్వహించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ప్రకటన ఇవ్వక ఐదేళ్లు అవుతోంది. 2017లో 8792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా, వాటిని 2020 వరకు భర్తీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేలకుపైగా ఉపాధ్యాయపోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా విభాగాల వారీగా చూస్తే హెచ్‌ఎం పోస్టులు 1985, స్కూల్ అసిస్టెంట్ 7300 పోస్టులు, సెకండరీ గ్రేడ్ 9వేలు, తత్సమాన పోస్టులు 2084 ఖాళీగా ఉన్నట్టు అధికారులే చెబుతున్నారు.

**ఐదేళ్లుగా 5 లక్షల మందికి పైగా...**

రాష్ట్రంలో గతేడాది నిర్వహించిన టెట్ పేపరు-1, పేపరు-2 పరీక్షలకు 6,29,369 మంది దరఖాస్తు చేసుకుంటే వీరిలో 2,25,613 మంది అర్హత సాధించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన టెట్‌లలో అర్హత సాధించినవారు లక్ష మంది, 2016 సంవత్సరంలో అర్హత సాధించిన వారు 1,11,357 మంది,

మిగతా 5వ పేజీలో ▶

**ఆయా పాఠశాలల్లో ఇదీ పరిస్థితి**

- సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 96 మంది విద్యార్థులున్నారు. ఏడాదిన్నరగా ఆ స్కూల్లో హిందీ, సోషల్ చెప్పే స్కూల్ అసిస్టెంట్లు లేరు. దీంతో ఎస్‌జీటీలతోనే లాగిస్తున్నారు.
- వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్‌లో 550 మంది విద్యార్థులకు సరిపడా సబ్జెక్టు టీచర్లు లేరు. దీంతో పరిసర పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఎస్‌జీటీలు బోధించాల్సి వస్తోంది.
- నల్లగొండ జిల్లా పెద్దవూర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 600 మంది విద్యార్థులకు 15 సెక్షన్లు ఉన్నాయి. ఆ పదిహేను సెక్షన్లకు ఒకే ఒక హిందీ టీచర్ ఉన్నారు.
- నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం గురజాలలో కొద్దిమంది పిల్లలే ఉండటంతో ఉన్నత పాఠశాలలను ఇటీవల మూసేశారు.
- హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో 850 మంది విద్యార్థులుండగా, టీచర్లు 23 మందే ఉన్నారు. దీంతో సెక్షన్లు కుదించారు. కనీసం ఇటీవల చేసిన సర్దుబాటులోనైనా సబ్జెక్టు టీచర్లను ఇవ్వలేదు.



# వీఆర్‌వోలు 'వెనక్కి'?

- సర్దుబాటు ప్రక్రియలో ఇతర శాఖల్లో కుదురుకోలేని గ్రామ రెవెన్యూ అధికారులు
- గరిష్టంగా 20ఏళ్లదాకా సీనియారిటీ ఉన్నా జూనియర్లుగా విధులు
- సొసైటీలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలకు వెళ్లిన వారికి వేతన కష్టాలు
- పలు చోట్ల అప్పటికే ఉన్న సిబ్బంది నుంచి వివక్ష!
- తమను వెనక్కి పంపాలంటూ హైదరాబాద్‌లో సమావేశమైన 33 జిల్లాల వీఆర్‌వోలు
- పేరు మార్చి మళ్లీ మాతృశాఖలోకి తీసుకోవాలని విజ్ఞప్తి..
- ఈ సమావేశం నిర్వహణ వెనుక కొందరు ప్రభుత్వ నేతలు?
- రెవెన్యూలోకి తీసుకుని భూసంబంధిత అంశాలు కాకుండా మిగతా పనులు అప్పజెప్పే యోచన



సాక్షి, హైదరాబాద్: జీతం లేదు.. సీనియారిటీ లేదు.. పదోన్నతులు రావు... పనిచేసేందుకు వెళ్లిన శాఖలో వివక్ష... ఉన్నచోట ఒక్కరికే పది పనులు.. లేనిచోట ఎలాంటి పనీ లేదు.. పేరుకే జూనియర్ అసిస్టెంట్... చేయాల్సింది మాత్రం తోటమాలి, వాచ్‌మన్, అటెండర్ పనులు.. ఇవీ ఇతర శాఖల్లోకి వెళ్లిన 'గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌వోల)'పరిస్థితి. సర్దుబాటులో భాగంగా ఇతర శాఖల్లోకి వెళ్లినవారు ఆయా చోట్ల కష్టాలు, సమస్యలను తట్టుకోలేక.. తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై కొన్నినెలలుగా చర్చ సాగుతున్నా.. వీఆర్‌ఏల సర్దుబాటు నేపథ్యంలో బలంగా తెరపైకి వస్తోంది. వీఆర్‌ఏలను సర్దుబాటు చేసిన తరహాలోనే తమకు కూడా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలనే డిమాండ్ వస్తోంది. దీనికి ప్రభుత్వంలోని కొందరు పెద్దలు కూడా మద్దతు ఇస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో వీఆర్వోలకు పేరు మార్చి, రెవెన్యూశాఖలోనే భూసంబంధిత పనులు కాకుండా ఇతర విధులు అప్పగించేందుకు సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

**ఏదో ఒక ఇబ్బందితో..**

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టులో వీఆర్వోల వ్యవస్థను రద్దు చేయడంతో.. సుమారు 5,400 మంది వివిధ ప్రభుత్వ శాఖలకు వెళ్లాల్సి వచ్చింది. విద్య, మున్సిపల్, వైద్య, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇలా పలు ప్రభుత్వ శాఖలు, విభాగాల్లో వారిని సర్దుబాటు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖల్లోకి రావడంతో వారి సీనియారిటీని కోల్పోయారు. ఆరేళ్ల నుంచి గరిష్టంగా

మిగతా 2వ పేజీలో ▶

## క్లుప్తంగా...

### రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితో గవర్నర్ దత్తాత్రేయ భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌లతో భేటీ అయ్యారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీల్లో దత్తాత్రేయతో పాటు ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మి కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హరియాణాలో వరద పరిస్థితి, బాధితులను ఆదుకోవడానికి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. మహిళా సాధికారతకు ఉద్దేశించిన కార్యక్రమాలు, పథకాలతో సహా రాష్ట్రంలో వివిధ అభివృద్ధి, సంక్షేమ పనులపై కూడా దత్తాత్రేయ రాష్ట్రపతితో చర్చించారు.

### వాజ్‌పేయి బాటలో మోదీ అడుగులు

భారత్‌ను 'విశ్వగురు'గా తీర్చిదిద్దుతున్నారు: బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: వాజ్‌పేయి ఆలోచనలకు అనుగుణంగా నడుస్తూ ప్రధాని మోదీ భారత్‌ను 'విశ్వగురు'గా తీర్చిదిద్దుతున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. నాడు వాజ్‌పేయి హయాంలో వీరోచిత కార్గిల్ పోరాటం జరిగితే.. మోదీ సర్జికల్ స్ట్రైక్స్‌తో పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించారన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బుధవారం ఢిల్లీలోని ఆయన సమాధివద్ద బండి సంజయ్ నివాళి అర్పించారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం చిల్లర రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాలున్న ఈరోజుల్లో.. అందుకు భిన్నంగా ప్రతిపక్షమంటే ప్రజల పక్షమని నిరూపించిన.. దేశ ప్రయోజనాల కోసం రాజకీయాలను పక్కనపెట్టి పాలక పక్షానికి సహకరించిన చరిత్ర వాజ్‌పేయిదని గుర్తు చేసుకున్నారు. పదవుల కోసం ఎంతకైనా దిగజారే వ్యక్తులున్న ఈరోజుల్లో.. అందుకు భిన్నంగా నమ్మిన సిద్ధాంతం, విలువల కోసం కేంద్ర మంత్రి, ప్రధానమంత్రి వంటి పదవులను వదిలేసుకున్న మహా నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు.

### వాజ్‌పేయికి బీజేపీ నివాళి

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎన్. ఇంద్రసేనా రెడ్డి, పార్టీ నాయకుడు ప్రేమేందర్ రెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పనిచేసిన గొప్పనేత వాజ్‌పేయి అని కొనియాడారు.

### సొంత రాజకీయాల కోసమే మోదీ ప్రసంగం

ప్రధానిపై పొన్నాల లక్ష్మయ్య మండిపాటు



సాక్షి, న్యూఢిల్లీ: సొంత రాజకీయాల కోసమే స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా ఎర్రకోటపై ప్రధాని మోదీ ప్రసంగించారని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. కోవిడ్ సంక్షోభ సమయంలో గంట కొట్టారు, దీపాలు పెట్టారు, చప్పట్లు కొట్టారు తప్ప.. దానివల్ల కోవిడ్ ఏమైనా తగ్గిందా? అని పొన్నాల ప్రశ్నించారు. కోవిడ్ వ్యాక్సిన్ గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు ఉపాధి అవకాశాలు కోల్పోయిన లక్షలాది మంది గురించి ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో పొన్నాల మీడియాతో మాట్లాడుతూ ప్రధానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో శాంతి వస్తుందని చెబుతోన్న ప్రధాని.. ఆ దిశగా కేంద్రం ఏ చర్యలు తీసుకుందో చెప్పాలన్నారు. ప్రధాని మణిపూర్‌లో పర్యటించి ప్రజలకి విశ్వాసం కలిగించి ఉంటే బాగుండేదని పొన్నాల అభిప్రాయపడ్డారు. ఇక పార్లమెంట్‌లో తొమ్మిదేళ్లుగా మహిళా బిల్లు, పార్టీ ఫిరాయింపుల చట్టం బిల్లు ఎందుకు పెండింగ్‌లో ఉంచారని ప్రశ్నించారు.

### రాష్ట్రానికి ఐఏఎస్ శివకుమార్ నాయుడు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర కేడర్ ఐఏఎస్ అధికారి కిల్లు శివకుమార్ నాయుడును డిప్యుటేషన్ గడువు ముగియడానికి ముందే కేంద్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. సత్వరమే సొంత రాష్ట్రంలో రిపోర్టు చేయాలని ఆయన్ను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.

ముద్ఖేడ్–డోన్ | బీబీనగర్–గుంటూరు

# రెండో లైన్‌కు గ్రీన్ సిగ్నల్

**కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం**

- వచ్చే బడ్జెట్‌లో నిధుల విడుదలకు అవకాశం
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న కీలక ప్రాజెక్టులకు ఎట్టకేలకు మోక్షం



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని రెండు ప్రధాన రూట్‌లతో రైల్వే ప్రాజెక్టులకు లైన్ క్లియర్ అయ్యింది. ముద్ఖేడ్–మేడ్చల్–మహబూబ్‌నగర్–డోన్, గుంటూరు–బీబీనగర్ సెక్షన్ల మధ్య రెండో రైల్వేలైన్ చేపట్టేందుకు మార్గం సుగమమైంది. వాస్తవానికి ఈ రెండు రైల్వే రూట్‌లలో ప్రాజెక్టులు ఎన్నో ఏళ్ల క్రితమే మంజూరై, సర్వేలు కూడా చేశారు. కానీ ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. బుధవారం ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఏడు ప్రాజెక్టులకు మొత్తం రూ.32,512.39 కోట్ల అంచనా వ్యయంతో ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధాని అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశ అనంతరం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సమాచారప్రసార శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌లు కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించారు. ఏడు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల్లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, గుజరాత్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని 35 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్‌ల అభివృద్ధి మరింత జరుగుతుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలకంగా మారే ముద్ఖేడ్– డోన్, గుంటూరు– బీబీనగర్ ప్రాజెక్టులను రూ. 7,539 కోట్ల నిధులతో చేపట్టనున్నారు. వచ్చే బడ్జెట్‌లో వీటికి నిధులు మంజూరు చేస్తారు.

**ముద్ఖేడ్ - డోన్ డబ్లింగ్ ప్రాజెక్టు**

| | |
|---|---|
| అంచనా వ్యయం | రూ.4686.09 కోట్లు |
| నిడివి | 417.88 కిలోమీటర్లు |
| తెలంగాణ | 294.82 కి.మీ (నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల జిల్లాలు) |
| ఏపీ | 73.91 కి.మీ (కర్నూలు జిల్లా) |
| మహారాష్ట్ర | 49.15 కి.మీ (నాందేడ్ జిల్లా) |

| | | |
|---|---|---|
| జంక్షన్ స్టేషన్లు-6 క్రాసింగ్ స్టేషన్లు-39 హాల్ట్ స్టేషన్లు-20 | డబ్లింగ్‌తో హైదరాబాద్ - బెంగుళూర్ మధ్య 90 కి.మీ. తగ్గుతుంది | సికింద్రాబాద్- గుంతకల్ మధ్య వాడి మార్గంతో పోలిస్తే 50 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది |

- సికింద్రాబాద్ టు డోన్, సికింద్రాబాద్ టు ముద్ఖేడ్ వరకు డబ్లింగ్ పనులు రెండు భాగాలుగా కొనసాగుతాయి.
- సికింద్రాబాద్ టు ముద్ఖేడ్ రూట్‌ను ఒక్కసారి పరిశీలిస్తే...సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్ రెండోదశ కింద రెండో లైన్ పూర్తయింది. ఇప్పుడు మేడ్చల్ నుంచి ముద్ఖేడ్ వరకు వయా నిజామాబాద్ మీదుగా డబ్లింగ్ పనులు చేయాల్సి ఉంటుంది.
- ఇక సికింద్రాబాద్ టు డోన్ రూట్‌లో ఇప్పటికే మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తయింది. ఇప్పుడు మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు రెండో రైల్వేలైన్ పనులు చేపడతారు.
- సికింద్రాబాద్ టు ముద్ఖేడ్ రూట్‌లో ప్రస్తుతం సింగిల్ రూట్ ఉన్న కారణంగా లైన్ సామర్థ్య వినియోగం 167 శాతానికి చేరుకుంది. ట్రాఫిక్ అధికంగా ఉండటం, సామర్థ్యానికి మించి రైళ్లు తిరుగుతుండటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. డిమాండ్ దృష్ట్యా కొత్త రైళ్లు నడపటం సాధ్యం కావటం లేదు. దీంతో డబ్లింగ్ అనివార్యమైంది. మూడేళ్ల క్రితమే ప్రాజెక్టు మంజూరు చేసినా, నిధుల విడుదలకు ఇప్పుడు మార్గం సుగమమైంది.
- ముద్ఖేడ్ ఆవల మన్‌మాడ్ వరకు వెళ్లి ప్రధాన ట్రంక్ లైన్‌తో కలుస్తుంది. ముద్ఖేడ్ తర్వాత పర్భణి–మన్మాడ్ మధ్య డబ్లింగ్ పూర్తి కాగా, ఇప్పుడు ఈ పనులు మొదలవుతున్నాయి. ఇది పూర్తయితే, అటు బెంగుళూరు నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి అనుసంధానం అయ్యే ప్రధాన ప్రత్యామ్నాయ మార్గంగా మారుతుంది. అప్పుడు బెంగుళూరు–హైదరాబాద్–ముంబై ప్రధాన నగరాల మధ్య ప్రయాణికుల రైళ్ల సంఖ్య పెరగటంతో పాటు వాటి వేగం పెరుగుతుంది. ట్రంక్ లైన్‌తో పోలిస్తే దూరం తగ్గి ప్రయాణ సమయం తగ్గుతుంది.
- బల్హర్షా–కాజీపేట–సికింద్రాబాద్, కాజీపేట -విజయవాడ సెక్షన్ల మధ్య కూడా ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. బల్హర్షా–రామగుండం–సికింద్రాబాద్–వాడి– గుంతకల్ సెక్షన్లకు బొగ్గు, స్టీల్ రవాణాకు ప్రత్యామ్నాయ మార్గంగా ఉంటుంది.

**ఈ రూట్‌లో ఉన్న ప్రధానమైనవి**

- **బొగ్గు:** రామగుండం, మంచిర్యాల, మందమర్రి
- **ఆర్థిక కారిడార్లు:** రాయచూరు–దేవరకద్ర, కర్నూలు -పీలేరు, కొడంగల్–మహబూబ్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్–చిట్యాల, సంగారెడ్డి–హైదరాబాద్, ముత్తంగి–మంచిరేవుల
- **థర్మల్ పవర్ ప్లాంట్లు:** పర్లి వద్ద మహా జెన్‌కో కర్ణాటకలోని రాయచూర్, యెర్మరస్‌లో కేపీసీసీ, ఆంధ్రప్రదేశ్‌లోని ముద్దనూరు వద్ద ఏపీజెన్‌కో
- **ఆహార ధాన్యాల తరలింపు ప్రాంతాలు:** ముద్ఖేడ్, బోధన్, నిజామాబాద్, కామారెడ్డి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు
- **ఇండస్ట్రియల్ క్లస్టర్:** హైదరాబాద్, నిజామాబాద్, నాందేడ్ , మెదక్, కర్నూలు, గద్వాల, ఇటిక్యాల, గుండ్లపోచంపల్లి, బహదూర్‌పల్లి
- **గిడ్డంగులు–శీతల గిడ్డంగులు:** నిజామాబాద్, బోధన్ , సారంగాపూర్ , బండమల్లారం , మహబూబ్‌నగర్, గద్వాల

**గుంటూరు -బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు**

| | |
|---|---|
| అంచనా వ్యయం | రూ.2853.23 కోట్లు |
| నిడివి | 239 కిలోమీటర్లు |
| తెలంగాణ | 139 కి.మీ (నల్లగొండ, యాదాద్రి-భువనగిరి జిల్లాలు) |
| ఏపీ | 100 కి.మీ (పల్నాడు, గుంటూరు జిల్లాలు) |

| | | |
|---|---|---|
| జంక్షన్ స్టేషన్లు-6 క్రాసింగ్ స్టేషన్లు-22 హాల్ట్ స్టేషన్లు-4 | డబ్లింగ్‌తో సికింద్రాబాద్ - విజయవాడకు మధ్య 27 కి.మీ. దూరం తగుతుంది. | ఇదే సమయంలో హైదరాబాద్ - చెన్నై మధ్య కూడా 27 కి.మీ. దూరం తగ్గుతుంది. |

- హైదరాబాద్ నుంచి వరంగల్ రైల్వే రూట్‌లో బీబీనగర్‌కు డబ్లింగ్ ఉంది. ఇక్కడి నుంచి గుంటూరు మీదుగా తెనాలి వద్ద ప్రధాన లైన్‌ను కలిసే ప్రత్యామ్నాయమార్గంగా బీబీనగర్–గుంటూరు మధ్య రెండో లైన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఎట్టకేలకు ఇప్పుడు కేంద్రం కనికరం చూపి దానికి నిధులు మంజూరు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, హైదరాబాద్- విజయవాడ ప్రధాన లైన్‌పై ఒత్తిడి బాగా తగ్గుతుంది. ప్రస్తుతం ట్రంక్‌లైన్ సామర్థ్యానికి మించి 137 శాతం వినియోగంలో ఉంది. ఫలితంగా కొత్త రైళ్లు నడిపేందుకు కష్టంగా మారింది. ప్రధాన ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గించే కీలక ప్రాజెక్టు ఇప్పుడు ఎట్టకేలకు సాకారం కాబోతోంది. గుంటూరు–బీబీనగర్ సెక్షన్ లైన్ సామర్థ్య వినియోగం 148 శాతంగా ఉంది. రెండో లైన్‌నిర్మాణంతో ఆ సమస్య పరిష్కారమై కొత్త రైళ్లు ఆ మార్గంలో మళ్లించేందుకు అవకాశం ఉంటుంది. కొన్నేళ్లలో ఈ మార్గంలో కొత్తగా సిమెంటు కార్మాగారాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో గూడ్స్ రైళ్ల సంఖ్య కూడా పెరుగుతుంది.

**ఈ రూట్‌లో ఉన్న ప్రధానమైనవి**

- **ఇనుము–ఉక్కు:** చిట్యాల– నార్కట్‌పల్లి .
- **సిమెంట్ ప్లాంట్లు:** విష్ణుపురం, నడికుడి, తుమ్మలచెరువు, జాన్‌పహాడ్, మేళ్లచెరువు, మఠంపల్లి, జగ్గయ్యపేట, రామాపురం
- **థర్మల్ పవర్ ప్లాంట్:** విష్ణుపురం సమీపంలో 4000 ఎంపీ థర్మల్ ప్లాంట్ (అందుబాటులోకి రావాలి)
- **ఆహార ధాన్యాలు:** నాగిరెడ్డిపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ ఎఫ్‌సీఐలు
- **ఇండస్ట్రియల్ క్లస్టర్:** హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విష్ణుపురం, నార్కట్‌పల్లి
- **గిడ్డంగులు:** హైదరాబాద్ చుట్టూ 100కి పైగా వేర్ హౌస్‌లు - గుంటూరు చుట్టూ 50కి పైగా కోల్డ్ స్టోరేజీలు

**ఖోర్డా రోడ్ - విజయ నగరం రూట్‌లో..** భద్రక్–విజయనగరం సెక్షన్‌లోని ఖోర్దా రోడ్–విజయనగరం రూట్‌లో ఒడిశాలోని భద్రక్, జజ్‌పూర్, ఖోర్దా, కటక్, గంజాం జిల్లాలో 184 కి.మీ, ఏపీలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలోని 201 కి.మీ మేర మూడోలేన్ పనులు జరుగుతాయి. దీనికి రూ.5618.26 కోట్లు ఖర్చు చేయనున్నారు.



“ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఎంతగానో ఉపయోగపడే ముద్ఖేడ్ –మేడ్చల్, మహబూబ్‌నగర్ -డోన్ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిన ప్రధాని మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఎంపీ అర్వింద్ ధన్యవాదాలు తెలిపారు. డబుల్ రైల్వేలైన్ పూర్తయితే నిజామాబాద్ నుంచి ముంబై, పూణె, షిరిడీలతో పాటు నిజామాబాద్ నుంచి బెంగళూరుల మధ్య రైల్వే కనెక్టివిటీ పెరిగి, ప్రయాణ మార్గం సులభతరం అవుతుందన్నారు.

# వీఆర్‌వోలు 'వెనక్కి'?




మాట్లాడుతున్న వంగ రవీందర్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

20ఏళ్లవరకు సీనియారిటీని కోల్పోవాల్సి వచ్చిందని వారు వాపోతున్నారు. పేరుకు జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఇతర శాఖల్లో చేరినా.. ఆయాచోట్ల రికార్డు అసిస్టెంట్‌గా, తోటమాలిగా, అటెండర్‌గా పనిచేయాల్సి వస్తోందని అంటున్నారు. మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లుగా వెళ్లిన వారికి కనీసం కూర్చునేందుకు కూడా కుర్చీలు లేవని చెప్తున్నారు. హైదరాబాద్ శివార్లలోని ఓ మున్సిపాలిటీలో వార్డు అధికారిగా చేరిన ఓ వీఆర్వోకు శక్తికి మించిన బాధ్యతలు ఇచ్చారని.. లీగల్ సెల్, ఇళ్లు కూలగొట్టడం, ప్రకృతి వైపరీత్యాల పర్యవేక్షణ, చెట్ల పెంపకం, పార్కుల పరిరక్షణ, చెరువుల పరిరక్షణ, ఆసరా పింఛన్లలో వేలిముద్రల గుర్తింపు పనులు అప్పగించారని వీఆర్వో వర్గాలు చెప్తున్నాయి. అన్ని పనులు చేయలేక మానసిక వేదనతో సదరు వీఆర్వో బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారని అంటున్నాయి.

**పని లేక.. జీతాలు రాక..**

ఇక సొసైటీలు, కార్పొరేషన్లు, కొన్ని స్థానిక సంస్థల పరిధిలోకి వెళ్లిన వీఆర్వోలకు స్థానిక నిధుల నుంచే వేతనం ఇస్తుండటంతో.. కొందరికి నాలుగైదు నెలలుగా జీతాల్లేవని అంటున్నారు. కొన్నిజిల్లాల్లో అవసరమైన ఉద్యోగుల సంఖ్య (కేడర్ స్ట్రెంత్)కు మించి పోస్టింగులు ఇచ్చారని, ఐదుగురు సిబ్బంది అవసరమైన చోటకు 10 మందిని పంపారని, అక్కడ ఎలాంటి విధులు నిర్వహించాలో కూడా తెలియక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీనికితోడు అప్పటికే ఆయా శాఖల్లో పనిచేస్తున్న రెగ్యులర్ సిబ్బంది నుంచి వివక్ష ఎదుర్కోవాల్సి వస్తోందని, తమకు పదోన్నతులు రాకుండా వచ్చారా? అంటూ మండిపడుతున్నారని చెప్తున్నారు. మరోవైపు సొంత శాఖలో సమస్యలు కూడా పరిష్కారం కాక మాజీ వీఆర్వోలు రెవెన్యూ శాఖ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ప్రొబేషన్ డిక్లరేషన్, సర్వీసు వ్యవహారాల ఫైళ్లు సీసీఎల్ఏ, రెవెన్యూ కార్యదర్శి పేషీల్లో పెండింగ్‌లో ఉన్నాయని.. ప్రత్యేక, సాధారణ ఇంక్రిమెంట్లు, పీఆర్సీ వర్తింపు అంశాల్లో ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం తమకు సమస్యగా మారిందని వీఆర్వోలు వాపోతున్నారు.

**సంఘాలకు అతీతంగా సమావేశమై..**

తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన మాజీ వీఆర్వోలు బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశమయ్యారు. సంఘాలకు అతీతంగా 'సమస్యలపై చర్చ–ప్రభుత్వానికి నివేదన'అనే నినాదంతో తమ ఉద్యోగ హక్కులకు భద్రత కల్పించాలని.. లేదంటే మాతృశాఖకు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఆర్వోలను ఇతర శాఖల్లో కలపడం వల్ల సీనియారిటీ దెబ్బతింటుందని, వేల మంది ఇబ్బందిపడుతున్నారని టీఆర్‌ఈఎస్‌ఏ అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసుకు భద్రత లేక వారంతా ఆందోళనలో కూరుకుపోయారన్నారు. అయితే.. వీఆర్వోల సమావేశం నిర్వహణ వెనుక ప్రభుత్వంలో కీలక హోదాలో ఉన్న కొందరు నాయకులు ఉన్నారని, వారి సలహా మేరకే ఈ సమావేశం నిర్వహించారని సమాచారం. భూసంబంధిత అంశాలు మినహా మిగతా రెవెన్యూ వ్యవహారాలను చూసుకునేందుకు వీఆర్వోల పేరు మార్చి మళ్లీ రెవెన్యూశాఖలోకి తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే ప్రచారం జరుగుతోంది.

**వీఆర్‌ఏలతోనే తంటా!**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వీఆర్‌ఏ సర్దుబాటు ప్రక్రియ వీఆర్వోలలో అలజడికి కారణమైంది. తమకంటే కింది కేడర్‌లో పనిచేసిన వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపజేయడంతోపాటు సూపర్ న్యూమరరీ పోస్టు లు సృష్టించి మరీ.. రెవెన్యూ శాఖల్లోనే కొనసాగిస్తున్నారని, అదే పద్ధతిని తమ విషయంలో ఎందుకు పాటించలేదని వీఆర్వోలు ప్రశ్నిస్తున్నారు. సర్వీసు వ్యవహారాలు పెండింగ్‌లో ఉండటంతో చాలా జిల్లాల్లో వేతనాలు రావడం లేదని, ప్రతి విషయానికి ఏదో ఒక అడ్డంకి వస్తోందని అంటున్నారు. రెవెన్యూలో మరిన్ని సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి, తమను వెనక్కి తీసుకోవడమే ఏకైక పరిష్కారమని పేర్కొంటున్నారు.

# అడవిబిడ్డ ప్రసవ వేదన

- కనీస రోడ్లు కరువు... తరలించేందుకు అష్టకష్టాలు
- అర్ధరాత్రి వేళలో ఎడ్లబండిలో మగబిడ్డకు జన్మ




పండంటి మగబిడ్డతో తల్లి కవిత

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని ఉమార్డ(బి) గ్రామానికి చెందిన జుగ్నక్ కవితకు మంగళవారం రాత్రి 8గంటల సమయంలో ఒక్కసారిగా పురిటినొప్పులు మొదలయ్యాయి. మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించాలంటే ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు సౌకర్యం లేదు. ఏ వాహనమూ వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఎడ్లబండిలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కవితతో ఆశ వర్కర్ ఇతర కుటుంబసభ్యులు ఎడ్లబండిపై బయలుదేరారు. మార్గమధ్యలోకి వచ్చేసరికి పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. అసలే అడవి, అదీ చిమ్మ చీకటి అయినా ఎడ్లబండిలోనే ఆశ వర్కర్ సహకారంతో కవిత మగబిడ్డను ప్రసవించింది. అనంతరం అక్కడి నుంచి కడెం వాగు దాటి గిరిజాయి గ్రామ సమీపంలోకి చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో 10 కిలోమీటర్ల దూరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అర్ధరాత్రి 12.34 గంటలకు వైద్య సిబ్బంది ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. మెడికల్ ఆఫీసర్ శిల్ప వైద్య పరీక్షలు చేసి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు చెప్పారు.

# ఆస్పత్రులకు ఇస్తున్న బడ్జెట్ ఎంత?

- దవాఖానాల్లో వసతులపై నివేదిక అందజేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులకు ఎంత బడ్జెట్ ఇస్తున్నారు..? గ్రామీణ, తాలూకా, జిల్లాస్థాయి ఆస్పత్రుల్లో వసతులు ఎలా ఉన్నాయి..? ఎంతమంది వైద్యులు అవసరం.. ఇప్పుడు ఎంతమంది ఉన్నారు..? ఇతర సిబ్బంది పరిస్థితి ఏంటి..? తదితర అంశాలపై పూర్తినివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, ప్రజారోగ్య, కుటుంబసంక్షేమ డైరెక్టర్‌తో పాటు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా వేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన స్వర్ణకు గత డిసెంబర్ 26వ తేదీ రాత్రి 8:30 గంటల సమయంలో పురిటినొప్పులు వచ్చా యి. ప్రైవేటు వాహనంలో ఆమెను పదర పీహెచ్‌సీకి, అక్కడి నుంచి అమ్రాబాద్ పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి అచ్చంపేట ఆస్పత్రికి.. ఆ తర్వాత మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడకు చేరుకునే సరికి రాత్రి 2:30 గంటలైంది. వైద్యులు సాధారణ ప్రసవం చేశారు. కాసేపటికే ఊపిరి తీసుకోలేక శిశువు, అరగంట తర్వాత ఆ బాలింత మరణించారు. ఈ ఘటన వివరాలు పత్రికల్లో చూసిన హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. అచ్చంపేట ప్రభుత్వా స్పత్రికి మహిళను తీసుకొచ్చిన సమయంలో వెంటిలేటర్ అవసరమైందని, అక్కడ ఆ సౌకర్యం లేకపోవడంతో మరో చోటకు తరలించాల్సి వచ్చిందని మెడికల్ సూపరింటెండెంట్ అఫిడవిట్ లో పేర్కొన్నారు. వాదనల అనంతరం కోర్టు నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

# 18న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం



సాక్షి, హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఈ నెల 18న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈశాన్య బంగాళాఖాతం, తూర్పు, మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టంనుంచి సగటున 4.5 కిలోమీటర్ల నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు మధ్య కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఈ నెల 18న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఈనెల 20 నుంచి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

**ఈ నెలలో ఇప్పటివరకు అంతంతే..**

ఆగస్టు నెలలో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన మేర కురవలేదు. గత నెలలో సాధారణం కంటే అత్యధిక వర్షాలు నమోదు అయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 47.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 58.37 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో సాధారణం కంటే 23 శాతం అధిక వర్షపాతం నమోదైనప్పటికీ.. గత నెలలో కురిసిన వర్షాల వల్ల 63%అధికం నుంచి ప్రస్తుతం 23% అధికం వద్ద గణాంకాలు స్థిరపడ్డాయి. ఈ నెల మూడో వారం నుంచి వర్షాలు ఆశాజనకంగా ఉంటాయని, ఆగస్టు చివరి వారంలో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనాలను విడుదల చేసింది. 18న ఏర్పడే అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు జోరందుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# విద్యుదుత్పత్తికి ఎంత నీటిని కిందకు వదిలారు?

జెన్‌కోకు నీటిపారుదల శాఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత వర్షాకాలంలో విద్యుదుత్పత్తి ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి ఎన్ని నీళ్లను దిగువకు విడుదల చేశారో తెలపాలని జెన్‌కోను రాష్ట్ర నీటిపారుదల శాఖ కోరింది. శ్రీశైలం జలాశయం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా 12 టీఎంసీలను కిందకి విడుదల చేశారని ఇటీవల ఏపీ కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసింది. దీంతో వాస్తవాల పరిశీలన కోసం విద్యుదుత్పత్తి ద్వారా విడుదల చేసిన నీటి వివరాలను తెలపాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ జెన్‌కో సీఎండీకి లేఖ రాశారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఏపీ పరిధిలో ఉండగా, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం ఏపీ, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రం తెలంగాణ చేతిలో ఉంది. వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగిపోయింది. గరిష్ట డిమాండ్ వేళల్లో మాత్రమే శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్నామని జెన్‌కో వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఏఎన్‌ఎంల క్రమబద్ధీకరణ అసాధ్యం

ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్‌ఎంల క్రమబద్ధీకరణ సాధ్యం కాదని ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. దీనికి బదులుగా వెయిటేజ్ మార్కులు కలుపుతామని, వయో పరిమితి సడలింపు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంల సమ్మె నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశాలతో బుధవారం డాక్టర్ శ్రీనివాసరావు సంబంధిత ఏఎన్‌ఎం ప్రతినిధులతో తన కార్యాలయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న వారికే రెగ్యులర్ ఉద్యోగాలు వచ్చేలా సహకరిస్తామని పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ డిమాండ్‌ను పక్కనబెట్టి ఇంకేదైనా సూచనలుంటే చేయాలని, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం వెలువడేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, పరిష్కార మార్గాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా విధుల్లో చేరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 41.74 లక్షల ఎకరాల్లో వరి నాట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం కోటి ఎకరాలకు పైగా చేరుకుంది. ఈ సీజన్లో సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.01 కోట్ల (81.85%) ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. గతేడాది ఇదే సమయానికి 94.93 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈసారి గణనీయంగా పెరిగింది. ఇక వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 41.73 లక్షల (83.70%) ఎకరాల్లో నాట్లు పడ్డాయి. భారీ వర్షాలు కురవడంతో వ్యవసాయం ఊపుమీదుంది. అధిక వర్షాల కారణంగా ఒకవైపు పంట నష్టం జరిగినా, ఆ పరిస్థితి నుంచి ఇప్పుడిప్పుడే రైతులు బయటపడుతున్నారు. అలాగే మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 5.06 లక్షల ఎకరాల్లో సాగైంది. గతేడాది ఇదే సమయానికి 4.98 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, గతేడాది ఇదే సమయానికి 48.19 లక్షల ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 44.57 లక్షల ఎకరాల్లో సాగైంది. వాస్తవంగా ఈ ఏడాది 65 లక్షల నుంచి 70 లక్షల ఎకరాల్లో పత్తిని సాగు చేయించాలని వ్యవసాయశాఖ భావించింది. ఆ మేరకు రైతులకు పిలుపునిచ్చింది. కానీ సకాలంలో రుతుపవనాలు రాకపోవడం, కీలకమైన జూన్, జూలై రెండో వారం వరకు వర్షాలు లేకపోవడంతో అదను దాటిపోయింది. దీంతో పత్తి సాగు విస్తీర్ణం అనుకున్నదానికంటే గణనీయంగా తగ్గిందని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 5.25 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.43 లక్షల ఎకరాల్లో సాగైంది.

**19 జిల్లాల్లో 75 శాతానికిపైగా సాగు...**

వివిధ జిల్లాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా నాలుగు జిల్లాల్లో వంద శాతానికి పైగా నమోదైంది. మెదక్ జిల్లాలో 121.29 శాతం, ఆదిలాబాద్ జిల్లాలో 104.17 శాతం, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 104.53 శాతం, నిజామాబాద్ జిల్లాలో 103.68 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

## క్లుప్తంగా...

### సీఎం కేసీఆర్ మెదక్ జిల్లా పర్యటన ఈనెల 23కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలపై వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఈ నెల 19న నిర్వహించ తలపెట్టిన మెదక్ జిల్లా పర్యటనను 23కి వాయిదా పడింది. ఈ మేరకు సీఎంవో కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. మెదక్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కార్యాలయాలతో పాటు బీఆర్ఎస్‌పార్టీ జిల్లా కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించాల్సి ఉంది. అనంతరం పార్టీ తరఫున నిర్వహించే సభలో పాల్గొననున్నారు.

### కాంగ్రెస్ ఏం చేసిందో మీ నాన్నను అడుగు

**కేటీఆర్‌కు షబ్బీర్‌అలీ సూచన**



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నిస్తున్న కేటీఆర్.. తన తండ్రిని అడిగితే సమాధానం దొరుకుతుందని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ సూచించారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 100 రోజుల తర్వాత కేటీఆర్ ఎక్కడ ఉంటాడో చూసుకోవాలని, ఇలాంటి మాటలు కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేటీఆర్‌తో సహా మంత్రులు నియోజకవర్గాలకు వెళ్లినప్పుడు అక్కడి కాంగ్రెస్ నేతలను అరెస్టు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కామారెడ్డి నుంచే పోటీ చేస్తానని, కేసీఆర్ అక్కడికి వచ్చి పోటీ చేస్తానంటే ఎవరూ కాదనరని షబ్బీర్‌అలీ స్పష్టం చేశారు.

### బీఆర్ఎస్‌లో 'స్వరాజ్య మహిళా సంఘటన' విలీనం

**కేసీఆర్ సమక్షంలో మహారాష్ట్ర నేతల చేరిక**

సాక్షి, హైదరాబాద్: మహిళా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న మహారాష్ట్రకు చెందిన 'స్వరాజ్య మహిళా సంఘటన' బీఆర్ఎస్ పార్టీలో విలీనమైంది. మహిళా సంఘటన అధ్యక్షురాలు వనితా తాయి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో తమ సంఘం విలీనమవుతున్నట్లు ప్రకటించారు.పార్టీలో చేరిన మహిళా సంఘటన నేతలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో మహిళాభ్యున్నతి, సంక్షేమం కోసం అమలవుతున్న పథకాలు తమను ఆకట్టుకున్నాయని వనితా తాయి వెల్లడించారు. పేదలు, పీడితులు, అసహాయులు, వితంతువుల సంక్షేమ, స్వావలంబన కోసం పనిచేస్తున్న స్వరాజ్య మహిళా సంఘటన బీఆర్ఎస్‌తో కలిసి పనిచేసేందుకు విలీనం చేశామని చెప్పారు. కాగా, మహారాష్ట్రలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన పలు పార్టీల నాయకులు శంకరన్న ధోండ్గే నేతృత్వంలో బీఆర్ఎస్‌లో చేరారు.

### ఇంటింటికీ మద్యం అందిస్తున్న కేసీఆర్: బూర నర్సయ్య



సాక్షి, హైదరాబాద్: ప్రధానిమోదీ ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించేందుకు 'హర్ ఘర్ తిరంగా'నినాదంతో ముందుకు సాగుతుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ మాత్రం 'హర్ ఘర్ మద్యం'అంటూ ఇంటింటికీ మందును సరఫరా చేస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఊరూరా మద్యం దుకాణంతోపాటు రాష్ట్రంలో 60 వేల బెల్ట్ షాపులు నడుస్తున్నాయని అన్నారు. మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో గౌడ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అని చెప్పిన సర్కార్ దుకాణం దరఖాస్తు కోసమే రూ. 2లక్షల నాన్ రిఫండ్ ఫీజు వసూలు చేస్తోందని విమర్శించారు. గౌడ్లకు సంబంధించి రిజర్వేషన్ చేసిన మద్యం దుకాణాలను గీత కార్మికుల సొసైటీలకు ఇవ్వాలని, ఎస్సీలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాలకు టెండర్ వేయడానికి రూ. 25 వేల ఫీజు మాత్రమే పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక ఎలైట్ షాప్స్ కేవలం కేసీఆర్ బినామీలే తీసుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అత్యధికంగా మద్యం రేట్లు ఉన్న రాష్ట్రం తెలంగాణ అని విమర్శించారు.

### రేపటి నుంచి కాంగ్రెస్ దరఖాస్తుల స్వీకరణ

**నేడు ఖరారు కానున్న మార్గదర్శకాలు**



సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నుంచి ప్రారంభించనుంది. ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ)లో తీసుకున్న నిర్ణయం మేరకు గాంధీ భవన్‌లో దరఖాస్తులను తీసుకోనున్నారు. ఈ దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన మార్గదర్శకాలు గురువారం ఖరారు కానున్నాయి. ఇందుకోసం ఏర్పాటైన దామోదర రాజనర్సింహ, రోహిత్‌చౌదరి, మహేశ్‌కుమార్‌తో కూడిన సబ్ కమిటీ మార్గదర్శకాలతో కూడిన నివేదికను గురువారం పార్టీకి అందజేయనుంది. కాగా, ఓసీలకు రూ.50 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.25 వేల చొప్పున దరఖాస్తు రుసుము తీసుకోనున్నారని, దరఖాస్తుతో పాటు హామీపత్రం కూడా ఇవ్వాల్సి ఉంటుందని గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

# కారులో 'సిట్టింగ్' లొల్లి!

**రోజుకో నియోజకవర్గంలో తెరపైకి పంచాయితీలు.. పార్టీ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న అసమ్మతులు, ఆశావహులు**

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసేందుకు బీఆర్ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు సన్నాహాలు చేస్తున్నారనే సంకేతాలు ఆ పార్టీలో 'లొల్లి' రేపుతున్నాయి. సిట్టింగ్ స్థానాల్లో అసమ్మతులు, ఆశావహుల ప్రయత్నాలతో నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు బలంగా తెరపైకి వస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలను తప్పించి తమకు అవకాశం ఇవ్వాలని కొందరు నేతలు నేరుగా కోరుతుండగా.. మరికొందరు తెర వెనుక అసమ్మతిని రాజేస్తున్నారు. మరికొన్నిచోట్ల ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవడం లేదని, పైగా పోలీసు కేసులు, ఇతర రూపాల్లో వేధిస్తున్నారని నియోజకవర్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిలో తాజా, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, ఇతర గ్రామ, మండల స్థాయి క్రియాశీల నేతలు ఉంటుండటం గమనార్హం. అంతర్గత భేటీలే కాకుండా మీడియా సమావేశాలు పెట్టి మరీ తమ అసమ్మతిని, అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అసమ్మతి నేతలు

### 'పుట్ట మధుకు టికెట్ ఇవ్వొద్దు'

ముత్తారం (మంథని): మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకు ఈసారి బీఆర్ఎస్ నుంచి టికెట్ ఇవ్వొద్దని అసమ్మతి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రామగిరి ఎంపీపీ అరెల్లి దేవక్క, మాజీ జెడ్పీటీసీలు నాగినేని జగన్మోహన్‌రావు, మైదం భారతి, దుర్గం మల్లయ్య, బండం వసంతరెడ్డి, పలువురు సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను పుట్ట మధు పట్టించుకోవడం లేదని, నియంత పోకడలతో అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సొంత ఎజెండాను మంథనిలో అమలుపరుస్తూ.. పార్టీ కోసం పనిచేస్తున్న వారిని పక్కన పెడుతున్నారని మండిపడ్డారు. మంథని టికెట్ పుట్ట మధుకు ఇవ్వవద్దని, ఆయనకు తప్ప ఎవరికి ఇచ్చినా భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చెప్పారు. పుట్ట మధుకు వ్యతిరేకంగా త్వరలో నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తామన్నారు.

#### అసమ్మతి పెరిగితే నష్టమనే అంచనాతో..

పార్టీ టికెట్ల కేటాయింపుపై కసరత్తు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రాష్ట్రవ్యాప్తంగా ఏయే నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితి ఉందనే నివేదికలు అందుతున్నట్టు సమాచారం. వివిధ సందర్భాల్లో పార్టీలో చేరిన నేతలు, సిట్టింగ్‌లు సహా చాలా మందిపై క్షేత్రస్థాయి నుంచి ఆరోపణలు వస్తున్నాయని.. ఏకపక్ష ధోరణి, బంధుప్రీతి, అవినీతి, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అన్ని విషయాల్లో జోక్యం, పోలీసు, రెవెన్యూ అధికారులతో సొంత పార్టీ నేతలనే ఇబ్బందులకు గురిచేయడం వంటి అంశాలు నివేదికల్లో ఉన్నాయని తెలిసింది. పార్టీ కేడర్‌ను ఎన్నికల దిశగా సన్నద్ధం చేసేందుకు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలను విశ్లేషించగా.. చాలాచోట్ల విభేదాలు సమసిపోలేదని గుర్తించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ పాలన, కేసీఆర్ విధానాల పట్ల క్షేత్రస్థాయిలో 'ఫీల్ గుడ్' భావన ఉన్నా.. పార్టీ నేతల మధ్య కలహాలు నష్టం చేస్తాయని కేసీఆర్ ఆలోచనకు వచ్చారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

#### వీలైనంత త్వరగా టికెట్ కేటాయింపు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అసమ్మతి కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉందని, వీలైనంత త్వరగా చెక్‌పెట్టాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తదితరులతో జరిపిన భేటీలో అసమ్మతుల కట్టడికి వ్యూహాన్ని ఖరారు చేసినట్టు తెలిసింది. ''వీలైనంత త్వరగా అభ్యర్థులను నిర్ణయించాలని సీఎం కేసీఆర్‌ను కోరాం. సిట్టింగ్‌లకు ఇవ్వాలా, అవసరమైన చోట కొత్త వారికి ఇవ్వాలా అనేది పూర్తిగా ఆయనే చూసుకుంటారు. త్వరగా అభ్యర్థులను ప్రకటించడం ద్వారా పార్టీలో ఉండేదెవరో, వీడేదెవరో అన్నదానిపై స్పష్టత వస్తుంది. తద్వారా అసమ్మతి కట్టడి, ఇతర పార్టీల నుంచి చేరికలు, ప్రచారం తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించేందుకు అవకాశం కలుగుతుందని కేసీఆర్‌కు వివరించాం'' అని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు.

#### కేటీఆర్, హరీశ్ సహా కీలక నేతలకు బాధ్యతలు

అసమ్మతులు, అసంతృప్తుల సమస్యను చక్కదిద్దే పనిని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీ కవిత వంటి కీలక నేతలకు కేసీఆర్ అప్పగించినట్టు తెలిసింది. వేములవాడలో కేటీఆర్, హుస్నాబాద్, మెదక్, జహీరాబాద్‌లో హరీశ్‌రావు, రామగుండంలో కొప్పుల ఈశ్వర్, చొప్పదండిలో గంగుల కమలాకర్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పువ్వాడ అజయ్, బోధన్, జగిత్యాలలో ఎమ్మెల్సీ కవిత, మానకొండూరులో మాజీ ఎంపీ వినోద్ ఇప్పటికే రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు.

#### వరుసగా.. అసంతృప్తి సెగలు!

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు టికెట్ కేటాయించవద్దంటూ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తదితరులు ఇటీవల సమావేశమై పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.
- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు టికెట్ ఇవ్వద్దంటూ మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్త్యా దేవేందర్ నాయక్, మరో 70 మంది ముఖ్య కార్యకర్తలు డిండి మండలం రుద్రాయిగూడంలో సమావేశమై తీర్మానించారు. ఎమ్మెల్యే తీరుపై విమర్శలు చేశారు.
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా తప్పించాలంటూ స్థానిక నేతలు కొందరు సీఎంకు ఫిర్యాదు చేశారు.
- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు వ్యతిరేకంగా అసంతృప్తి నేతలు ఏకమయ్యారు. కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి సర్దుబాటు చేసుకోవాలని నచ్చచెప్పినా.. అక్కడ అసమ్మతి నేతలు, ఎమ్మెల్యే మధ్య పంచాయతీ కొనసాగుతూనే ఉంది.
- నాగార్జునసాగర్, కోదాడ, మహబూబాబాద్, మహేశ్వరం, తాండూరు, ఉప్పల్, పెద్దపల్లి, ఇల్లందు, మెదక్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోకూడా పార్టీ ఎమ్మెల్యేలపై పార్టీ నేతలే బహిరంగంగా వ్యతిరేకత చూపుతున్నారు.
- కోదాడలో బొల్లం మల్లయ్య యాదవ్‌పై పలు ఆరోపణలు వస్తుండటంతో ఆయనను మార్చాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అక్కడ మరో బీసీకి అవకాశం ఇస్తారని, జూలూరి గౌరీ శంకర్ పేరు తెరపైకి వస్తోందని ప్రచారం జరుగుతోంది.
- రాష్ట్రవ్యాప్తంగా మరో 30కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా సొంత పార్టీలోనే అసమ్మతి వ్యక్తమవుతోంది.

## జనగామ 'టికెట్' రాజకీయం!

**హైదరాబాద్ హరిత ప్లాజాలో 'పల్లా' క్యాంపు అసమ్మతి నేతలు**

జనగామ: జనగామ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ లొల్లి హైదరాబాద్‌కు చేరింది. బుధవారం ఇక్కడి బేగంపేటలోని హరిత ప్లాజాలో అసమ్మతి నేతల సమావేశం హాట్‌టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి వ్యతిరేకంగా నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు ఇందులో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపుమేరకు.. జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి నేతృత్వంలో ఈ భేటీ జరిగిందని, పల్లాకు టికెట్ ఇవ్వాలనే డిమాండ్‌తో సీఎంను కలవాలని వారు నిర్ణయించారని విశ్వసనీయ సమాచారం. వారికి సీఎం అపాయింట్‌మెంట్ కూడా దొరికిందని, ఆయన నుంచి పిలుపు కోసం ఎదురుచూస్తూ హరిత ప్లాజాలో వేచి ఉన్నారని తెలిసింది. అయితే.. ఈ సమావేశం విషయం తెలిసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నేరుగా అక్కడికి వెళ్లారు. అకస్మాత్తుగా సమావేశ గది తలుపులు తీసుకుని లోనికి వెళ్లిన ఆయనను చూసి.. అసమ్మతి నేతలు కొంత ఉలికిపాటుకు గురయ్యారు. ఇక్కడికి ఎందుకు వచ్చారని నేతలను ఎమ్మెల్యే అడగడంతో.. మంత్రి హరీశ్‌రావును కలిసేందుకు వచ్చామని, రాజకీయమేదీ లేదని చెప్పుకొచ్చారు. దీంతో ముత్తిరెడ్డి స్పందిస్తూ.. ప్రగతిభవన్‌కు తీసుకెళ్తానని, తనతో రావాలని వారితో చెప్పగా, తాము విడిగానే కలుస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ సమయంలో సదరు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం జరిగినట్టు సమాచారం.

#### 'పల్లా'కు అనుకూలంగా..

జనగామ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అవకాశం కల్పించాలని నియోజకవర్గంలోని కొందరు ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఇందులో భాగంగా నర్మెట పీఏసీఎస్ చైర్మన్ పెద్ది రాజరెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, నాగిళ్ల తిరుపతిరెడ్డి, చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త అంకుగాని శశిధర్‌రెడ్డి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు, జనగామ పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, కొందరు సర్పంచ్‌లు, నాయకులు హరిత ప్లాజా భేటీకి వెళ్లినట్టు తెలిసింది. కాగా.. హోటల్‌లో గొడవ జరుగుతోందని తెలిసి వెళ్లానే తప్ప, తానే నాయకులను తీసుకువచ్చినట్టు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని జనగామ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామన్నారు.

#### ఇలా చేయడం బాధాకరం: ముత్తిరెడ్డి

జనగామ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు హరిత ప్లాజాకు వచ్చారనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. అక్కడ ముఖ్య కార్యకర్తలు ఎవరూ లేరని, అన్ని మండలాల అధ్యక్షులు తన వెంటే ఉన్నారని పేర్కొన్నారు. అయినా అధిష్టానం ఇటువంటి చర్యలను క్షమించబోదన్నారు. గతంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనకు స్వయంగా ఫోన్ చేసి ఇలాంటివి ప్రోత్సహించబోనని చెప్పారని.. ఇప్పుడిలా చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

#### హరీశ్‌రావుతో 'పల్లా' వర్గం భేటీ!

హరిత ప్లాజాలో భేటీ అయిన 'పల్లా' వర్గీయులు సాయంత్రం ప్రగతిభవన్‌లో మంత్రి హరీశ్‌రావును కలసి పరిస్థితిని వివరించారు. దీనిపై హరీశ్‌రావు స్పందిస్తూ.. జనగామ టికెట్ కోసం ఇద్దరు పోటీ పడుతున్నారని, మరో మూడు రోజుల్లో తేల్చేస్తామని చెప్పినట్టు సమాచారం. ముత్తిరెడ్డితో నెల రోజులక్రితమే మాట్లాడి.. ఆయన కుమార్తెతో వివాదాన్ని పరిష్కరించుకోవాలని చెప్పామని, అయినా సరిదిద్దుకోక ఆయన సీటుకు ఎసరొచ్చే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నట్టు తెలిసింది. అయితే పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేసినట్టు సమాచారం.

## 'సీఎం ఎన్నికల తాయిలాలను నమ్మొద్దు'

**కొమురంభీం జిల్లాలో రెండోవిడత బహుజన రాజ్యాధికార యాత్ర**



దహెగాం (సిర్పూర్): రుణమాఫీ, గృహలక్ష్మి, కులవృత్తులకు రూ.లక్ష సాయం పథకాలు కేవలం ఎన్నికల కోసమేనని, ప్రజలు సీఎం కేసీఆర్ తాయిలాలను నమ్మి మోసపోవద్దని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అప్రమత్తంచేశారు. కొమురంభీం జిల్లాలోని దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లో రెండో విడత బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా బుధవారం ఆయన పర్యటించారు. అనంతరం దహెగాం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేల అసమర్థతతోనే తుమ్మిడిహట్టిలో ప్రాణహిత ప్రాజెక్టు కట్టకుండా కాళేశ్వరానికి తరలించారని ఆరోపించారు. పేదల నుంచి భూములు లాక్కొని రూ.వందల కోట్లకు బడాబాబులకు విక్రయిస్తూ సీఎం కేసీఆర్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలోని రైతుల పొలాలకు సాగు నీరందని పరిస్థితి ఉంటే, ముఖ్యమంత్రికి చెందిన 300 ఎకరాల సాగు కోసం రూ.1,890 కోట్లతో కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును పూర్తి చేశారని ప్రవీణ్ ఆరోపించారు. ఆయన వెంట బీఎస్పీ రాష్ట్ర నాయకులు సిడాం గణపతి తదితరులున్నారు.

## మేం తిరగబడితే మీరెక్కడా తిరగలేరు..

**బోధన్ బూత్ కమిటీ సభ్యుల సభలో కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ ఫైర్**



ర్యాలీలో నృత్యం చేస్తున్న కవిత

బోధన్: 'కాంగ్రెస్ నాయకుల తిరగబడటం, తరిమికొట్టడం లాంటి మాటలు ఇక్కడ నడవవు.. గులాబీ కండువా కప్పుకొని లక్షలాదిగా మా కార్యకర్తలు తిరగబడితే ప్రజా క్షేత్రంలో మీరెక్కడా తిరగలేరు.. ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి'అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో లేనోళ్లు, ఏ ఒక్క ఉద్యోగం ఇవ్వనోళ్లు మాపై నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆమె విపక్షాలను విమర్శించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ కేంద్రంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ మైదానంలో ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమెర్ నేతృత్వంలో నియోజకవర్గ స్థాయి బూత్‌కమిటీ సభ్యుల భారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని వేదికపై ఏర్పాటు చేసిన నగారాను (డోలు) ఎమ్మెల్యే షకీల్‌తో కలిసి మోగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత ఎంపీ రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్రను ప్రస్తావిస్తూ.. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడిందని చెప్పుకొస్తున్నారని, కానీ తెలంగాణలో సమర్థుడైన లీడర్ కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు, మత సామరస్యతకు ఎలాంటి ఢోకాలేదన్నారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్‌ను మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

# 27న ఖమ్మంకు అమిత్‌షా!

**ఎన్నికల సమర భేరికి బీజేపీ సన్నద్ధం.. పలు నియోజకవర్గాలకు అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటనకు కసరత్తు**



సాక్షి హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల సమర భేరి మోగించేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సన్నద్ధమైంది. ఈ నెల 27న ఖమ్మంలో పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సభతో ప్రచారానికి శ్రీకారం చుట్టనుంది. పార్టీ కేడర్‌లో ఉత్సాహం కలిగించి, పూర్తిస్థాయిలో రంగంలోకి దింపేలా ప్రణాళికలను సిద్ధం చేసింది. ఈ క్రమంలో సభను విజయవంతం చేయడం, పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తూ తొలి జాబితా విడుదల చేయడం ద్వారా ఊపు తేవాలని నిర్ణయించినట్టు తెలిసింది.

#### గత నెలలోనే జరగాల్సి ఉన్నా..

వాస్తవానికి అమిత్‌షా గతనెలలోనే రాష్ట్రంలో పర్యటించాల్సింది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో రద్దు అయింది. పరిస్థితులు చక్కబడిన నేపథ్యంలో అమిత్‌షా సభ నిర్వహించేందుకు రాష్ట్ర బీజేపీ సిద్ధమైంది. ఈ నెల 27న ఖమ్మంలో ఆ సభ నిర్వహించాలని మూడు రోజుల క్రితం జరిగిన రాష్ట్ర నేతల సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు పర్యటనను ఖరారు చేయడానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్టీ ఎన్నికల వ్యవహారాల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తాజాగా ఢిల్లీ వెళ్లారు. అక్కడ అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో సమావేశమయ్యారు. 27న అమిత్‌షా షెడ్యూల్‌లో ఖాళీ ఉండటంతో రాష్ట్ర పర్యటనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. ఇక ఈ సభ సందర్భంగా ఎలాంటి వివాదం లేని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కొందరు అభ్యర్థుల పేర్లను అయినా ప్రకటిస్తే పార్టీలో ఊపు వస్తుందని రాష్ట్ర నేతలు ఆలోచనకు వచ్చినట్టు సమాచారం.

#### శ్రావణ మాసంతో..

గురువారం నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈనెల 18వ తేదీ నుంచే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అయినా సీనియర్ నేతలకు సంబంధించిన టికెట్లను ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ క్రమంలో దూకుడు పెంచాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా ఎన్నికలకు బీజేపీ పూర్తి సన్నద్ధతతో ఉన్నట్టు పార్టీ కేడర్‌కు సందేశం వెళ్తుందని యోచిస్తున్నారు.

#### వేగంగా అమిత్‌షా బృందాల సర్వేలు

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిపై ఇప్పటికే అమిత్‌షా ప్రత్యేక బృందాలు రహస్య సర్వేలు చేస్తున్నట్టు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీ బలాలు, బలహీనతలు, ఏ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు బలంగా ఉన్నారు? ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఎవరు ఉంటారు? వారితో పోటీపడేందుకు బీజేపీ నేతలకు ఉన్న అర్హతలు, అంగబలం, పార్టీ మద్దతుతో ఏస్థాయిలో పోరాడగలరు? అన్న అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు వివరిస్తున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులకు దీటుగా నిలిచే గెలుపు గుర్రాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్టు పేర్కొంటున్నాయి. ఇలాంటి సర్వేల ఆధారంగా, గతంలో కేంద్ర మంత్రులు పర్యటించినప్పుడు వచ్చిన అభిప్రాయాలను, అంతర్గత సమాచారం వంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఓ అంచనాకు వస్తున్నట్టు తెలిసింది. పార్టీలో ఒక్కరే పోటీపడుతున్న అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేయాలని, తొలిజాబితాలో కనీసం 35 నుంచి 40 మంది పేర్లు ప్రకటించాలని భావిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రక్రియ అంతా ఢిల్లీలోనే సాగుతున్నట్టు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

## రేవంత్‌రెడ్డిని రాజకీయంగా పాతరేస్తాం

**సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో రేవంత్‌రెడ్డిని రాజకీయంగా పాతరవేయడం ఖాయమని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం చిక్కడపల్లిలో తెలంగాణగౌడ, కల్లుగీత సంఘాల సమన్వయకమిటీ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న 373వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం జీఓ ఇచ్చిందని, ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కూడా జీఓ జారీ చేసిందని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డిలాంటి కిరాతకులు పాలకులుగా ఉండి గీతవృత్తిని దెబ్బతీశారన్నారు. సింగిల్‌రూమ్‌లో ఉండి గోడమీద పెయింటింగ్ వేసుకొని బతికిన రేవంత్‌రెడ్డికి కోట్లాది రూపాయలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తెలంగాణ పోలీసులను బట్టలు ఊడదీసి కొడతా అంటూ అహంకారంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారని, నువ్వేమైనా సామంతరాజువా ఒక్క హోంగార్డు చాలు నిన్ను ఐరగదీయడానికి, దేశమంతా నంబర్‌వన్ పోలీసులుగా గుర్తింపు ఉంటే రేవంత్‌రెడ్డి ఇలాంటి మాటలు అనడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఒక రాష్ట్ర మంత్రిని, ఉద్యమకారుడిని నన్నే వాడువీడు అని సంబోధిస్తాడా..బహుజనులంతా తిరగబడితే నువ్వు ఎక్కడ ఉంటావని హెచ్చరించారు. తెలంగాణ గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయసమితి చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ ఐలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, విజయ్‌కుమార్‌గౌడ్, కిషోర్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, ఎంవీ.రమణ, బాలగౌని వెంకటేష్‌గౌడ్, గంధం రాములు, మోతె చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ వ్యాఖ్యలు ఖండిస్తున్నాం: కృష్ణమాదిగ



బౌద్ధనగర్: తన ఎదుగుదలకు మాదిగలు అందించిన సహకారాన్ని మరచిపోయి ఇప్పుడు తమపైనే విమర్శలు చేయడం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సరికాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హితవు పలికారు. బుధవారం పార్శీగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ నివేదిక ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ వద్దకు వెళ్లామని చెప్పారు. రేవంత్‌రెడ్డి ఎదుగుదలకు మాదిగలు అందించిన సహకారం ఎక్కువ శాతం ఉందని, అలాంటి వారి వల్లే ఈ స్థాయికి వచ్చి ఇప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆయన మాదిగలను అవమానించే పద్ధతిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తనకు బాధ్యత లేనట్లుగా రేవంత్‌రెడ్డి తప్పించుకోవడం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో తేల్చుకోమని చెప్పడం పద్ధతి కాదన్నారు. పార్లమెంట్‌లో జరగాల్సిన ఎస్సీ వర్గీకరణపై రేవంత్‌రెడ్డి ఎప్పుడూ మాట్లాడలేదని చెప్పారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేస్తే తమ మద్దతిస్తామని, లేదంటే వ్యతిరేకిస్తామని మందకృష్ణ తేల్చిచెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 85 శాతం మాదిగలు ఉంటే, మల్లు రవికి (మాల) పెత్తనం ఇస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్గీకరణపై కాంగ్రెస్‌కు మాత్రమే చిత్తశుద్ధి

**ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్**



మణికొండ: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్‌పార్టీకి ఉన్న చిత్తశుద్ధి.. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలకు లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ విమర్శించారు. ఆయన బుధవారం రాత్రి మణికొండలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జస్టిస్ ఉషామెరా కమిషన్‌ను ఏర్పాటు చేసి నివేదికను తెప్పించుకుందన్నారు. అదే సమయంలో తెలంగాణ ఉద్యమం తీవ్రం కావటం, అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితులు బాగా లేకపోవటంతో వర్గీకరణ ప్రక్రియను అమలు చేయలేకపోయిందన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి క్యాబినెట్‌లో ఈ విషయాన్ని చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం అసెంబ్లీలో తీర్మానించి ఇప్పటి వరకు కేంద్రానికి పంపలేదని విమర్శించారు. గురువారం ఢిల్లీలో రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి ఠాక్రే ఇంట్లో వర్గీకరణపై ప్రత్యేక సమావేశం జరగనుందని వివరించారు. ఈనెల 24న చేవెళ్లలో జరిగే బహిరంగ సభలో వర్గీకరణపై జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టత ఇస్తారని వెల్లడించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతం పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్‌లోకి ఖమ్మం కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. ఇటీవల మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పార్టీని వీడిన తెల్లం వెంకట్‌రావు తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకోనున్నారు. 2018 ఎన్నికల్లో భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరఫున తెల్లం వెంకట్‌రావు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గురువారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌లో వెంకట్‌రావుతో పాటు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న నేతలను మంత్రి హరీశ్‌రావు పార్టీలోకి ఆహ్వానిస్తారు. బీఆర్ఎస్‌లో చేరుతున్న వారిలో పినపాక, అశ్వారావుపేట, ఇల్లందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నట్టు సమాచారం. కాగా బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య బుధవారం సాయంత్రం ప్రగతి భవన్‌లో భేటీ అయ్యారు. తెల్లం వెంకట్‌రావుతో పాటు ఇతర కాంగ్రెస్ నేతల చేరికలపై కేసీఆర్‌కు వీరు వివరించి ఆమోదం పొందినట్లు సమాచారం.




SPOT ADMISSION
For Lateral Entry into B.Tech

Mohan Babu University invites application for 2nd year B.Tech (Lateral Entry) in the branches of CE; ME; EEE; ECE; EIE; CSE; IT; CS-Cyber Security; CS-Data Science & CS-AIML for the year 2023-24.

Interested and eligible candidates, diploma holders and B.Sc (with Mathematics as one of the subject) may attend for SPOT Admissions on or before 22.08.2023 by 05:00 PM.

For more info visit the campus today or contact us at: 09160999959

Campus - Sree Sainath Nagar
Tirupati, Andhra Pradesh - 517102
Email: admissions@mbu.asia

MBU MOHAN BABU UNIVERSITY



మూసుకొని ఉన్న నోరు ఈగలను పట్టలేదు.
- మిగెల్ సెర్వాంటిజ్



సాక్షి
గురువారం, 17 ఆగస్టు 2023

# అభివృద్ధి అనకొండ!

విపరీతమైన వానలు, దాంతో వరదలు, విలయం. బీభత్సం ముగిసిందని అనుకొనే లోగానే నెల రోజుల్లో రెండోసారి హిమాచల్‌ప్రదేశ్‌పై ప్రకృతి పంజా విసిరింది. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు, విరిగిపడుతున్న కొండచరియలు, పేకముక్కల్లా కూలుతున్న భవనాలు, నేలవాలుతున్న భారీ వృక్షాలు, కోసుకుపోయిన రోడ్లు, వంతెనలు, శిథిలాల్లో చిక్కుకున్న ప్రాణాలతో పర్వత ప్రాంత రాష్ట్రం అతలాకుతలమైంది. పెరుగుతున్న గంగమ్మ వరదలో ఉత్తరాఖండ్ ఉసూరుమంటోంది. ప్రమాదకర స్థాయిలో సాగుతున్న యమున మళ్ళీ ఢిల్లీ సహా పలు ప్రాంతాల్ని భయపెడుతోంది. జూన్ ద్వితీయార్ధం నుంచి జూలై చివరి వరకు వానలు, వరదలు ఒక్క హిమాచల్‌లోనే 150 మందిని బలిగొని, రూ. 10 వేల కోట్ల పైగా నష్టం కలిగిస్తే, తాజా విలయం ఇప్పటికే 60 మందిని పొట్టబెట్టుకొంది.

హిమాలయాలు, దేశ కోస్తా ప్రాంతాలపై వాతావరణ పర్యవసానాలు గట్టి దెబ్బ కొట్టనున్నాయని 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్' (ఐపీసీసీ) 6వ నివేదిక పేర్కొంది. హిమాలయాల్లో సగటు ఉష్ణోగ్రత మిగతా దేశంతో పోలిస్తే వేగంగా పెరుగుతోంది. ఈ వర్షాకాలం అసాధారణ రీతిలో కురుస్తున్న వర్షాలు అందుకు తగ్గట్టే ఉన్నాయి. స్వల్పవ్యవధిలో భారీ వర్షం కురిపించే మేఘపతనం, ఆకస్మిక వరదలకు వాతావరణ మార్పులు కొంత కారణమే. అయితే, మనసును కుదిపేసే ఈ బీభత్సానికి మతి లేని అతి అభివృద్ధికి దిగిన మానవ తప్పిదాలే ప్రధాన హేతువు. పుడమి తల్లిని పట్టించుకోకుండా కొండల్ని తొలిచి, శిథిలావశేషాల్ని నదుల్లో పడేసి, ఇష్టారాజ్యంగా సాగిన అక్రమ గనుల తవ్వకాలు, సహజమైన నదీ ప్రవాహాల్ని నిరోధించిన నిర్మాణాలు, అశాస్త్రీయంగా చేపట్టిన భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు కలిసి హిమాచల్ మెడకు ఉరితాళ్ళయ్యాయి.

హిమాలయాల్లో వరదలు, విరిగిపడే కొండచరియలు కొత్త కాదు. అందులోనూ హిమాచల్‌లోని మొత్తం 12 జిల్లాల్లో కొండచరియల పతనం తరచూ తప్పదని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎప్పుడో తేల్చింది. అంత సున్నితమైన ఈ హిమాలయ పర్వతశ్రేణుల్లో ప్రగతి పేరుతో పాలకులు చేతులారా ప్రకృతి విధ్వంసం చేశారు. ఫలితంగా కొన్నేళ్ళుగా ఏటవాలు ప్రాంతాలు మరింత అస్థిరమయ్యాయి. కేవలం 2020 నుంచి 2022 మధ్య కొండచరియల పతనాల సంఖ్య ఆరు రెట్లు పెరిగిందని డేటా. ఈ పర్వతసానువుల్లో గత పదేళ్ళలో ఇష్టారాజ్యంగా రోడ్లు విస్తరించారు. ఏకంగా 69 నేషనల్ హైవే ప్రాజెక్ట్‌లకు ఆమోదం తెలిపారు. నాలుగు లేన్ల హైవేలు వాటిలో అయిదున్నాయి. హిమాలయాల్లో ఇప్పటికే 168 జల విద్యుత్కేంద్రాలుంటే, 2030 నాటికి 1088 కేంద్రాలు రానుండడం శోచనీయం. పర్యావరణాన్ని పట్టించుకోని ఈ అంధ ఆర్థికాభివృద్ధి మంత్రం ఇక్కడికి తెచ్చింది. పద్ధతీ పాడూ లేకుండా కొండల తవ్వకాలు, మతి లేకుండా రోడ్ల నిర్మాణం, నిర్మాణ వ్యర్థాలను ఏమి చెయ్యాలనే ఆలోచనైనా లేకపోవడంపై హిమాచల్ హైకోర్ట్ నిరుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

గమనిస్తే - దాదాపు ప్రతి వర్షాకాలం ఉత్తరాదిలో అస్సామ్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాలు వానలు, వరదలతో అతలాకుతలమవుతున్నాయి. గతంతో పోలిస్తే వరదల సంఖ్య, ఆస్తి, ప్రాణనష్టాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. వరదల నివారణకు సమర్థమైన ప్రణాళిక లోపిస్తోంది. ఈ తప్పు కూడా పాలకులదే తప్ప ప్రకృతిది కాదు. మన దేశంలో 4 కోట్ల హెక్టార్లకు పైగా ప్రాంతం, అంటే దేశ భూభాగంలో దాదాపు 12 శాతానికి వరదల ముప్పుందని లెక్క. భూకంపాల లాంటి ప్రకృతి వైపరీత్యాలతో పోలిస్తే వరదల్ని ముందే అంచనా వేయడం, అడ్డుకోవడం చేయదగిన పనే. కానీ ప్రభుత్వాలు ఆ పనీ చేయట్లేదు. అనేక రాష్ట్రాల్లో వరద ముంపునకు ఇష్టారాజ్యంగా అడవుల నరికివేత, నదీ పరివాహక ప్రాంతాల్లోని వృక్షచ్ఛాయల విధ్వంసం, పేరుకున్న పూడికలతో నదికి నీటిని నిల్వచేసే సామర్థ్యం తగ్గిపోవడం... ఇలా అనేక కారణాలు. దానికి తోడు నదీ తలాలు, నదీ మైదానాల ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. డ్యామ్‌ల వరద గేట్ల నిర్వహణలో సమన్వయ లోపాలు సరేసరి. ఈ స్వయంకృతాలన్నీ శాపాలవుతున్నాయి.

విచిత్రం ఏమిటంటే - వరద పరిస్థితుల్లో సత్వర చర్యలు పర్యవేక్షించేందుకు దేశంలో ఒకే విభాగమంటూ ఏదీ లేకపోవడం! ఆ మాటకొస్తే, వరదల నిర్వహణకు మన రాజ్యాంగంలో నిర్ణీత ఏర్పాటేదీ లేదు. వాతావరణ శాఖ వర్షసూచనలు చెబితే, వరద ముప్పు సూచనలు చెప్పే బాధ్యత కేంద్ర జల సంఘానిది. వరద ముంపునకు గురయ్యాక సహాయ, పునరావాస చర్యలు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ప్రకృతి వైపరీత్యాల సహాయ సంస్థలున్నాయి. బాధితుల పునరావాసం, దెబ్బతిన్న ప్రాథమిక వసతుల పునరుద్ధరణ బాధ్యత స్థానిక సంస్థలది. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయం కీలకం. ఇంకా విడ్డూరం - నీరు, సాగునీటి పారుదల, తదితర అంశాలన్నీ రాష్ట్ర జాబితాలోవే కానీ, వరదల్లో సహాయ బాధ్యతల నిర్వహణ మాత్రం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలు వేటిలోనూ లేకపోవడం!

పదే పదే వరదల ముప్పు తలెత్తుతున్న వేళ ఈ కీలక అంశాలపై కేంద్ర పెద్దలు తక్షణం సమగ్రంగా దృష్టి పెట్టాలి. 1970లలో నెలకొల్పిన 'వరదలపై జాతీయ కమిషన్' తరహాలో వరదల సమస్యలపై ఆచరణాత్మక వ్యూహాన్ని సూచించేలా ఉన్నత స్థాయి నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ఇకనైనా వరదలపై అన్ని విభాగాలనూ సమన్వయ పరిచే సమగ్ర విధానం అత్యవసరం. అదే సమయంలో సున్నితమైన పర్యావరణాన్ని గౌరవించాలి. లేకపోతే తలెత్తే దుష్పరిణామాలకు హిమాలయ బీభత్సం ప్రతీక. మరి, ఈ మాటైనా హిమాలయాల మాట చెవికెక్కించుకుంటారా?

# చదరంగ విప్లవం ముంగిట్లో భారత్!

విశ్లేషణ



విశ్వనాథన్ ఆనంద్

**దశాబ్ద కాలంలోనే భారత్‌లో యాభై మంది చెస్ గ్రాండ్‌మాస్టర్లు అవతరించారు. చెస్ ఒలింపియాడ్‌లలో మనవాళ్లు శక్తిమంతమైన స్థానాల్లో నిలిచారు. తాజాగా భారత చదరంగ క్రీడాకారుల హవా చెస్ వరల్డ్ కప్‌లోనూ కొనసాగుతోంది. ఎంతోమంది యువకులు ప్రపంచ యవనికపై తమదైన ముద్ర వేస్తున్నారు. చెస్‌కు ఇప్పుడు అనుకూలమైన వాతావరణం ఉంది. ప్రాయోజకత్వమూ లభిస్తోంది. అయితే దేశంలో చదరంగ విప్లవానికి ఇది నాంది మాత్రమే. ముస్ముందు జరగాల్సింది చాలా మిగిలి ఉంది. దశాబ్ద కాలంలో ప్రపంచ చదరంగంలో భారత్ తిరుగులేని శక్తి అవుతుందా? ఇంకో భారతీయుడు ప్రపంచ ఛాంపియన్‌గా అవతరిస్తాడా? ఏమైనా, భారతీయ చదరంగం పక్వానికి వచ్చిందని మాత్రం తప్పక చెప్పవచ్చు.**

బిందువు బిందువు సింధువైనట్లు... ముందు కొంతమంది యువ ప్రతిభావంతులు చెస్ గ్రాండ్ మాస్టర్లుగా ఎదిగారు. ఆ తరువాత పరిపక్వత లక్షణాలు స్పష్టంగా కనిపించడం మొదలైంది. చెస్ ఒలింపియాడ్‌లలో మనవాళ్లు శక్తిమంతమైన స్థానాల్లో నిలిచారు. తాజాగా భారత చదరంగ క్రీడాకారుల హవా చెస్ వరల్డ్ కప్‌లోనూ కొనసాగుతోంది. భారతీయ చదరంగ చరిత్రలో డి.గుకేశ్, ఆర్.ప్రజ్ఞానంద నేతృత్వంలో సువర్ణ అధ్యాయం మొదలైంది. వీరితోపాటు ఎంతోమంది యువకులు ప్రపంచ యవనికపై తమదైన ముద్ర వేస్తున్నారు. కొత్త కొత్త ఎత్తులను అధిరోహిస్తున్నారు.

గత ఏడాది చెస్ ఒలింపియాడ్ సందర్భంగా భారతీయ క్రీడాకారుల ఆటతీరును గమనించినప్పుడు ఇలాంటిది ఏదో జరగాలని మనం ఆశించాము. ఆ పోటీల్లో ఇండియా–బి బృందం ఓపెన్ కేటగిరిలో కాంస్య పతకం సాధించింది. మహిళా క్రీడాకారులు కూడా కాంస్య పతకం గెలుచుకున్నారు. అయితే ఫైడ్ చెస్ ర్యాంకింగ్‌లో గుకేశ్ టాప్–10లో ఒకడిగా ఎదగడంతో మిగిలిన వారు కూడా ఇప్పుడు మరింత శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

చదరంగంలో అతితక్కువ కాలంలో వచ్చిన ఈ గుణాత్మక మార్పునకు కారణాలు ఎన్నో. చెస్‌కు అనుకూలమైన వాతావరణం ఉంది. ప్రాయోజకత్వమూ లభిస్తోంది. ఆటగాళ్లకూ, ఆటకూ ఎక్స్‌పోజర్ కూడా బాగుంది. అత్యున్నతస్థాయి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. నైపుణ్యానికి కొరతే లేదు. దేశంలో చదరంగం మరింత ఎదిగేందుకు ఈ నైపుణ్యమే కీలకం.

విస్తృతస్థాయిలో నైపుణ్యం ఉండటం పోటీతత్వాన్ని పెంపొందిస్తుంది. ఇది కాస్తా ఆటగాళ్లు మరింత రాటుదేలేందుకు ఉపయోగపడుతుంది. భారత్ తరఫున ఇప్పుడు చెస్ ఒలింపియాడ్ లేదా వరల్‌కప్ పోటీల్లో పాల్గొనాలంటే అత్యున్నత స్థాయి ఆట ఆడాల్సి ఉంటుంది. మనకేం ఫర్వాలేదు అనుకునే అవకాశం ఏ ఆటగాడికీ ఉండదు. అందరూ ముంగాళ్లపై నుంచోవాల్సిందే. నిజాయితీగా ఉండాల్సిందే.

ఆటగాళ్లు కూడా ఒకరితో ఒకరు చాలా స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూంటారు. మంచి మిత్రులే కానీ, ఆట విషయానికి వస్తే మాత్రం ఎవరి గుట్లు వారి వద్దే ఉంటాయి. ఎందుకంటే ఆ రహస్యాలే వారికి ఏదో ఒక రోజు విజయాన్ని సంపాదించి పెట్టవచ్చు. ఇక్కడ చాలామంది టాప్ ర్యాంకింగ్ ఆటగాళ్లను మాత్రమే చూస్తున్నారు. కానీ కింది స్థాయిలోనూ చాలా మంది ఆటగాళ్లు మంచి ప్రతిభ కనబరుస్తున్నారు.

నేను భారతదేశంలో నంబర్ వన్ (1986 జూలై ఒకటవ తేదీన 2405 ఎలో రేటింగ్‌తో ప్రవీణ్ థిప్సే కంటే ముందుకు వెళ్లినప్పుడు)గా



మారినప్పుడు దరిదాపుల్లో ఇంకో ఆటగాడు కనిపించలేదు. 1988లో ఇరవై ఏళ్ల వయసులో నేను గ్రాండ్‌మాస్టర్ అయినప్పుడు పోటీల గురించి కాకుండా, రానున్న మూడేళ్లలో ఉన్నత స్థానానికి చేరుకోవడం ఎలా అని ఆలోచించాను. నేనేం చేయాలో నేనే నిర్ణయించుకుని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి! 1988లో నేను గ్రాండ్‌మాస్టర్‌గా అవతరిస్తే, మూడేళ్ల తరువాత 1991లో దివ్యేందు బారువా ఆ ఘనత సాధించాడు. ప్రవీణ్ థిప్సే 1997 నాటికి గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. అయితే ఇప్పుడు పరిస్థితిలో చాలామార్పు వచ్చింది. 2013 నుంచి ఇప్పటివరకూ సుమారు 50 మంది గ్రాండ్‌మాస్టర్లుగా ఎదిగారు. ఎలో రేటింగ్ 2700 కంటే ఎక్కువ ఉన్న భారతీయ గ్రాండ్ మాస్టర్లు (పాక్షికంగా రిటైరైన నాతో కలిపి) ఆరుగురు ఉన్నారిప్పుడు.

గ్రాండ్ మాస్టర్ కావడం చాలా గొప్పవిషయమే అయినప్పటికీ ప్రస్తుతం సాధారణమైపోయింది. మారుతున్న కాలానికి నిదర్శనం ఇది. ఈ తరానికి ఇంకో సానుకూల అంశమూ ఉంది. నాకున్న దశాబ్దాల అనుభవంపై వారు ఆధారపడవచ్చు. అలాగే ఎందరో చెస్ గురువుల ప్రస్థానాల నుంచి కూడా చాలా విషయాలు తెలుసుకోవచ్చు. ఇది చాలా కీలకం. కానీ మాలాంటివాళ్లం ఈ తరం ఆటగాళ్లకు మార్గదర్శనం మాత్రమే చేయించగలం.

టాప్ లెవల్ ఆటగాళ్లందరికీ ఇప్పుడు దాదాపు అన్ని రకాల పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. అయితే మంచి ఆటగాళ్లను వేరు చేసే అంశాలు వారి ప్రవర్తన, నిత్యం ఉన్నతస్థాయి ఆటను కొనసాగించగలగడం, శారీరక దారుఢ్యం, ఒత్తిడికి లోనుకాకపోవడం. అంతేకాదు... ఆట విషయంలో సమగ్రత కూడా చాలా అవసరం. ప్రత్యర్థి ఎప్పుడు ఏ రకమైన సవాలు విసురుతాడో మనకు తెలియదు కాబట్టి అన్నింటికీ సిద్ధంగా ఉండటం అవసరం. కొంతమంది ప్రత్యర్థులు మీరు తయారైన దానికంటే భిన్నమైన రీతిలో దాడికి దిగవచ్చు. అప్పుడు మీరెలా స్పందిస్తారు? దేనిపై ఆధారపడతారు? మీ లెక్కకు చిక్కని విషయమని భావిస్తారా? వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటేనే బాగా శ్రమించడం అన్నదానికి ప్రాముఖ్యత ఏర్పడుతుంది. ఎలో రేటింగ్ 2700కు చేరుకోవడం కూడా ఈ క్రమంలో భాగమే.

అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఇంకోటి ఉంది. భారతీయ చదరంగం కేవలం పురుషులకు మాత్రమే చెందింది కాదు. దేశంలో చదరంగం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలంటే మహిళా క్రీడాకారులు కూడా బాగా రాణించాలి. దురదృష్టవశాత్తూ ఇప్పటికీ పురుషులు, మహిళా క్రీడాకారుల సంఖ్యలో చాలా అంతరం ఉంది. భారత్‌లోనే కాదు... ప్రపంచం మొత్తమ్మీద ఇదే పరిస్థితి. ఈ అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అకాడమీ ఏర్పాటు ద్వారా మేమీ ప్రయత్నం చేస్తున్నాం. విజయం సాధిస్తామన్న నమ్మకమూ ఉంది. కోనేరు హంపి, డి.హారిక, ఇతరుల స్థాయుల మధ్య చాలా అంతరం ఉంది. ఉన్నత స్థానంలో ఏళ్ల తరబడి కొనసాగేందుకు తగిన జ్ఞానం హారిక, హంపికి ఉంది. అయితే మిగిలిన వారు సమీప భవిష్యత్తులోనే వీరికి సవాలు విసరగలరని ఆశిస్తున్నా. ఒకే ఒక్క రెక్కతో ఎగరడం సాధ్యం కాదు కదా! అసలైన విప్లవం అందరినీ తోడుతీసుకునే మొదలవుతుంది.

గుకేశ్, ప్రజ్ఞానంద్ ఇద్దరూ చదరంగంలో మారుతున్న తరానికి ప్రతినిధులు. నా అనుభవం వారికి ఉపయోగపడుతుంది కానీ, వారు తమ సొంత మార్గంలో మరింత దూరం ప్రయాణించడం అలవర్చుకోవాలి. తమ సమస్యలకు వారే పరిష్కారాలు వెతుక్కోవాలి. కొత్త హోదా, హంగు ఆర్భాటాలకు వారిప్పుడిప్పుడే అలవాటు పడుతున్నారు. ఎదురుదెబ్బలూ వారికి ఎదురు కావచ్చు. ఉన్నత స్థానాన్ని చేరుకోవడం ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. కాకపోతే వీరు అనుసరిస్తున్న మార్గం మాత్రం సరైందనే చెప్పాలి. మిగిలినవి ఎలా ఉన్నా ఇది చాలా ముఖ్యం.

ప్రస్తుతం భారత దేశ చదరంగం ఒక్కో అడుగే ముందుకేయాలి. ఎదుగుతున్నప్పటికీ అందుకోవాల్సింది ఇంకా చాలానే ఉంది. విస్తృతమైన, లోతైన వ్యవస్థ అక్కరకొచ్చే అంశం. కాలం గడుస్తున్న కొద్దీ ఒకదానికి ఒకటి పూరకంగా వ్యవహరిస్తాయి. దశాబ్ద కాలంలో ప్రపంచ చదరంగంలో భారత్ తిరుగులేని శక్తి అవుతుందా? ఈ యువ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తారా? ఇంకో భారతీయుడు ప్రపంచ ఛాంపియన్‌గా అవతరిస్తాడా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలంటే వేచి చూడాల్సిందే. ఇప్పటికైతే ఒకే మాట చెప్పవచ్చు. భారతీయ చదరంగం పక్వానికి వచ్చిందీ అని!

వ్యాసకర్త ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఐదుసార్లు నెగ్గిన చదరంగ క్రీడాకారుడు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### అభద్రతలో మైనారిటీలు



దైవదూషణ ఆరోపణలతో ఫైసలాబాద్, జరావాలాలోని ఒక క్రైస్తవ కుటుంబం మీద మూక దాడి జరిగింది. చర్చిని కూడా తగులబెట్టారు. ఇప్పటికే క్రైస్తవ సమాజం భయంలో బతుకుతోంది. వారి మీద మరో దారుణమైన దాడి జరిగింది. పాకిస్తాన్‌లో క్రైస్తవులు, హిందువులు సురక్షితంగా లేరు.

– వీంగాస్, పాకిస్తాన్ యాక్టివిస్ట్

### అందరికీ సంఘీభావం



ఫైసలాబాద్ వీడియోలు భయానకంగా ఉన్నాయి. ఇరుగు పొరుగు సాయం చేసుకోవడానికి బదులుగా ఒకరినొకరు చంపుకొంటున్న దేశం కోసం బాధపడుతున్నాను. తన సొంత పిల్లలను సజీవంగా తింటున్న దేశం కోసం బాధపడుతున్నాను. మతంతో నిమిత్తం లేకుండా పాకిస్తానీయులందరికీ నా సంఘీభావం.

– జుల్ఫికర్ అలీ భుట్టో, పాక్ కళాకారుడు

### పారిశుద్ధ్య సేనాని



బిందేశ్వర్ పాఠక్ ('సులభ్' సంస్థ వ్యవస్థాపకుడు) క్షేత్ర స్థాయిలో దేశాన్ని నడిపిన సామాజికవేత్త. ఆయనకు ముందు దేశంలో పబ్లిక్ టాయ్‌లెట్స్ అనే మాట వినబడలేదు. ఎన్నో ప్రభుత్వాల కంటే ఆయనొక్కడు చేసిన పారిశుద్ధ్య సేవ ఎక్కువ.

– రవి కాంత్, వ్యాఖ్యాత

### ప్రశ్నించాల్సిన కథనం



వెయ్యేళ్ల బానిసత్వం' కథనాన్ని తప్పక ప్రశ్నించాలి. బ్రిటిష్ వలసవాదుల్లా కాకుండా – మొఘలులు, తొలి ముస్లిం రాజులు భారత దేశాన్ని తమ స్వస్థలంగా మార్చుకున్నారు. భారత సంస్కృతి, కళలు, సాహిత్యం, సమాజాలకు ఎంతగానో తోడ్పడ్డారు. భారత సర్వాంగీకార వారసత్వం మీద వారు లోతైన ముద్ర వేశారు.

– అశోక్ కాంతా, హానరరీ ఫెలో

### ప్రమాదంలో హిమాచల్



హిమాచల్ ప్రదేశ్ అపాయకరమైన స్థితిలో ఉంది. హిమాలయాలు కూలి పోతున్నాయి. కొద్దినెలల్లోనే ఇప్పటికి 257 మరణాలు, వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించాయి. హిమాచల్ కోసం ప్రార్థించండి. (కుప్పకూలిపోతున్న ఇంటి నుంచి భీకరమైన అరుపులు వినబడుతున్న వీడియోను షేర్ చేశారు.)

– సృష్టి, జర్నలిస్ట్

# ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం...

మన దేశంలో ప్లాస్టిక్ వినియోగం అంతకంతకు పెరుగుతోంది. సంచులు, కుర్చీలు మొదలు మనం పని చేసే కంప్యూటర్ల వరకు ఎన్నో రకాల వస్తువులు ప్లాస్టిక్‌తో తయారవుతున్నాయి. అయితే వీటి వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతుండటంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షిత విధానాల్లో పునర్వినియోగంలోకి తేవాలి. ఇలాంటి పద్ధతులను అనుసరించే పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ భూగోళం మొత్తాన్ని మెల్లమెల్లగా మింగేస్తోంది. వాతావరణంలో మార్పులకు కారణమవ్వడమే కాదు, మానవ మనుగడకే పెను సవాలును విసురుతోంది. ప్రతి ఏటా దాదాపు కోటికి పైగా జీవులు దీనివల్ల మరణిస్తున్నాయి. కొన్ని వేల సంవత్సరాలైనా ఇది మట్టిలో కలవకుండా వాయు కాలుష్యాలకు దారి తీస్తుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ముఖ్యంగా పునర్వినియోగానికి పనికి రాకుండా ఉంటున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పెరగడం మొత్తం ప్రపంచానికే పెను సవాలుగా మారుతోంది. మనం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల నుంచి కంటికి కనిపించని ప్రమాదకర అతి చిన్న సూక్ష్మ రేణువులు మన శరీరంలోకి క్రమంగా చేరుతున్నాయి. ఇందువల్ల ప్రాణాంతకమైన క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులు వస్తున్నాయి. అలాగే మూత్రపిండ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధుల వంటి వ్యాపిస్తున్నాయి. స్త్రీ – పురుషుల్లో వంధ్యత్వం సంభవిస్తోంది. పిల్లల్లో బుద్ధి మాంద్యం కలుగుతోంది.

విపరీతమైన ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవుడి సగటు జీవిత కాలం తగ్గే అవకాశాలు ఉన్నాయని ఇటీవలే పలు అధ్యయనాలు తమ నివేదికల్లో వెల్లడించాయి. జనావాసాలతో పాటుగా పర్యావరణానికి కూడా ప్లాస్టిక్ గొడ్డలి పెట్టుగా మారింది. పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లో కూడా కలిసిపోయి అందులో ఉండే జీవుల ఉసురు తీస్తున్నాయి. కొన్ని సముద్ర జీవులు గుడ్లు పెట్టే ఆవాసాలపై ప్లాస్టిక్ పేరుకుపోతోంది. సముద్ర జీవుల సంతానోత్పత్తిపై కూడా ఇది ప్రభావాన్ని చూపుతోంది.

ఇంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ వాడకాన్ని ఇకనైనా తగ్గించాలి. ప్లాస్టిక్ సంచులు, డబ్బాలకు బదులు, జనపనార, ఆకులతో, బట్టతో తయారు చేసిన సంచులనూ, బుట్టలనూ వినియోగించడానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాల, వంటివి కొనుగోలు చేసినా, అమ్మినా నేరంగా భావిస్తూ వివిధ దేశాలు ఇప్పటికే కఠిన చర్యలు తీసుకొంటున్నాయి. మన దగ్గర కూడా ఇలాంటి చర్యలు సత్వరమే చేపట్టాలి. ప్రజా చైతన్యం పెరగడం అత్యంత కీలకం.

– కూరపాటి శ్రావణ్, జనగాం జిల్లా

# ఉమ్మడి పౌరస్మృతికి తగిన వాతావరణం ఏదీ?

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చకుండా, ప్రాథమిక హక్కులను దెబ్బతీయకుండా యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) లేదా ఉమ్మడి పౌర స్మృతిని రూపొందించి అమలు చేయడం సాధ్యమా? విచిత్ర మేమంటే 90 శాతం మందికి యూనిఫామ్ సివిల్ కోడ్ అంటే తెలియదు. తెలియాల్సిన అవసరం కూడా వారికి లేదన్నట్టున్నారు. చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలకు కూడా దీనిపై అంతగా అవగాహన లేదని చెప్పవచ్చు. మంత్రులలో ఒక్క డజన్ మందికి తెలుస్తే తెలువవచ్చేమో? టీవీల్లో డిబేట్ పేరుతో ఓ నలుగురు గంటా గంటన్నర గొంతు నొప్పెట్టేదాకా ఏదేదో వాదించడం చూస్తున్నాం. అనేక మతాలు, కులాలు, వర్గాల వాళ్లు ఎవరి ధోరణిలో వాళ్లు మాట్లాడుతున్నారు.

కానీ ఉమ్మడి పౌరస్మృతి స్వరూప స్వభావాలు, విధి విధానాలు ఎలా ఉంటాయో వివరిస్తున్నారా? ఇక ప్రభుత్వం చిత్తు బిల్లు రూపంలోనైనా ఏదీ వివరించకుండానే పార్లమెంటుకు యూసీసీ బిల్లును సమర్పించాలని అనుకుంటున్నదా? నెల రోజుల్లో లక్షలు, కోట్ల మంది ఈ బిల్లుపై అభిప్రాయాలు చెప్పారని అధికారులు అన్నంత మాత్రాన ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆ బిల్లును ప్రవేశపెట్టి దాన్ని నెగ్గేలా చేసుకుంటుందా? రాజ్యాంగ బద్ధ స్థానాల్లో ఉన్నవారు ముందు ఒక విధాన పత్రాన్ని కూడా ఇవ్వరా? దాని మీద చర్చలు, సంప్రదింపులు జరిగాక అందరికీ ఆమోదయోగ్యమైన ఒక పౌరస్మృతిని తయారు చేయడం కదా ప్రభుత్వం చేయవలసింది!

అదృష్టవశాత్తు 1860 సంవత్సరంలో బ్రిటిష్‌వారు ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)ను తయారుచేశారు కాబట్టి సరిపోయింది కానీ లేకపోతే ప్రస్తుత పాలకులు పెద్ద ఉపద్రవాన్ని కలిగించేలా దాన్ని తయారుచేసి ఉండేవారే! బ్రిటిష్ వాళ్లకు ఈ ఐడియా రాకపోతే ఈ పాటికి ప్రతి జిల్లాల్లో వివిధ మతాల వాళ్లు కొట్టుకుని చనిపోయేవారు. 1860కి ముందు హత్యకో చట్టం, రేప్‌కో చట్టం, దొంగతనానికి వగైరాకు ఒక చట్టం చొప్పన వందల చట్టాలు చేసే వాళ్లు. థామస్ బాబింగ్‌టన్ మెకాలే ఐపీసీని రూపొందించి చాలా గొప్పపని చేశారు. ఐపీసీ లేకపోతే ఒక్కో చట్టం రావడం సమస్య అయ్యేది. అందరికీ ఒకటే క్రిమినల్ లా లేకపోతే, హిందువులకు చంద్రగుప్తుడి కాలంలో దొంగ తనానికి 'అర్థశాస్త్రం' కింద విధించిన శిక్ష, ఔరంగజేబు కాలంలో రేప్‌కు విధించిన రాళ్ళతో కొట్టే శిక్ష విధించి ఉండేవారు. ఐపీసీ లేకపోతే పరిస్థితులు ఎలా ఉండి ఉండేవో చెప్ప దానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలు చదువుకోవడం ఆ యా మతాలవారు ఎంత పవిత్రంగా భావిస్తారో... ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరుడూ ముందు భారత రాజ్యాంగం ఏమిటో తెలుసుకోవాలి. దాన్ని చదవాలి. అప్పుడే యూసీసీ వంటి వాటి అవసరం ఉందా, లేదా అనేది అర్థమవుతుంది. దేశం, ప్రభుత్వం సరైన మార్గంలో నడవడాన్ని నిర్దేశించే రాజ్యాంగాన్ని చదవడం ఎవరికీ అవసరం లేని వ్యవహారమయ్యింది. ఇంటర్మీడియట్ తరువాత ఉద్యోగం రావడానికి అవసరమైన కోర్స్‌లో సీటు కోసం ఎంట్రన్స్ రాయడం లక్ష్యంగా చదువులు సాగుతున్నాయి. ఈ ప్రవేశ పరీక్షల్లో రాజ్యాంగానికి సంబంధించిన విషయాలు ఉండవు. అందువల్ల రాజ్యాంగ పఠనం వారి చదువులో భాగం కావడం లేదు. ఇప్పుడు యువతకు కంప్యూటర్ డిగ్రీ ఉంటే చాలు ఉద్యోగం రావడానికి! అటువంటి వారికి యూసీసీ ఎలా తెలుస్తుంది? యూపీఎస్సీ పరీక్షలో ఒక లా పేపర్ ఉంటే దానిలో రాజ్యాంగం అనే ఒక పార్ట్ ఉంటుంది. అలా





పాస్ అయిన వారికి యూసీసీ వంటివి తెలుస్తాయి. మా లా కాలేజీలో కూడా రాజ్యాంగం పేపర్ కాకుండా మరో పేపర్ చదువుకొనే వాళ్లు లేకపోవడమూ గమనార్హమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బల్బీర్ సింగ్ చౌహాన్ నేతృత్వంలోని 21వ లా కమిషన్ ఉమ్మడి పౌరస్మృతిపై 2018 లోనే ఒక పత్రాన్ని విడుదల చేసింది. యూసీసీని ఈ పత్రంలో లా కమిషన్ స్పష్టంగా తిరస్కరించింది. ప్రముఖ ముంబై హైకోర్టు న్యాయవాది దుష్యంత్ అరోరాతో సహా ప్రసిద్ధ వ్యక్తులు నీలాంజన రాయ్, టీఎమ్ కృష్ణ, మేజర్ జనరల్ ఓమ్ బాత్కెరే, గుల్ పనాగ్, బెజవాడ విల్సన్, ముకుల్ కేశవన్‌లతో కూడిన ప్రముఖ పౌరుల బృందం 2017లో 'ప్రగతిశీల ఉమ్మడి పౌరస్మృతి' రూపొందించారు. మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ దాన్ని అంగీకరించారు. రెండుసార్లు ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించి, లా కమిషన్ నివేదికను కూడా విడుదల చేసింది.

2018లో వద్దన్న లా కమిషన్ ఇప్పుడు యూసీసీపై ప్రజాభిప్రాయాన్ని అడుగుతున్నది ఎందుకు? రాజ్యాంగంలో ఆర్టికల్ 44 'ఆదేశం' కాదు. మార్గదర్శక ఆదేశం వలె కనిపించే 'సూత్రం' మాత్రమే. అట్లా అని దాన్ని పనికి రాదనడానికి లేదు. సుప్రీంకోర్టు పలు సందర్భాలలో 'మరణించిన అధికరణం' కాదని చెప్పింది.

ఇప్పుడు కేంద్రం అతి వేగంగా యూసీసీని అమలు చేయాలని ఎందుకంటున్నదో ఆలోచించాల్సిన విషయం. యూసీసీని అమలు చేయడానికి ముందు చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. ముందస్తుగా పౌరులందరినీ సమానంగా చూసే చట్టాలు చేయకుండా, యూసీసీ అమలు చేయడం సాధ్యమేనా? యూసీసీని ప్రవేశ పెట్టడానికి ఒక్క బిల్లు కూడా తయారు చేయకుండా వివిధ రాజకీయ పార్టీలతో పోటా పోటీగా వాదనలు మాత్రం చేస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఒక నోటీస్ ద్వారా నెలరోజుల్లో యూసీసీ వద్దని చెబుతారా?

వ్యాసకర్త డీన్, స్కూల్ ఆఫ్ లా, మహీంద్రా యూనివర్సిటీ

# శివ కేశవులకు ప్రీతికరం

శ్రావణమాసం అంతా ఉదయం, సాయంత్రం భగవన్నామ స్మరణతో హిందూ గృహాలు మారు మోగుతాయి. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు 'శ్రవణా' నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి ఆ పేరు వచ్చింది. సనాతన ధర్మంలో చంద్రమానం ప్రకారం మనకున్న పన్నెండు మాసాల్లో ఐదవది పవిత్రత కలిగినదీ శ్రావణ మాసం. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా పవిత్రత ఉందంటున్నారు విజ్ఞులు. అంతటి పవిత్ర మాసం అధిక శ్రావణం అనంతరం, నిజ శ్రావణం నేటి (17వ తేదీ గురువారం) నుంచి మొదలయ్యింది.

జ్యోతిర్మయం

ఈ మాసం శివ కేశవులకు ప్రీతికరం. ఈ మాసంతో అసలు వర్ష రుతువు ప్రారంభమవుతుంది. ముఖ్యంగా భగవదారాధనలో శివ, కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది ఈ మాసం. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవ కార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. సోమవారాల్లో శివుని ప్రీత్యర్థం ఉపవాస దీక్ష చేస్తే, అనేక శుభ ఫలితాలు కలుగుతాయంటారు. వీటికి తోడు శ్రావణ శుక్ల పక్షంలో గల పదిహేను రోజులు ఎంతో విశేషమైన రోజులనీ, ఒక్కో రోజు ఒక్కో దేవుడికి పూజలు చేయాలనీ వేదాలు చెబుతున్నాయి.

త్రిమూర్తుల్లో స్థితికారుడు, దుష్ట శిక్షకుడు, శిష్ట రక్షకుడు అయిన మహావిష్ణువుకు, ఆయన దేవేరి మహాలక్ష్మికి కూడా అత్యంత ప్రీతికరమైనది శ్రావణమాసం అంటారు. మహావిష్ణువు జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం. శ్రావణ మాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతం 'మంగళగౌరీ' వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ, మంగళగౌరీ నోము అని పిలుస్తుంటారు. ఇదే మాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం 'వరలక్ష్మి' వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలు కాకుంటే శ్రావణ మాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరిస్తారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు.

శుక్లపక్ష ద్వాదశి, దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభ దినాలున్నాయి. శుక్ల పక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణువును పూజించినట్లయితే మోక్షం లభిస్తుందంటారు. శ్రావణ పౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకొనే శుక్ల పక్ష పౌర్ణమి రోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షా బంధనం జరుపుకొంటున్నాం. అంతే కాక కొందరు ఈ రోజున నూతన యజ్ఞోపవీతం ధరించి, వేదభ్యాసాన్ని ప్రారంభిస్తారు. కృష్ణపాడ్యమి, హయగ్రీవ జయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటివి సైతం ఈ నెలలోనే రావడం విశేషం. కృష్ణాష్టమి, పోలాల అమావాస్య వంటివి కూడా ఈ నెలలోనే వస్తాయి.

– నందిరాజు రాధాకృష్ణ

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, తిథి: శు.పాడ్యమి ప.3.50 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: మఖ రా.7.31 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.6.11 నుండి 7.59 వరకు, తిరిగి తె.4.20 నుండి 6.04 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం: ఉ.9.59 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.01 నుండి 3.51 వరకు, అమృతఘడియలు: సా.4.50 నుండి 6.34 వరకు ; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.46, సూర్యాస్తమయం: 6.21.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

## క్లుప్తంగా...

### భూసేకరణ చట్టం-2013ను అమలు చేయాలి

- ఖమ్మం రైతుల ధర్నాలో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని, కూనంనేని



ధర్నాలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం. చిత్రంలో కూనంనేని

ఖమ్మంమయూరిసెంటర్: రోడ్లు, గుడి, బడి నిర్మాణాలకు అవసరమైన భూమిని భూసేకరణ చట్టం 2013 ప్రకారమే రైతుల నుంచి తీసుకోవాలని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు సూచించారు. ఖమ్మం జిల్లాలో రహదారుల పేరుతో రైతులకు కనీస పరిహారం చెల్లించకుండా భూములు సేకరించడం ఏమిటని వారు ప్రశ్నించారు. రైతుల పోరాటానికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. నాగ్‌పూర్ నుంచి అమరావతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి బాధిత రైతులు బుధవారం ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు, రైతు సంఘాల నాయకులు, అఖిలపక్షం నాయకులు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వీరికి సంఘీభావం తెలిపిన తమ్మినేని, కూనంనేని మాట్లాడుతూ.. రైతుల భూపోరాటం ఉధృతస్థాయికి చేరుతుందన్నారు. పోలీసులనిఘా నీడలో అప్రజాస్వామికంగా సర్వే చేయిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### గద్దర్ ఆశయ సాధనకు పాటుపడదాం

అప్పుడే ఆయనకు నిజమైన నివాళి: సూర్యకిరణ్

సాక్షి, హైదరాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయ సాధన కోసం మనమంతా పాటుపడాలని గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. భారత రాజ్యాంగ పరిరక్షణనే ధ్యేయంగా ముందుకు సాగుతూ గద్దర్.. 'సేవ్ కాన్‌స్టిట్యూషన్.. సేవ్ డెమొక్రసీ.. సేవ్ ఇండియా'అనే నినాదంతో ఉద్యమించారని పేర్కొన్నారు. ఆరేళ్లుగా ఈ నినాదంతోనే ఊరూరా, వాడవాడలా తిరిగి సభలు, సమావేశాలు పెట్టి ఎలుగెత్తి చాటారని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం చేయాల్సిన కర్తవ్యాన్ని బోధించారని సూర్యకిరణ్ వెల్లడించారు. గద్దర్ ఆశయ సాధనకు ముందుకు కదులుదామని, ఊరూరా, వాడవాడల్లో నిర్వహించే గద్దర్ సంస్మరణ సభలో భారత రాజ్యాంగ ఆవశ్యకతను చాటుదామని పిలుపునిచ్చారు. అప్పుడే గద్దర్‌కు మనం నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని సూర్యకిరణ్ పేర్కొన్నారు.

### గుండెపోటుతో విద్యార్థి మృతి

- తరగతి గదిలోనే కుప్పకూలిన 9వ తరగతి విద్యార్థి



రాజేశ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. ఉపాధ్యాయులు, తోటి వి ద్యార్థుల కథనం ప్రకారం... ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మాదాసి రాజేశ్ (14) బుధవారం రోజుమాదిరిగానే పాఠశాలకు వచ్చాడు. తరగతి గదిలో కూర్చున్న అతనికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో ఉపాధ్యాయులు స్పందించి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. రాజేశ్ తండ్రి అపార్ట్ మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా రాజేశ్‌కు గుండె సంబంధిత సమస్య ఉండటంతో కుటుంబీకులు చికిత్స చేయిస్తున్నారని ఉపాధ్యాయుల ద్వారా తెలిసింది. కాగా, అంతసేపు తమతో కలిసి ఉన్న స్నేహితుడు మృతి చెందడంతో సహచర మిత్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

### అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తాం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్

లిబర్టీ (హైదరాబాద్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రకటించారు. ప్రధాన రాజకీయ పార్టీలకు దీటుగా ప్రత్యేకమైన శక్తిగా ఆవిష్కరణ అయ్యేందుకు రాజకీయ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 33 జిల్లాల్లో ఉన్న 119 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను బరిలోకి దింపుతామన్నారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసి కసరత్తులు ప్రారంభించామని, పూర్తిస్థాయిలో వడపోసి అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడించారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇతర ప్రధాన రాజకీయ పార్టీలకు దీటుగా ఎదుగుతామని పేర్కొన్నారు.

# రాంగ్‌రూట్‌లో వచ్చిన మృత్యువు

- ఆటోను ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన లారీ
- ఆరుగురు దుర్మరణం.. ఒకరి పరిస్థితి విషమం
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు
- వరంగల్ జిల్లా ఇల్లంద గ్రామం వద్ద ప్రమాదం
- లారీ డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే కారణమని నిర్ధారణ



ఘటనా స్థలంలో ఆటోలో ఇరుక్కుపోయిన మృతదేహాలు



ప్రమాదానికి కారణమైన లారీ



సురేశ్



ఆటోడ్రైవర్ శ్రీనివాస్



అమిత్



అమీర్



నితిన్

సాక్షి, వరంగల్/వర్ధన్నపేట: ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు..ఎప్పటిలా బుధవారం కూడా ఉపాధిని వెతుక్కుంటూ బయలుదేరారు. కానీ ఎప్పటిలా వారు క్షేమంగా ఇంటికి చేరుకోలేదు. ఉదయాన్నే వారు ప్రయాణిస్తున్న ఆటోను మృత్యు శకటంలా దూసుకొచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా మరొకరు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం ఉదయం 7.12 గంటల ప్రాంతంలో ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను ఢీకొట్టిన లారీ 30 మీటర్లకు పైగా దానిని ఈడ్చుకెళ్లడంతో ఆటో డ్రైవర్ సహా ఆరుగురు దుర్మరణం చెందారు. శరీరాలు ఛిద్రం కావడంతో ఆ ప్రాంతమంతా రక్తంతో తడిసి భీతావహంగా మారింది. అతి వేగం, లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమికంగా గుర్తించామని వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ చెప్పారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**ఉపాధి కోసం వెళుతుండగా..**

రాజస్తాన్‌లోని జైపూర్‌కు చెందిన సురేశ్ కురేరీ కుటుంబం పదిహేనేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి కర్మాన్‌ఘాట్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకుంది. అక్కడ డెయిరీ పరిశ్రమల్లో కూలీలుగా పనిచేసే వీరు..కొంతకాలంగా అన్ని ప్రాంతాలు తిరుగుతూ తేనె తుట్టెల నుంచి తేనెను తీసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ క్రమంలోనే నెల రోజుల క్రితం వరంగల్‌లోని ఎల్‌బీనగర్‌కు వచ్చిన సురేశ్ కురేరీ కుటుంబం అక్కడ డేరాలు వేసుకొని నగరంలో తేనె అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం వరంగల్ నుంచి తొర్రూర్ వరకు వెళ్లిన వీరు ఇల్లంద గ్రామానికి కొంతదూరంలో ఉన్న తేనె తుట్టెల నుంచి తేనెను సేకరించి ఆ హైవేపైనే అమ్మారు. ఈ విధంగానే బుధవారం కూడా వరంగల్ బస్టాండ్ వద్ద ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఆటో కిరాయికి మాట్లాడుకొని తొర్రూర్‌కు బయలుదేరారు. సురేశ్ కురేరి (43) వెంట అతని కుమారులు అమిత్ (23), నితిన్ (11), అమీర్‌లు, సురేష్ సోదరి కుమారులు జలావత్ దామి అలియాస్ జాబీర్ (19, రూప్‌చంద్ దామి (33)లు ఉన్నారు. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఏసీ రెడ్డి నగర్‌కు చెందిన బట్టు శ్రీనివాస్ (42) ఆటో నడుపుతున్నాడు.

### మృత్యువులా ఎదురొచ్చి..

మధ్యప్రదేశ్ రాష్ట్రం నమీనా జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ మదన్‌లాల్ నాయక్ వైజాగ్ షిప్‌యార్డులో ఉన్న సరుకును లోడ్ చేసుకుని వరంగల్‌లో అన్‌లోడ్ చేయడానికి బయలుదేరాడు. ఈ లారీకి మదన్‌లాల్ సహా ఇద్దరు డ్రైవర్లు ఉండగా, కో డ్రైవర్ రాకేష్‌మీనా ఖమ్మం వరకు డ్రైవింగ్ చేశాడు. ఖమ్మం నుంచి మదన్‌లాల్ నడపడం ప్రారంభించాడు. లారీ ఇల్లంద సమీపిస్తుండగా అప్పటికే నిద్ర మత్తులో ఉన్న మదన్‌లాల్ లారీని అతి వేగంగా నడుపుతూ రాంగ్‌రూట్‌లో ఎదురొచ్చి ఆటోను ఢీకొట్టాడు. లారీ సుమారు 30 మీటర్ల దూరం ఆటోను ఈడ్చుకుంటూ వెళ్లింది. ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న వారి శరీరాలు మాంసం ముద్దలుగా మారాయి. సురేశ్ కురేరి, అమిత్ కురేరి, బట్టు శ్రీనివాస్ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన నితిన్ కురేరి, అమీర్ కురేరి, రూప్‌చంద్, జాబీర్‌లను ఆస్పత్రికి తరలిస్తుండగా నితిన్ మార్గం మధ్యలోనే మృతి చెందాడు. రూప్‌చంద్, జాబీర్ వరంగల్ ఎంజీఎంలో మరణించారు. అమీర్ కురేరిని ఎంజీఎం నుంచి మెరుగైన చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు ఇల్లంద గ్రామంలోని రాఘవేంద్ర కిరాణ దుకాణం వద్ద సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఫుటేజీలను పరిశీలించి ప్రమాదం ఉదయం 7 గంటల 12 నిమిషాల 43 సెకన్లకు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌తో పాటు పోలీసు అధికారులు పలువురు ఘటనాస్థలిని సందర్శించారు. సురేశ్ భార్య చాంద్‌మతి దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపీసీ 304(ఏ), 337 సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్నారు. లారీని సీజ్ చేయడంతో పాటు డ్రైవర్‌ను అరెస్టు చేశారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ఆర్థికమంత్రి హరీశ్‌రావుకు పీఆర్‌టీయూటీఎస్ నేతల వినతి



హరీశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: గత 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ నేతలు ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును కోరారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాగా, ఈ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించారని, అన్ని పెండింగ్ బిల్లులను ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల ఖాతాల్లోకి జమచేస్తామని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రవేశ పెట్టబోయే కొత్త హెల్త్ స్కీమ్‌కు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేస్తున్నట్టు మంత్రి చెప్పారని వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ, హైదరాబాద్
NIT No.SE/TW/HYD/235 to 239/2023-24 తేది : 14.08.2023
పనుల పేర్లు : కొన్ని జిల్లాలలోని 5 బి.టి. రోడ్డు పనులు. 5 పనుల కోసం మొత్తం వ్యయం: రూ. 546.20 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ తేది : 17.08.2023 సా.5.00 గం. మరియు బిడ్ దాఖలు ముగింపు తేది : 01.09.2023 మ. 3.00 గం. తదుపరి వివరాలకు దర్శించండి: https://tender.telangana.gov.in// ఫోన్ నం. 9492770365
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్
DIPR RO No.1313-DP/CL/Advt/ 1/2023-24, Dt 16.08.2023

aptdc A.P. TOURISM DEVELOPMENT CORPORATION LTD.
5th Floor, Stalin Corporate, Industrial Estate, Autonagar, Vijayawada-07
Tender Notice No.APTDC/O&M/1/2023-24, Dt:16.08.2023
E-TENDER NOTIFICATION
APTDC Ltd. inviting Bids for Selection of O&M Operator for 30 properties at various Tourist locations in Andhra Pradesh.
For further details visit our website www.tourism.ap.gov.in and https://www.apeprocurement.gov.in
Sd/- K. KANNA BABU, IAS, Managing Director
DIPR RO No.2275PP/CL/Advt/1/1/2021-22, Dt:16.08.2023

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
టెండరు ప్రకటన
NIT No. 2223/KMNR-54-55DCE(R)/EE-R/DEE-3/AEE/2022 తేది: 11-08-2023
కరీంనగర్ సర్కిల్‌లోని R&B శాఖలో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఫ్లాన్-MDR క్రింద రోడ్డు పని (1 నం.) (అంచనా మొత్తం రూ.14.00 కోట్లు) మరియు FDR-DMFT-2020-21 క్రింద బ్రిడ్జి పని (1 నం.) కోసం టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు రోడ్డు పని (1 నం.) మరియు బ్రిడ్జి పని (1 నం.) టెండరు షెడ్యూళ్లను https://tender.telangana.gov.in నుండి 16-08-2023 సా.4.00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది 24-08-2023 మ.3.30 గం. వరకు. మొబైల్ నం. +91 9491063422
సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), SR & CRN
DIPR RO No.1312-DP/CL/Advt/1/2023-24, Dt 16.08.2023

తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్
టూరిజం హౌస్, 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 29
టెలిఫోన్: 040-2326 2151 నుండి 57, ఫ్యాక్స్: 040-2326 1801
Tender No.TSTDC/WF/9/2023 తేది: 14.08.2023
పని పేరు: (ఎ) హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ చెరువు వద్ద ఖైరున్నీసా బోట్‌కు మరమ్మతులు, రిఫర్బిషింగ్ మరియు రెనొవేషన్ పనులు చేపట్టుటకు టెండర్లు కోరబడుచున్నవి. (బి) తెలంగాణ రాష్ట్రంలోని వాటర్ బాడీస్ వద్ద ఆపరేట్ చేయడానికి హౌస్‌బోట్స్ సరఫరా కోసం ప్రముఖ బోట్ తయారీదారుల నుండి ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుచున్నది. తదుపరి వివరాలకు దర్శించండి మా వెబ్‌సైట్ www.tourism.telangana.gov.in
సం/- డిప్యూటీ జనరల్ మేనేజర్ (WF)
DIPR RO No.5425-PP/CL/Advt/1/2023-24 Dt 16.08.2023

తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ
ఇ-టెండరు ప్రకటన
టి యస్ ఆర్ టి సి ఈ క్రింది టెండర్ నోటిఫికేషన్ ద్వారా I) రేగోడ్, లింగంపేట్, సంగారెడ్డి మరియు కంగ్టి బస్సు స్టేషన్ నందలి పెట్రోల్ బంకులు నడుపుట కొరకు సర్వీస్ ప్రొవైడర్ల నియామకానికి, II) వివిధ బస్సు స్టేషన్ నందలి 33 ప్రదేశాలకి NOC తెచ్చుకుని పెట్రోల్ బంకులు నడుపుట కొరకు సర్వీస్ ప్రొవైడర్ల నియామకానికి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు కోరుచున్నది. C1/437(13)/2023-OPD(M&C) Dt: 17.08.2023. మరిన్ని వివరాల కొరకు మా వెబ్‌సైట్ https://tender.telangana.gov.in or www.tsrtc.telangana.gov.in చూడగలరు మరియు CTM(M&C)&Dir(OP) వారిని ఫోన్ నెం.9959225400 లో సంప్రదించగలరు.
సం/- చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఎం & సి), డైరెక్టర్ (ఓపి)
DIPR RO No.5422-PP/CL/ADVT/1/2023-24, Dt:16-08-2023

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
e NIT No.07/SCSDF/CE (R&B), RR/2023-24, తేది: 11.08.2023
SCSDF మరియు STSDF పథకాల క్రింద మంజూరైన రెండు (2) జిల్లాలలో 9 పనులు అంటే నిజామాబాద్ జిల్లాలో 8 పనులు, మెదక్ జిల్లాలో 1 పని కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం రూ. 3245 లక్షలు. టెండరుదారులు / బిడ్డర్లు టెండరు షెడ్యూళ్లను https://tender.telangana.gov.in నుండి 17.08.2023 మ. 3:00 గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. చివరి తేది:25.08.2023.
సం/- చీఫ్ ఇంజినీర్ (R&B), రూరల్ రోడ్స్, హైదరాబాద్
DIPR RO No.1317-DP/CL/Advt/1/2023-24, Dt: 16.08.2023

మహబూబాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం
E1/MHBD/MPLTY/EPROC-16/2023-24 తేది: 14.08.2023
1) మొత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల సంఖ్య: 09 నం.లు., 2) పనుల రకం: సివిల్ మరియు ఇతర పనులు, 3) బిడ్ ప్రారంభ, ముగింపు తేది: 14.08.2023 (సా.7.00 గం.) నుండి 21.08.2023 (సా.5.00 గం.), 5) ధర బిడ్ తెరుచు తేది: 21.08.2023 (సా.5.10 గం.), పూర్తి మొత్తం: రూ.1212.00 లక్షలు, సంప్రదించవలసిన అధికారులు: M.AE (9849302581), Dy.EE (9849903602) మరియు http://tender.telangana.gov.in
సం/- కమిషనర్, మహబూబాబాద్ మున్సిపాలిటీ
DIPR RO No.5417-PP/CL/Advt/1/2023-24, Dt: 16.08.2023

మున్సిపాలిటీ కార్యాలయం:సత్తుపల్లి, ఖమ్మం జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No.E/SPL/101/2023 తేది: 16.08.2023
పనుల సంఖ్య 10, పని మొత్తం విలువ: రూ.397.90 లక్షలు. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం: 14-08-2023, బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం: 21-08-2023న ఉ.11.30 గం.లు. ఏవేని విచారణల కోసం సంప్రదించండి: 8008801220 మరియు 9030613631. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ www.eprocurement.gov.in లో చూడవచ్చును.
సం/- కమిషనర్, సత్తుపల్లి మున్సిపాలిటీ, ఖమ్మం జిల్లా, T.S.
DIPR RO No.5409-PP/CL/Advt/1/2023-24, Dt:16-08-2023

తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
Tender Notice No. SE/TSEWIDC/HYD/NIT/700 to 722/2023-24 తేది : 11.08.2023
దిగువ పనుల కోసం అర్హులైన కాంట్రాక్టర్లనుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. MOMB క్రింద ఇంతకుముందరి ఆదిలాబాద్ జిల్లాలో కిడెస్ ఎక్విప్‌మెంట్ ప్రాజెక్ట్ I to IV (4 నం.లు) సేకరణ, 2PHC, పల్లె, బస్తీ దవాఖానా MOMB, మిగిలిన హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం, విలేజ్ అర్బన్ హెల్త్ సెంటర్ బిల్డింగ్ (8 నం.లు) నిర్మాణం, సబ్-సెంటర్ బిల్డింగ్స్ (7 నం.లు) నిర్మాణం, 2PHS, పల్లె, బస్తీకు మౌలిక సదుపాయాల పటిష్ట పరచుట (ఒక్కొక్కటి రూ. 6.69 నుండి 154.60 లక్షలు). (క్ర.సం. 1 & 6 (1వ పిలుపు) & 7 నుండి 23 (రీకాల్)), ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు చేసేందుకు మరియు స్వీకరించేందుకు ఆఖరి తేది: 28.08.2023న సా.5.00 గం. వరకు. గమనిక: GO Ms.No.94 ఆఫ్ (ట్రాన్స్‌పోర్ట్, రోడ్స్ & బిల్డింగ్స్ (R.1) శాఖ, తేది: 16.04.08 ప్రకారం స్టీల్ & సిమెంట్ కోసం మాత్రమే ధర సర్దుబాటు వర్తిస్తుంది. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in దర్శించండి లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ్ ఎదురుగా, LB స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం. 29565991 వద్ద స్వయంగా సంప్రదించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TSEWIDC, హైదరాబాద్
DIPR RO No.5432-PP/CL/Advt/1/2023-24, Dt: 16.08.2023

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
(A STATE GOVERNMENT UNDER TAKING)
HEAD OFFICE: Sri Sai Towers, D.No.10-152/1, 4th & 5th Floor, Ashok Nagar, Beside Siris Company, Bandar Road, Kanuru, Vijayawada-520 007.
Lr.No. M2/FRK Tenders/2023-24 Dt: 16.08.2023
TENDER NOTICE
APSCSCL desires to call separate tenders for appointment of the Raw Fortified Rice Kernel (FRK) Suppliers in Four (4) Zones of Andhra Pradesh through NeML auction platform for Supply of Fortified Rice Kernels (FRK) with Three micro nutrients in 20KG bags for production of Fortified rice for KMS 2023-24.
All the interested Fortified Rice Kernel (FRK) Suppliers in all Over India may visit www.apscscl.in & www.neml.in to view and download tender documents at free of cost.
Last date for registration and completion of formalities for the e-auction shall be up to 29.08.2023 up to 5.00 p.m and the tentative date of online e-reverse auction through NCDEX e-MARKETS LIMITED (NEML) platform would be from 01.09.2023 to 05.09.2023.
Please contact Mob. No.: 9962059599.
Sd/- VC & MANAGING DIRECTOR

నవోదయ విద్యాలయ సమితి
విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ, B-15, సెక్టార్-62, నోయిడా, గౌతమ్ బుద్ధ నగర్, ఉత్తర ప్రదేశ్-201309
VI తరగతి JNVST 2024 కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ పొడిగింపు కోసం ప్రకటన
2024-25 విద్యా సంవత్సరం VI తరగతిలో ప్రవేశానికి జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష 2024 కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ జరుగుచున్నది. ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ తదుపరిగా 25.08.2023 వరకు పొడిగించబడినది. అభ్యర్థులు NVS వెబ్‌సైట్ https://navodaya.gov.in/ లేదా https://cbseitms.rcil.gov.in/nvs/ దర్శించి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చును.
లింగము (పురుషులు/మహిళలు) కేటగిరీ (జనరల్/OBC/SC/ST), ఏరియా (గ్రామీణ/పట్టణం), వైకల్యము మరియు పరీక్షా మాధ్యమం విషయాలలో నమోదిత అభ్యర్థుల ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలలో మార్పులు చేయుటకు ఆన్‌లైన్ దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ తర్వాత రెండు రోజుల కోసం కరెక్షన్ విండో తెరిచి ఉంటుంది.
నవోదయ విద్యాలయ సమితిచే జారీ చేయబడింది

# దండకారణ్యంలో సుదర్శన్ స్మారక స్తూపం

- స్తూపావిష్కరణ, సంస్మరణ సభకు వేలాదిగా తరలి వచ్చిన ఆదివాసీలు
- ఆటా, పాటలతో జోహార్లు అర్పించిన కళాకారులు
- వీడియో విడుదల చేసిన మావోయిస్టులు



సభకు హాజరైన ఆదివాసీలు

బెల్లంపల్లి: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన కటకం సుదర్శన్ అలియాస్ దూలా దాదా జ్ఞాపకార్థం మావోయిస్టులు స్మారక స్తూపాన్ని నిర్మించారు. దండకారణ్యంలో అనారోగ్యంతో అమరుడైన దూలా దాదాకు ఆదివాసీలు విప్లవాంజలి ఘటించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దండకారణ్యంలోని ఓ గ్రామ శివారులో భారీగా నిర్మించిన స్మారక స్తూపాన్ని ఆవిష్కరించి, రెండ్రోజులపాటు సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ నెల 2, 3వ తేదీల్లో ఈ కార్యక్రమం జరిగినట్లు సమాచారం. ఈ మేరకు మావోయిస్టు పార్టీ రెండ్రోజుల క్రితం వీడియో విడుదల చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**సహచరితో స్తూపావిష్కరణ**

దండకారణ్యంలో సుదర్శన్ కార్యకలాపాలు నిర్వహించిన ప్రధాన ప్రాంతాన్ని ఎంచుకుని ఆయన స్మారక స్తూపాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. సుదర్శన్ 69వ ఏట కన్నుమూశారు. 49 ఏళ్లపాటు రహస్య జీవితం గడిపిన ఆయన ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కకపోవడం గమనార్హం. తన జీవితాన్ని విప్లవోద్యమానికి అంకితం చేసిన ఆయన గత మే 31న అనారోగ్యంతో మరణించినట్లు మావోయిస్టు పార్టీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన స్మారక స్తూపానికి సుత్తి, కొడవలితో ముద్రించిన ఎర్రని తోరణాలు, పార్టీ జెండా, తెలుగు, హిందీ భాషల్లో రాసిన బ్యానర్లు కట్టారు. ఈ స్తూపాన్ని ఆయన విప్లవ సహచరి ఊరే దీదీ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు తెలిసింది.

**10 వేల మందితో సభ!**

సుదర్శన్ సంస్మరణ సభ, స్మారక స్తూపావిష్కరణ కార్యక్రమాన్ని మావోయిస్టు పార్టీ, ఆదివాసీలు భారీ ఎత్తున నిర్వహించినట్లు తెలుస్తోంది. దాదాపు 10 వేల మంది తరలి వచ్చినట్లు స్పష్టమవుతోంది. మావోయిస్టు పార్టీ గెరిల్లా సైనికులు విప్లవ కవాతు చేశారు. వేదికపై కళాకారులు ఆటా, పాటలతో జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకులు, గెరిల్లా దళాలు, ఆదివాసీ రైతులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# బాలికపై సామూహిక లైంగికదాడి!

- అఘాయిత్యానికి పాల్పడిన నలుగురు యువకులు
- బాలికను స్వస్థలానికి తరలిస్తుండగా మృతి
- పెద్దపల్లి జిల్లాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



విలేకరుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న కూలీలు

సాక్షి, పెద్దపల్లి: పొట్టకూటి కోసం పొరుగు రాష్ట్రం నుంచి వలస వచ్చిన కూలీ కుటుంబానికి చెందిన 15 ఏళ్ల బాలిక కామాంధుల దాహానికి బలైంది. ఈనెల 14న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వలస కూలీలు, స్థానికుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులోని శివపార్వతీనగర్‌లో ఇంటి నిర్మాణ పనుల్లో కొంతకాలంగా మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన 26 మంది వలసకూలీలు పనిచేస్తున్నారు. ఇందులో మధ్యప్రదేశ్‌లోని బాల్‌ఘాట్ జిల్లా కజ్రి గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక కూడా తన అక్కాబావలతో కలిసి పనులకు వెళ్తోంది. ఈనెల 14న వీరు పనిచేసే ప్రాంతంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి బైక్‌పై రైల్వే ఫ్లెఓవర్ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మరో ముగ్గురు యువకులు ఉన్నారు. వీరంతా ఆ బాలికపై సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. రాత్రి సమయంలో ఇంటికి పంపించారు. అప్పటికే బాలికకు రక్తస్రావం కావడం.. ఆ బాధ భరించలేక విషయాన్ని తన అక్కాబావలకు చెప్పింది. దీంతో వలసకూలీలు ఆమె మాటలను వాయిస్ రికార్డు చేశారు. ఈ ఘటనతో వలస కూలీలను తీసుకు వచ్చిన మేస్త్రీ గుట్టు చప్పుడు కాకుండా ఓ వాహనంలో ఆ బాలికను సొంత గ్రామానికి పంపించాడు. వీరు వెళ్తుండగానే మార్గమధ్యంలో బాలిక మృతి చెందిందని, ఆమెకు బుధవారం అంత్యక్రియలు కూడా పూర్తి చేశారని సమాచారం. ఈ విషయం వెలుగులోకి రావడంతో మీడియా ప్రతినిధులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, అప్పన్నపేటలో పనులు చేసే ఇతర కూలీలు కూడా స్వగ్రామాలకు వెళ్లాలని, లేకుంటే చంపేస్తామని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు కూలీలు మీడియా ముందు వాపోయారు. ఈ అంశంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# టీఆర్‌టీ ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

2017 సంవత్సరంలో అర్హత సాధించిన వారు 1,01,763 మంది, ప్రస్తుతం బీఎడ్, డీఎడ్ చివరి సంవత్సరం చదువుతున్న వారు కలుపుకొని 5 లక్షల మందికి పైగా నిరుద్యోగులు టీఆర్‌టీ కోసం నిరీక్షిస్తున్నారు.

**ఒక్క టీచర్ కూడా లేని స్కూళ్లు 1,290**

2021–2022 విద్యాశాఖ లెక్కల ప్రకారం..రాష్ట్రంలో ఒక్క టీచర్ కూడా లేని స్కూళ్లు 1290 ఉండగా, ఒకేఒక్క టీచర్ ఉన్న స్కూళ్లు 6350 ఉన్నాయి. వాటిల్లో పదిమందిలోపు విద్యార్థులున్న స్కూళ్లు 3291 ఉండగా, వాటిల్లో ఒక్క విద్యార్థి లేని 1500కుపైగా స్కూళ్లు మూత పడ్డాయి. నల్లగొండ జిల్లాలోనే అలాంటివి 50 వరకు ఉన్నాయి.

**నియామకాలు చేపట్టాలి**

సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చూడాలి. టీచర్లకు పదోన్నతులు చేపడితే కిందిస్థాయి పోస్టుల్లో ఖాళీలు అధికంగా వస్తాయి. నిరుద్యోగులకు మేలు జరుగుతుంది.

– చావ రవి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

**వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి**

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే చర్యలు చేపట్టాలి.

– రావుల రామ్మోహన్ రెడ్డి, బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

**టీఆర్‌టీ కోసం తప్పని ఎదురుచూపులు**

టీఆర్‌టీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నా. ఏటా రూ.వేలు ఖర్చు పెట్టి శిక్షణ తీసుకుంటున్నా ఉపయోగం ఉండటం లేదు.

– స్వాతి, జయశంకర్ భూపాలపల్లి

**గత టీఆర్‌టీలో రాలేదు.. ఇప్పుడైనా వస్తుందని**

2017 టీఆర్‌టీలో ఉద్యోగం రాలేదు.ఈసారైనా వస్తుందనే ఆశతో ప్రిపేర్ అవుతున్నా. త్వరగా టీఆర్‌టీ జారీ చేయాలి.

– రమ్య, సిద్దిపేట

# నువ్వెంతంటే నువ్వెంత..!

- వనపర్తి, డోర్నకల్ నియోజకవర్గాల్లో బయటపడిన కాంగ్రెస్ విభేదాలు
- ఏఐసీసీ పరిశీలకులముందే నాయకుల బాహాబాహీ
- గల్లాలు పట్టుకుని కొట్టుకున్న నేతలు, కార్యకర్తలు



వనపర్తిలో గొడవ పడుతున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్/మహబూబాబాద్ రూరల్: వనపర్తి, డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. టికెట్ల విషయంలో ఏఐసీసీ పరిశీలకుల ముందే నాయకులు బాహాబాహీకి దిగారు. ఎవరికి వారు అనుకూల నినాదాలతో సమావేశాన్ని వేడెక్కించారు.

బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం రసాభాసగా మారింది. పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి చిన్నారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఇటీవల పార్టీలో చేరిన ఎంపీపీ మేఘారెడ్డి వర్గాలు ఏఐసీసీ పరిశీలకుడిగా కర్ణాటక నుంచి వచ్చిన పీవీ మోహన్ ఎదుటే ఘర్షణకు దిగాయి. సమావేశంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాల్యానాయక్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే అభ్యర్థిగా చిన్నారెడ్డి తప్పుకోవాలని, కొత్త వారికి అవకాశం ఇవ్వాలని అన్నారు. దీంతో ఓబీసీ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు బొంబాయి మన్నెంకొండ పార్టీలో పనిచేయకుండా నిజాయతీ కలిగిన చిన్నారెడ్డి తప్పుకోవాలని అనడమేంటని ప్రశ్నించడంతో వివాదం మొదలైంది. ఈ తరుణంలోనే కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్, ఇతర నాయకులు కలగజేసుకుని చిన్నారెడ్డిని ఎలా అంటావు అంటూ తీవ్రంగా ప్రతిఘటించడంతో.. మాటా మాటా పెరిగి, నువ్వెంత అంటే నువ్వెంత అంటూ కాలర్లు పట్టుకొని ఒకరినొకరు తోసేసుకున్నారు. ఇదే క్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి తన సొంత గ్రామంలో యూత్ కమిటీలను ఏర్పాటు చేస్తే తనకే సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. అదే సమయంలో మేఘారెడ్డి వర్గీయులు సైతం కమిటీల ఏర్పాటు విషయంలో తమకు సమాచారం ఇవ్వకుండా ఏర్పాటు చేస్తున్నారని వాదనకు దిగడంతో పరిస్థితి గందరగోళంగా మారింది.

**డోర్నకల్‌లోనూ నేతల మధ్య ఘర్షణ..**

డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలోనూ విబేధాలు బయటపడ్డాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్‌లో డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశం జరిగింది. సమావేశానికి ఏఐసీసీ నుంచి పార్లమెంట్ పరిశీలకుడు పరమేశ్వర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో డోర్నకల్ నియోజకవర్గంనుంచి టికెట్ ఆశిస్తున్న రామచంద్రునాయక్ – నెహ్రూనాయక్ వర్గీయులు తారసపడ్డారు. నాన్‌లోకల్ వారికి టికెట్లు ఇవ్వొద్దు.. లోకల్ వారికే ఇవ్వాలని నెహ్రూ నాయక్ వర్గీయులు నినాదాలు చేశారు. దీంతో ఇరువర్గాల వారి మధ్య మాటామాటా పెరిగి కొట్టుకునే వరకు వచ్చింది. గొడవలో ఓ కార్యకర్తకు గాయమైంది. ఏఐసీసీ పరిశీలకుడు పరమేశ్వర్ నాయక్ ముందే ఘర్షణలు చోటుచేసుకోవడం గమనార్హం.

## క్లుప్తంగా...

### కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

**కోటా:** రాజస్థాన్‌లో కోచింగ్ సెంటర్ హబ్‌గా పేరు పొందిన కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌లోని గయకు చెందిన 18 ఏళ్ల వయసున్న వాల్మీకి ప్రసాద్ మంగళవారం రాత్రి అద్దెకి ఉంటున్న ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. వాల్మీకి పక్క గదిలోనే ఉంటున్న విద్యార్థులు రాత్రి అతని తలుపు కొడితే తియ్యకపోయే సరికి అనుమానం వచ్చి ఇంటి యజమానికి చెప్పారు. తలుపులు బద్దలు కొట్టి చూడగా అతను శవమై కనిపించాడు. వెంటనే వారంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంజనీరింగ్ ఎంట్రన్స్ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న వాల్మీకి రెండేళ్లుగా కోటాలోనే ఉంటున్నాడు. కోటాలో విద్యార్థి ఆత్మహత్యల్లో ఈ నెలలో ఇది నాలుగోది. ఇక ఈ ఏడాది ఇప్పటివరకు 20 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. నిరుపేద కుటుంబాల నుంచి పిల్లలు చదువుల ఒత్తిడి తట్టుకోలేకపోవడమో, తల్లిదండ్రులు చేసిన అప్పు వేధిస్తూ ఉండడంతో ఆత్మహత్యలు ఎక్కువైపోతున్నాయన్న అంచనాలున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతూ ఉండడంతో జిల్లా యంత్రాంగం ఆందోళన చెందుతోంది. ప్రతీ విద్యార్థికి సైక్రియాటిస్ట్‌తో కౌన్సెలింగ్ ఇప్పించడానికి సన్నాహాలు చేస్తోంది.

### బీజేపీతో కలిసేదే లేదు: పవార్



**ఔరంగాబాద్:** బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ కుండబద్దలు కొట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జాతీయస్థాయిలో మార్పు కోసం పూర్తిస్థాయిలో ప్రయత్నిస్తామని ప్రకటించారు. ఎన్నికల్లో మహారాష్ట్రలో ఎన్సీపీని కాదని మహా వికాస్ అగాడీలోని ఇతర భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్, శివసేన (యుబిటి) మాత్రమే కలిసి పనిచేయనున్నయనే వార్తలను కొట్టిపారేశారు. ఎన్సీపీ చీలిక వర్గం నాయకుడైన అజిత్ పవార్‌తో తన భేటీకి ప్రాధాన్యమేమీ లేదన్నారు. ఆ వర్గం ఇప్పటికి తన ఫోటోలను వాడుకుంటుండటంపై త్వరలో కోర్టుకు వెళ్తామని చెప్పారు. ఎన్సీపీ గుర్తు విషయమై ఎన్నికల కమిషన్ లేఖకు బదులు పంపినట్టు చెప్పారు. మణిపూర్‌తో పాటు ఈశాన్య భారతంలో జరుగుతున్న పరిణామాలు ప్రమాదకరంగా ఉన్నాయంటూ ఆందోళన వెలిబుచ్చారు. మణిపూర్ హింసపై మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మూగ నోము పట్టిందని దుయ్యబట్టారు. మోదీ ఈశాన్య భారతంలో పర్యటించి అక్కడ వారికి భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వర్షం ఇంకా లేదు.. వరదైంది..!

## స్పాంజ్ సిటీస్‌పై నీలి మేఘాలు

వరదలతో అతలాకుతలమవుతున్న చైనా

ఇప్పటివరకు 30 నగరాలు స్పాంజ్ సిటీలుగా రూపాంతరం

రోజుకి 20 సెంటీ మీటర్ల కంటే ఎక్కువ వర్షం కురిస్తే తట్టుకోవడం కష్టమే



చైనా వరద బీభత్సంతో అల్లాడిపోతోంది. నగరాలు నదుల్లా మారిపోయాయి. వరద ముంపుని ఎదుర్కోవడానికి చైనా కొన్నేళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన స్పాంజ్ సిటీస్ పై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వరదల్ని ఎదుర్కోవడానికి ఇప్పటివరకు 30 నగరాలను స్పాంజ్ నగరాలుగా మార్చింది. మరి ఈ స్పాంజ్ సిటీస్ సమర్థంగా పని చేయడం లేదా ? ఈ ఏడాది చైనాలో ఎందుకీ వరద బీభత్సం?

**స్పాంజ్ సిటీల నిర్మాణం ఇలా!**

- నగరంలో రెయిన్ గార్డ్స్ నిర్మాణం
- వర్షం నీరు రహదారులపై నిలవకుండా నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా రహదారుల నిర్మాణం
- వాన నీరు రిజర్వాయర్లలోకి వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం
- రోడ్డుకిరువైపు పేవ్‌మెంట్ల మీద, ప్రతీ భవనంలోనూ వాన నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతల ఏర్పాటు
- నీరు నిల్వ చేయడానికి కొత్తగా కాలువలు, చెరువుల తవ్వకం
- చిత్తడి నేలల పునరుద్ధరణ
- ప్రతీ భవనంపైనా రూఫ్ గార్డెన్స్ ఏర్పాటు
- వర్షం నీరుని శుద్ధి చేస్తూ తిరిగి వాడుకోవడానికి ఉపయోగపడేలా ఎక్కడికక్కడ ప్లాంట్ల నిర్మాణం

వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అయితే భారీ వర్షాలు, వరదలు లేదంటే రికార్డు స్థాయి ఎండలు, ఉక్కబోత.. ఇప్పుడివే కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో రికార్డు స్థాయి వర్షాలతో చైనా తడిసి ముద్దవుతోంది. కేవలం జులై నెలలో కురిసిన వర్షాలకే 150 మంది మరణిస్తే, వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. 250 కోట్ల డాలర్ల వరకు ఆస్తి నష్టం సంభవించింది. ఈ వరదల్ని ఎదుర్కోవడం కోసమే చైనా కొన్నేళ్ల క్రితం స్పాంజ్ సిటీల నిర్మాణానికి నడుం బిగించింది.

### ఏమిటీ స్పాంజ్ సిటీస్

వాతావరణ మార్పుల ప్రభావం ఎంత తీవ్ర స్థాయిలో ఉంటుందో అంచనా వేసిన చైనా 2015లో స్పాంజ్ సిటీస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చైనాలో 654 నగరాల్లో 641 నగరాలకి వరద ముప్పు పొంచి ఉంది. ప్రతీ ఏడాది 180 పట్టణాలు వరదలతో అతలాకుతలమవుతున్నాయి. జనాభాతో కిటకిటలాడుతూ ప్రతీ నగరం ఒక కాంక్రీట్ జంగిల్‌గా మారిపోవడంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నానాటికీ పెరిగిపోతున్నాయి. వర్షపు నీరు నగరాన్ని ముంచేయకుండా బొట్టు బొట్టు సద్వినియోగం చేసుకోవడమే ఈ స్పాంజ్ సిటీస్ లక్ష్యం. ఏ ప్రాంతంలో కురిసిన వాన నీరు అదే ప్రాంతంలో పూర్తిగా వాడుకునేలా సహజసిద్ధమైన ఏర్పాట్లు చేయడం స్పాంజ్ సిటీస్. ఒక్క మాటలో చెప్పాలంటే వర్షపు నీటిని ఒక స్పాంజ్‌లా పీల్చుకునేలా నగరాల రూపురేఖలు మార్చడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం.

చైనా ఈ ప్రాజెక్టుని అత్యంత ఘనంగా ప్రకటించింది కానీ ఆచరణలో ఇంకా వేగం పుంజుకోలేదు. 2015లో పైలెట్ ప్రాజెక్టుగా మొదలు పెట్టి 30 నగరాలను స్పాంజ్ సిటీలుగా మార్చింది. ఒక్కో నగరం మీద వెయ్యి కోట్ల యువాన్‌లకు పైనే ఖర్చు పెట్టింది. గత ఏడాది మొత్తం 654 నగరాలకు గాను 64 నగరాలకు స్పాంజ్ సిటీ మార్గదర్శకాలు పాటించాలని నిబంధనలు విధించారు.

### ఈ ప్రాజెక్టు ఎంతవరకు అమలైంది?

1978 నుంచి గణాంకాలను పరిశీలిస్తే చైనా పట్టణ ప్రాంత జనాభా అయిదు రెట్లు పెరిగింది. చైనా జనాభాలో 90 కోట్ల మంది పట్టణాల్లోనే నివసిస్తున్నారు. ఉత్తర చైనా మినహాయించి మిగిలిన పట్టణ ప్రాంత జనాభా అంతా వరద ముప్పులో ఉంది. అందుకే స్పాంజ్ సిటీస్ నిర్మాణం వేగవంతం చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్పాంజ్ సిటీస్ పై ఒక చట్టాన్ని తీసుకువస్తేనే త్వరితగతిన వీటి నిర్మాణం పూర్తి అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### స్పాంజ్ సిటీలకూ పరిమితులున్నాయ్..!

చైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్పాంజ్ సిటీలను నిర్మించినప్పటికీ ఈ ఏడాది వరద బీభత్సాన్ని ఎదుర్కోవడం సులభం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హెనాన్ ప్రావిన్స్‌లోని జెంగ్‌జూ నగరాన్ని పూర్తి స్థాయిలో స్పాంజ్ సిటీగా మార్చేసింది. 2016 నుంచి 2021 మధ్య కేవలం ఈ ఒక్క నగరంపైనే 6 వేల కోట్ల యువాన్‌లు ఖర్చు పెట్టింది. అయినప్పటికీ వరదల్ని ఎదుర్కోలేక జెంగ్‌జూ నగరం నీట మునిగింది. దీనికీ కారణాలున్నాయి. చైనా తలపెట్టిన స్పాంజ్ సిటీలు రోజుకి 20 సెంటీ మీటర్ల వర్షం కురిస్తే తట్టుకోగలవు. అలాంటిది గత జులైలో జెంగ్‌జూలో ఒక గంటలో 20 సెంటీ మీటర్ల వాన కురిసింది. ఇక బీజింగ్ పరిసరాల్లో మూడు రోజుల్లో 75 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అంతే కాకుండా ఉత్తర చైనాలో సాధారణంగా వర్షలు అంతగా కురవవు. అందుకే ఆ ప్రాంతంలో ఇంకా స్పాంజ్ సిటీల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించలేదు.. ఈ ఏడాది వాతావరణ మార్పుల ప్రభావంతో ఉత్తర చైనాలో రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. అక్కడ స్పాంజ్ సిటీల నిర్మాణం జరగకపోవడంతో వరదలు పోటెత్తాయి. చైనా ఎన్ని చర్యలు చేపట్టి కోట్లాది యువాన్‌లు ఖర్చు చేసినా ప్రకృతి ముందు తలవంచక తప్పలేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

# మళ్లీ ఎన్డీయేనే..

▶ మొదటి పేజీ తరువాయి



ఓట్లు లభిస్తాయని సర్వే వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేస్తుందని తేల్చింది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకు గాను దాదాపు మొత్తం స్థానాలు కైవసం చేసుకుంటుందని వెల్లడించింది. వైఎస్సార్‌సీపీకి 24 నుంచి 25 సీట్లు లభిస్తాయని తేల్చిచెప్పింది. అంతేకాకుండా ఆ పార్టీ ఓట్ల శాతం కూడా పెరుగనున్నట్లు గుర్తించింది. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ 49.8 శాతం ఓట్లతో 22 స్థానాల్లో నెగ్గింది. ఈసారి 51.3 శాతం ఓట్లతో మొత్తం స్థానాలను తన ఖాతాలు వేసుకుంటుందని టైమ్స్ నౌ సర్వే తేల్చడం విశేషం. అంటే కిందటి ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు ఆ పార్టీ ఓట్ల శాతం 1.50 శాతం పెరుగనున్నట్లు తేటతెల్లమవుతోంది. వైఎస్సార్‌సీపీ పట్ల నానాటికీ పెరుగుతున్న ప్రజాదరణకు ఇది నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు తెలంగాణలో అధికార భారత రాష్ట్ర సమితికి(బీఆర్ఎస్) 9 నుంచి 11 లోక్‌సభ స్థానాలు లభిస్తాయని సర్వే తెలియజేసింది. బీజేపీకి 2 నుంచి 3, కాంగ్రెస్‌కు 3 నుంచి 4 స్థానాలు దక్కుతాయని పేర్కొంది. ఇతరులు ఒక సీటు గెలుచుకోనున్నట్లు అంచనావేసింది.

**ఆంధ్రప్రదేశ్‌లో ఎవరికెన్ని సీట్లు**

| పార్టీ | సీట్లు |
|---|---|
| వైఎస్సార్‌సీపీ | 24-25 |
| తెలుగుదేశం | 0-1 |
| ఇతరులు | 0 |

**ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల శాతం**

| పార్టీ | ఓట్ల శాతం |
|---|---|
| వైఎస్సార్‌సీపీ | 51.3 |
| తెలుగుదేశం | 36.2 |
| ఇతరులు | - |

**తెలంగాణలో ఎవరికెన్ని సీట్లు**

| పార్టీ | సీట్లు |
|---|---|
| బీఆర్ఎస్ | 9-11 |
| బీజేపీ | 2-3 |
| కాంగ్రెస్ | 3-4 |
| ఇతరులు | 1 |

**తెలంగాణలో ఓట్ల శాతం**

| పార్టీ | ఓట్ల శాతం |
|---|---|
| బీఆర్ఎస్ | 38.40 |
| బీజేపీ | 24.30 |
| కాంగ్రెస్ | 29.90 |
| ఇతరులు | 7.40 |

## హిమాచల్‌ప్రదేశ్‌లో రూ.10 వేల కోట్ల ఆస్తి నష్టం

**మళ్లీ విరిగిపడిన కొండచరియలు, 71కి చేరిన మృతుల సంఖ్య**

**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఇంకా వర్ష బీభత్సం కొనసాగుతోంది. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో బుధవారం ఉదయం సమ్మర్ హిల్ ప్రాంతంలో మళ్లీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ శిథిలాల కింద చాలా మంది చిక్కుకున్నట్టుగా సమాచారం. సహాయ బృందాలు యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాయి. గత వారం రోజులుగా సమ్మర్ హిల్, కృష్ణానగర్, ఫగ్లీ ప్రాంతాలు కొండచరియల బీభత్సంతో వణికిపోతున్నాయి. ఇప్పటివరకు 71 మంది మరణించారు. దాదాపుగా 10 వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించిందని ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు తెలిపారు. ఖంగ్రా జిల్లాలో వర్షబీభత్స ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే నిర్వహించారు. అధికారులతో సమావేశమై పునరుద్ధరణ పనులపై చర్చించారు. "ఈ ఏడాది వర్షాలు చాలా నష్టాన్ని మిగిల్చాయి. పునరుద్ధరణకు చాలా సమయం పట్టేలా ఉంది. అయినా యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహిస్తాం" అని చెప్పారు. రోడ్లు, నీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాలు అతి పెద్ద సవాల్‌గా మారాయని, ఏడాదిలోగా అన్ని పనులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టుగా వివరించారు.

## దక్షిణ చైనా సముద్రంపై చైనా మరింత పట్టు ?

**బీజింగ్ :** దక్షిణ చైనా సముద్రంలో చైనా మరింత పట్టు బిగించడానికి విశ్వప్రయత్నాలు చేస్తోంది. సముద్ర దీవుల్లో వైమానిక స్థావరాల నిర్మాణాన్ని చేపట్టినట్టుగా వియాత్నం, తైవాన్ దేశాలు చెబుతున్నాయి. ఇదే విషయం ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా తేలినట్టు అసోసియేటెడ్ ప్రెస్ వెల్లడించింది. ఆగస్టు మొదటి వారంలో వచ్చిన ఫోటోల్లో వైమానిక స్థావర నిర్మాణానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించాయి. 2 వేల అడుగుల కంటే పొడవైన రన్‌వే నిర్మాణం జరుగుతోందని తాజా చిత్రాల్లో వెల్లడైంది. టర్బోప్రాప్ విమానాలు, డ్రోన్లు దిగడానికి వీలుగా ఈ రన్‌వే ఉంది. కానీ యుద్ధ విమానాలైతే దీనిపై దిగలేవని ఆ ఫోటోల ద్వారా స్పష్టమవుతోంది.

## పంది కిడ్నీ పని చేసింది

**న్యూయార్క్:** కిడ్నీ మార్పిడి చరిత్రలో పెద్ద ముందడుగు. అమెరికాలో న్యూయార్క్ లోని ఎన్ వైయూ లాంగ్ వన్ హెల్త్ సంస్థ వైద్యులు ఓ బ్రెయిన్ డెడ్ రోగికి పంది కిడ్నీ అమర్చగా అది ఏకంగా నెల రోజుల పాటు చక్కగా పని చేసింది. మనిషికి పంది కిడ్నీ ఇన్ని రోజుల పాటు పని చేయడం ఇదే తొలిసారి. గతంలో న్యూయార్క్ వర్సిటీ, అలబామా వర్సిటీ చేసిన కిడ్నీ మార్పిడులు రెండు మూడు రోజుల పాటు మాత్రమే పని చేశాయి. అన్నీ కుదిరితే త్వరలో సాధారణ రోగులకు కూడా పంది కిడ్నీ అమర్చుతామని వైద్య బృందం అంటోంది. అయితే మనిషి వ్యాధి నిరోధకతకు పంది కిడ్నీ ఎలా పని చేస్తుందో కూడా చూస్తామని చెబుతోంది. అందు కోసం రెండో నెల కూడా కిడ్నీని అలాగే ఉంచి చూడనున్నారు.

# ‘పీఎం విశ్వకర్మ’కు మంత్రివర్గం ఆమోదం

## రూ.13,000 కోట్లతో పథకం అమలు

- వచ్చే ఐదేళ్లలో 30 లక్షల కుటుంబాలకు లబ్ధి
- సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి రూ.2 లక్షల దాకా రుణ సాయం
- లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ సదుపాయం
- దేశవ్యాప్తంగా 169 నగరాల్లో 10,000 ఎలక్ట్రిక్ బస్సులు
- ‘ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ’ సమావేశంలో కీలక నిర్ణయాలు



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ‘ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ’ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రానున్న ఐదేళ్లలో అమలు చేయనున్న ‘పీఎం విశ్వకర్మ’ పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కింద రూ.13,000 కోట్లు ఖర్చు చేస్తారు. దేశవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. చేనేత కార్మికులు, స్వర్ణకారులు, వడ్రంగులు, లాండ్రీ కార్మికులు, క్షురకులు, కుమ్మరులు, శిల్ప కళాకారులు, రాళ్లు కొట్టేవారు, తాపీ మేస్త్రీలు, బుట్టలు అల్లేవారు, చీపుర్లు తయారుచేసేవారు, తాళాలు తయారుచేసేవారు, బొమ్మల తయారీదారులు, పూలదండలు తయారుచేసేవారు, మత్స్యకారులు, దర్జీలు, చేపల వలలు అల్లేవారు తదితర సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి ప్రయోజనం కల్పించాలని నిర్ణయించారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రధాని మోదీ మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. విశ్వకర్మ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ పథకాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ‘పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్, గుర్తింపు కార్డు’ అందజేస్తారు. రూ.2 లక్షల దాకా రుణ సదుపాయం కల్పిస్తారు. వడ్డీ రేటు 5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు ఇతర ప్రోత్సాహకాలు అందజేస్తారు. మార్కెటింగ్ మద్దతు సైతం ఉంటుంది. అంటే ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుంది.

### శిక్షణ కాలంలో రోజుకి రూ.500 స్టైపెండ్

పీఎం విశ్వకర్మ పథకంలో బేసిక్, అడ్వాన్స్‌డ్ అనే రెండు రకాల నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. లబ్ధిదారులకు శిక్షణ కాలంలో రోజుకి రూ.500 చొప్పున స్టైపెండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ఆధునిక యంత్రాలు, పరికరాలు కొనుక్కోవడానికి రూ.15,000 వరకూ ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. మొదటి ఏడాది 5 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో మొత్తం 30 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయని వివరించారు. గురు–శిష్య పరంపరను, కుటుంబ ఆధారిత సంప్రదాయ నైపుణ్యాలను బలోపేతం చేయడమే పథకం ఉద్దేశమని స్పష్టం చేశారు. తొలుత 18 రకాల సంప్రదాయ నైపుణ్యాలకు పథకాన్ని వర్తింపజేస్తామని అన్నారు.

### నగరాల్లో ‘పీఎం ఈ-బస్ సేవ’

పర్యావరణ హిత రవాణా సాధనాలకు పెద్దపీట వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాలకు మరింత ప్రోత్సహం ఇవ్వాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ‘పీఎం ఈ–బస్ సేవ’కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలియజేసింది. రవాణా సేవలు వ్యవస్థీకృతంగా లేని నగరాల్లో ఎలక్ట్రిసిటీ బస్సులను ప్రవేశపెట్టడమే ఈ కార్యక్రమ లక్ష్యమని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) విధానంలో 169 నగరాల్లో 10,000 ఈ–బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం అంచనా వ్యయం రూ.57,613 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.20,000 కోట్లు సమకూరుస్తుందని వివరించారు. హరిత పట్టణ రవాణా కార్యక్రమాల్లో భాగంగా 181 నగరాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

### 7 మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

రైల్వే శాఖలో 7 మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.32,500 కోట్లు. ఈ భారాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 35 జిల్లాలు ఈ ప్రాజెక్టుల పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న లైన్ కెపాసిటీ పెంచుతారు.

### మన కళాకారులకు మరింత ప్రోత్సాహం: మోదీ

పీఎం విశ్వకర్మ పథకంతో మన సంప్రదాయ కళాకారులకు, చేతి వృత్తిదారులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ‘ఎక్స్’లో పోస్టు చేశారు. మన దేశంలో నైపుణ్యాలకు, సాంస్కృతి వైవిధ్యానికి కొదవ లేదన్నారు. మన విశ్వకర్మల్లోని వెలకట్టలేని నైపుణ్యాలను ముందు తరాల కోసం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# నెహ్రూ మ్యూజియం కాదు.. ఇక ప్రధానమంత్రి మ్యూజియం

- అధికారికంగా పేరు మార్పు
- నెహ్రూ పేరును తొలగించడానికేనన్న కాంగ్రెస్
- ప్రధానమంత్రులందరికీ చోటు కల్పించామన్న బీజేపీ




**న్యూఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీ తీన్‌మూర్తి భవన్‌లో అంతర్జాతీయ ప్రఖ్యాతి వహించిన నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ఎన్ఎంఎంఎల్)ని ప్రధానమంత్రి మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ (పీఎంఎంఎల్) అని అధికారికంగా పేరు మార్చడం వివాదస్పదమవుతోంది. కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటలు మంటలు చెలరేగాయి. నెహ్రూ పేరుని చరిత్ర పుటల్లోంచి తొలగించడానికి ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారంటూ కాంగ్రెస్ మండిపడుతూ ఉంటే, ప్రధానమంత్రులందరికీ సమ ప్రాధాన్యం ఇచ్చామని బీజేపీ ఎదురుదాడికి దిగింది. నెహ్రూ మ్యూజియం పేరు మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పుడే దీనిపై వివాదం రేగింది. కాగా మ్యూజియం పేరు మారుస్తూ సోమవారం నాడు అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. "నెహ్రూ మెమోరియల్ మ్యూజియం లైబ్రరీ ఇక నుంచి ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీగా మారింది. ప్రజాస్వామ్యానికి అనుగుణంగా వైవిధ్యాన్ని చాటి చెప్పడానికే ఈ పేరు మార్పు జరిగింది. ఈ నెల 14 నుంచి ఉత్వర్వులు అమల్లోకి వచ్చాయి" అని పీఎంఎంల్ వైస్ చైర్మన్ సూర్యప్రకాశ్ వెల్లడించారు. తీన్‌మూర్తి భవనంలో 16 ఏళ్లపాటు నెహ్రూ అధికారిక నివాసంగా ఉంది. 1966 , ఏప్రిల్1న అందులో నెహ్రూ మ్యూజియంను ఏర్పాటు చేశారు.

**నెహ్రూని అప్రతిష్టపాల్జేయడమే మోదీ ఎజెండా: కాంగ్రెస్**

నెహ్రూ వారసత్వాన్ని అప్రతిష్టపాల్జేయడమే ప్రధాని మోదీ ఎజెండా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఆరోపించారు. ఈ మేరకు ట్విటర్‌లో ఒక పోస్టు పెట్టారు. "ప్రధాని మోదీ అభద్రతా భావం, భయాందోళనల మధ్య నెహ్రూ మ్యూజియం పేరు మార్చారు. నెహ్రూ వారసత్వాన్ని విధ్వంసం చేయాలని ఆయన భావిస్తున్నారు. మ్యూజియం పేరులో ఎన్ స్థానంలో పీ అని మార్చారు. అందులో "పీ" అంటే చిన్నతనం, ఇబ్బంది పెట్టడం" అని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. నెహ్రూ పేరు మార్చారు కానీ స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన పోషించిన పాత్రను, భారత్‌ను లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా ఆయన నడిపించిన విధానాన్ని చెరిపేయలేరని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

**ప్రధానమంత్రులందరి ఘనత చాటడానికే: బీజేపీ**

కాంగ్రెస్ చేసిన ఆరోపనల్ని బీజేపీ కొట్టిపారేసింది. దేశ ప్రధానమంత్రులందరి ఘనతలు ప్రపంచానికి చాటి చెప్పడానికే మ్యూజియం పేరుని మార్చినట్టు స్పష్టం చేసింది. లాల్‌బహదూర్ శాస్త్రి, పీ.వీ.నరసింహారావు, హెచ్.డి.దేవెగౌడ, ఐకే గుజ్రాల్ ఇలా ఎందరో భారత దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దారని, ఈ మ్యూజియం ఏ ఒక్కరికో, ఒక కుటుంబానికో చెందినది కాదని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు.

## బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ

**న్యూఢిల్లీ:** బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ బుధవారం నాడిక్కడ సమావేశమై మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించింది. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో పాటు కమిటీ సభ్యులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులను రాష్ట్ర నాయకత్వం ఎలక్షన్ కమిటీకి వివరించింది. సాధారణంగా ఎన్నికల తేదీలు ప్రకటించాక సమావేశమయ్యే సెంట్రల్ ఎలక్షన్ కమిటీ.. ముందుగానే భేటీ కావడం ఈ ఏడాది చివర్లో ఐదు రాష్ట్రాలకు జరిగే ఎన్నికలకు ఇస్తున్న ప్రాముఖ్యతను తెలియజెపుతోందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. గట్టి పోటీ ఎదురయ్యే స్థానాలపై బీజేపీ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. తగిన వ్యూహం, గట్టి అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా పరిస్థితులను అనుకూలంగా మలచుకోవచ్చని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

# జాబిల్లి వైపు వడివడిగా..

- ఐదోసారి చంద్రయాన్–3 కక్ష్య తగ్గింపు విజయవంతం
- నేడు ప్రపొల్షన్ మాడ్యూల్ నుంచి వేరుకానున్న ల్యాండర్ మాడ్యూల్

**సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా):** చందమామపై పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ కక్ష్య దూరాన్ని ఐదోసారి పెంచే ప్రక్రియను బుధవారం విజయవంతంగా నిర్వహించారు. దీంతో కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియలన్నీ పూర్తయ్యాయి. చంద్రుడి ఉపరితలంపై దిగే కీలక ఘట్టానికి చంద్రయాన్–3 మరింత చేరువైంది. ఇక ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్, రోవర్‌తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ వేరుకావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ మిషన్ చంద్రుడి సమీప కక్ష్యలోకి(లూనార్ ఆర్బిట్) ఎలాంటి అవరోధాలు లేకుండా చేరుకుంది. చంద్రయాన్–3 ఇప్పుడు చంద్రుడి చుట్టూ 153 కిలోమీటర్లు, 163 కిలోమీటర్ల స్వల్ప దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతోంది. అలాగే చంద్రుడి ఉపరితలం నుంచి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కక్ష్యలోకి చేరుకుంది. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్‌ను వేరుచేసే విన్యాసాన్ని ఈ నెల 17న చేపట్టనున్నట్లు ఇస్రో తెలియజేసింది.



నేటి నుంచే ముఖ్యమైన ఆపరేషన్

బెంగళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్(ఎంఓఎక్స్), ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్(ఇస్ట్రాక్), బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ (ఐడీఎస్ఎన్) లాంటి భూ నియంత్రిత కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు గురువారం నుంచి ముఖ్యమైన ఆపరేషన్లు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ విడిపోయిన తర్వాత ల్యాండర్‌లో వున్న ఇంధనాన్ని మండించి ఈ నెల 19, 21న రెండుసార్లు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టనున్నారు. ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధృవ ప్రాంతంలో మృదువైన ప్రదేశంలో దించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు.

# తీర్పుల్లో మహిళల పట్ల అనుచిత పదాలు వాడొద్దు

**హ్యాండ్ బుక్ విడుదల చేసిన సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్**

**ఢిల్లీ:** న్యాయస్థానాల్లో కేసుల విచారణ, తీర్పులు వెల్లడించే సమయంలో మహిళలపై వివక్షకు తావు లేకుండా కీలక ముందడుగు పడింది. వేశ్య, పతిత, ఎఫైర్, హౌస్‌వైఫ్, ట్రాన్స్‌సెక్సువల్, వ్యభిచారం వంటి పదాలు ఇక ఉపయోగించకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు నిర్దేశించింది. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ బుధవారం ఒక హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. "హ్యాండ్‌బుక్ ఆన్ కంబాటింగ్ జెండర్ స్టీరియో టైప్స్" పేరుతో ఉన్న ఈ హ్యాండ్‌బుక్‌లో న్యాయస్థానాలు గతంలో ఇచ్చిన తీర్పుల సమయంలో మహిళల పట్ల అనుచితంగా ఉండే 100కి పైగా పదాలు అందులో ఉన్నాయి. ఆ పదాలకు బదులుగా ఏం వాడాలో కూడా అందులో వివరంగా రాశారు. రెచ్చగొట్టే దుస్తులు, పెళ్లి కాకుండానే తల్లి, ఎఫైర్, వేశ్య వంటి పద ప్రయోగాలకు చేయకూడదని, వాటికి బదులుగా దుస్తులు, తల్లి, వివాహేతరం సంబంధం, సెక్స్ వర్కర్ అని మాత్రమే రాయాలని ఆ హ్యాండ్‌బుక్ స్పష్టంగా చెబుతోంది. ఈవ్‌టీజింగ్ బదులుగా స్ట్రీట్ సెక్సువల్ హెరాజ్‌మెంట్, హౌస్ వైఫ్ బదులుగా హోమ్‌మేకర్ అన్న పదాలు వాడాలని నిర్దేశించింది.

**మూస పదాలు వద్దు**

ఈ హ్యాండ్‌బుక్ విడుదల చేసిన సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ మాట్లాడుతూ న్యాయ ప్రక్రియల్లో మహిళలపై మూస పద్ధతుల్లో ఎలాంటి పదాలు ఉపయోగిస్తారో ఈ పుస్తం చెబుతుందని అన్నారు. "తీర్పులు రాసే సమయంలో న్యాయమూర్తులు మహిళల పట్ల అనాలోచితంగా అనుచిత పదాలు వాడుతున్నారు. మూసపద్ధతుల్లో ఉండే పద ప్రయోగాలు చేస్తున్నారు. గతంలో వచ్చిన తీర్పుల్ని విమర్శించడం ఉద్దేశం కాదు. భవిష్యత్‌లో న్యాయమూర్తులు ఆ పదాలు ఉపయోగించకుండా ఈ హ్యాండ్ బుక్ ఉపయోగపడుతుంది. ఏ పదాలకు గుర్తింపు ఉందో స్పష్టంగా తెలుస్తుంది. భవిష్యత్‌లు ఇచ్చే తీర్పుల్లో న్యాయమూర్తులు సరైన పదాలు వాడితే వారిచ్చే తీర్పులపై అపోహలకు కూడా తావుండదు" అని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు.

## రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘంలో రాహుల్ గాంధీ!

**న్యూఢిల్లీ:** రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం(స్టాండింగ్ కమిటీ) సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ బుధవారం నామినేట్ అయ్యారు. కాంగ్రెస్ మరో ఎంపీ అమర్‌సింగ్ కూడా ఇదే కమిటీకి నామినేట్ అయ్యారు. ఈ మేరకు లోక్‌సభ ఒక బులెటిన్ విడుదల చేసింది. పరువు నష్టం కేసులో అనర్హత వేటు పడకముందు రాహుల్ గాంధీ రక్షణ శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘంలో సభ్యుడిగా వ్యవహరించారు. ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని ఆగస్టు 7న పునరుద్ధరించిన సంగతి తెలిసిందే. ఎన్సీపీ ఎంపీ ఫైజల్ పి.పి.మొహమ్మద్ లోక్‌సభ సభ్యత్వాన్ని కూడా పునరుద్ధరించారు. ఆయనను వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ స్టాండింగ్ కమిటీకి నామినేట్ చేశారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 17 । ఆగస్టు । 2023



## సిటీలో పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కె.వీ.గౌతమినగర్ ఫీడర్ పరిధిలోని తిరుమల్‌నగర్, చంద్ర అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్- 2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

## నేడు మెగా జాబ్‌మేళా

కరీంనగర్ సిటీ: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి తెలిపారు. ఉదయం 9:30కు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, 25పైగా కంపెనీలు పాల్గొంటా యని వివరించారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, ఒకసెట్ జిరాక్స్‌తో హాజరుకావా లని, వివరాలకు 73370 20111 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
34.0/26.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

# తమ్ముడూ.. నీవెంటే నేను

- పక్షం రోజుల వ్యవధిలో అన్నదమ్ముల మృతి



మధుకర్‌రెడ్డి(ఫైల్)



సంతోష్ రెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): తమ్ముడి మృతిని తట్టుకోలేక అన్న గుండె ఆగింది. తమ్ముడు గుండెపోటుతో మృతిచెందగా.. పెద్దకర్మరోజు అన్న కూడా గుండెపోటుతో కుప్పకూలాడు. చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశాడు. ఈవిషాద ఘటన తిమ్మాపూర్ మండలం రేణికుంటలో జరిగింది. రేణికుంటకు చెందిన ఉమ్మెంతల చంద్రారెడ్డికి ఇద్దరు కొడుకులు సంతోష్‌రెడ్డి(30), మధుకర్‌రెడ్డి(26) ఉన్నారు. పెద్దకొడుకు సంతోష్‌రెడ్డి కరీంనగర్‌లో, మధుకర్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రయివేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరికీ పెళ్లికాలేదు. 20 రోజుల క్రితం మధుకర్‌రెడ్డికి జ్వరం వచ్చింది. హైదరాబాద్‌లోనే ఓ ఆస్పత్రిలో చేరగా రక్తకణాలు తగ్గినట్లు డాక్టర్లు చెప్పారు. చికిత్స తీసుకుంటున్న క్రమంలో గుండెపోటుకు గురై ఈనెల 3న మృతిచెందాడు. తమ్ముడి పెద్దకర్మరోజు సంతోష్ రెడ్డి గుండెపోటుకు గురయ్యాడు. ఆయనను కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్సకు సుమారు రూ.20 లక్షలకు పైగా ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పడంతో నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సంతోష్ మృతిచెందాడు. పక్షం రోజుల వ్యవధిలో ఇద్దరు కొడుకులు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## న్యూస్‌రీల్

### జిల్లా ఆస్పత్రికి బెస్ట్ ఆరోగ్యశ్రీ అవార్డు



కరీంనగర్‌టౌన్: జిల్లా ఆసుపత్రుల విభాగంలో కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి బెస్ట్ ఆరోగ్యశ్రీ అవార్డును గెలుచుకుంది. ఈ అవార్డును బుధవారం కలెక్టర్ గోపి చేతుల మీదుగా జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ అందుకున్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి పాల్గొన్నారు.

### విజిలెన్స్ ఎస్పీని కలిసిన టీఎన్జీవోలు



కరీంనగర్ అర్బన్: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ అట్ల రమణారెడ్డిని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, వి.శ్రీనివాస్‌రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల అధ్యక్షుడు రామస్వామి ఉన్నారు.

### 20న గద్దర్ సంస్మరణ సభ



కరీంనగర్: ప్రజా యుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న కరీంనగర్‌లోని రెవెన్యూ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్ తెలిపారు. స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు కవిత, గోరెటి వెంకన్న, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కవులు, కళాకారులు, వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు.

# ఎఫ్‌ఆర్‌కే వైపు మిల్లర్ల చూపు

- ఉప్పుడు బియ్యం తీసుకోకపోవడమే కారణం
- ధాన్యంలో ఒకశాతం ఫోర్టిఫైడ్ రైస్ మిక్స్.. ఇక ఇవే బియ్యం సరఫరా

కరీంనగర్ అర్బన్:

ఉప్పుడు బియ్యంపై పీట ముడి పడటంతో రైస్‌మిల్లర్లు ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషిస్తున్నారు. నూతనంగా ఎఫ్‌ఆర్‌కే విధానం తెరపైకి రాగా.. ధాన్యం మరాడింపులో ఇవి కలపడం ప్రధాన ప్రక్రియ. దీంతో మినరల్స్ ఉత్పత్తి దిశగా అడుగులేస్తున్నారు మిల్లర్లు. జిల్లాలో ఏటా లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎఫ్‌సీఐకి సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌ఆర్‌కే తయారీకే మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే పలువురు మిల్లర్లు సార్టెక్స్ యంత్రాలు ఏర్పాటు చేసుకున్నారు. సాంకేతిక యజమాన్య పద్ధతుల్లో కొంత తేడా ఉండటంతో తర్ఫీదు పొందుతున్నారు. మామూలుగా రేషన్ దుకాణాల్లో బియ్యం సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ బియ్యంలో బలవర్థక ముడి పదార్థాన్ని కలుపుతున్నారు. 2021 వానాకాలం సీజన్ నుంచే సదరు పద్ధతిలో బియ్యం రవాణా జరుగుతుండగా ఎఫ్ ఆర్‌కే(ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్) ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేస్తున్నారు. అవే ఎఫ్‌ఆర్‌కే ఇక్కడి మిల్లర్లే తయారు చేయనున్నారన్న మాట.

**ఎఫ్‌ఆర్‌కే అంటే?**

ఫోర్టిఫైడ్ రైస్ కర్నెల్స్ (ఎఫ్‌ఆర్‌కే) బలవర్థకమైన ముడి పదార్థం. విటమిన్ బీ12, మినరల్స్, పోషకాలు గల ముడి సరుకులతో తయారు చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని మరాడించి అందులో ఒకశాతం ఎఫ్‌ఆర్‌కేను కలపనున్నారు. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేయనున్నారు. దీనికి బ్లెన్నింగ్ మెషిన్‌తో పాటు ఈ ఎఫ్‌ఆర్‌కే ముడి సరుకు అవసరం. 99 కిలోల బియ్యానికి ఒక కిలో ఎఫ్‌ఆర్‌కే కలుపుతారు.

**అక్రమాలకు చెక్**

సీఎంఆర్ విధానంలో ఏటా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. మర ఆడించిన బియ్యాన్ని విక్రయించడం, రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి పాలిష్ చేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నవారే ఎక్కువ. మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని వీలైనంత త్వరగా మర ఆడించి ఇవ్వాల్సి ఉండగా గడువు పొడిగిస్తూ మిల్లింగ్ చేస్తుండటం గమనార్హం. ఈ నూతన విధానంతో అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది. జిల్లాలో రారైస్ మిల్లులు 84, బాయిల్డ్ రైస్ మిల్లులు 91 ఉన్నాయి. ఏటా లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మర ఆడించేందుకు ఇస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్నుల పైనే కేటాయిస్తున్నారు. ధాన్యం కేటా యించిన 15 రోజుల్లోనే మర ఆడించి ఇవ్వాలనే నిబంధనతో అక్రమాలకు చెక్ పడినట్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**మార్గదర్శకాలివే**

కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించిన ధాన్యాన్ని 15రోజుల్లోనే మరాడించి ఇవ్వాలి. నిర్దేశిత గడువులోగా ఇవ్వకపోయినా, నెమ్మదిగా మిల్లింగ్ చేస్తున్నట్లు గుర్తించినా ధాన్యాన్ని ఇతర మిల్లులకు తరలిస్తారు. రావాల్సిన బియ్యం గురించి రోజువారీగా కలెక్టర్ పర్యవేక్షించనున్నారు. కొనుగోలు కేంద్రాలకు సమీపంలో ఉన్న మిల్లులకే ధాన్యాన్ని ఇవ్వాలి.

**కొత్తగా మిక్స్‌డ్ ఇండికేటర్ సిస్టమ్**

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) సేకరణ విషయంలో భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) నిబంధనలను కఠినతరం చేసింది. తాజాగా మిల్లింగ్ చేసిన కొత్త బియ్యాన్ని మాత్రమే తీసుకునేందుకు ఓ టెస్టింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముడిబియ్యాన్ని తీసుకునే క్రమంలో మిక్స్‌డ్ ఇండికేటర్ సిస్టమ్ అవలంబించనున్నారు. దీంతో బియ్యం ఎంతకాలం క్రితం మిల్లింగ్ చేశారో తెలిసిపోనుంది. బాయిల్డ్ రైస్ క్వింటా ధాన్యానికి 68 కిలోలు, రారైస్ అయితే 67 కిలోల చొప్పున బియ్యాన్ని ఎఫ్‌సీఐకి మిల్లర్లు ఇవ్వాలనే నిబంధన విధితమే.



సంచుల్లో బియ్యం నింపుతున్న హమాలీలు

జిల్లాలో రైస్‌మిల్లులు: 175 | రారైస్ మిల్లులు: 84 | బాయిల్డ్ మిల్లులు: 91

**ఆయా సీజన్లలో సగటున కొనుగోళ్ల తీరిలా(మెట్రిక్ టన్నుల్లో)**

| | |
|---|---|
| యాసంగి: | 3,46,567.567 |
| ధాన్యం విలువ: | రూ.635.73కోట్లు |
| ధాన్యం పండించే రైతులు: | 60,187 |
| వానాకాలం: | 2,54,231.543 |
| ధాన్యం విలువ: | రూ.498.29కోట్లు |
| రైతుల సంఖ్య: | 53,079 |



మెషిన్‌ను సరిచూస్తున్న నిపుణుడు

# ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా



చింతకుంట శాంతినగర్‌లోని సేవాలాల్ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కమలాకర్

- బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి కమలాకర్
- చింతకుంటలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

కొత్తపల్లి(కరీంనగర్):

కరీంనగర్ ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదిస్తే.. నియోజకవర్గాన్ని మరింత గొప్పగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దుతానని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం కొత్తపల్లి మండలం చింతకుంటలోని రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన మంత్రి గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. శాంతినగర్‌లోని సేవా ఘడ్‌గుట్టపై సంత్ సేవాలాల్ మహారాజ్ మేరమ్మ ఆలయం ఆవరణంలో రూ.15 లక్షల నిధులతో నిర్మించే కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డుకు భూమి పూజ చేసి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ సంత్ సేవాలాల్ ఆలయ అభివృద్ధికి గతంలోనే 5 లక్షల రూపాయలు మంజూరు చేశానన్నారు. బంజారాలకు తీజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చింతకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడి కింద రూ.31.79 లక్షలతో నిర్మించిన ప్రహారీ, మరుగుదొడ్లు, తదితర అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. రూ.5 లక్షలతో నిర్మించనున్న మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేశారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, జెడ్పీటీసీ పిట్టల కరుణ, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు, ఎంపీటీసీ భూక్యా తిరుపతి నాయక్, తహసీల్దార్ రాజేశ్, ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సాబీర్ పాషా, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్, పూజారులు మిట్టల్ నాయక్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

# పారిశ్రామికంగా ఎదిగేలా డిక్కీ మార్గదర్శనం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బి.గోపి

కరీంనగర్: దళితబంధు లబ్ధిదారులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా డిక్కీ మార్గదర్శనం చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఆడిటోరియంలో డిక్కీ ఆధ్వర్యంలో టి.ఇగ్నిట్–2.0 ఉమ్మడిజిల్లా ఎస్సీ ఎస్టీ యువతీ యువకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికి కరీంనగర్ సరైన ప్రదేశమని, జిల్లాలో 18 వేలకు పైగా దళితబంధు లబ్ధిదారులను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత డిక్కీ తీసుకోవాలని అన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ.. డిక్కీ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని తమ తెలివితేటలతో వ్యాపారాన్ని బాగా నడిపి మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అన్నారు. డిక్కీ రాష్ట్ర ప్రెసిడెంట్ దాసరి అరుణ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతే ధ్యేయంగా డిక్కీ పనిచేస్తుందని అన్నారు. 2013 తర్వాత మళ్లీ 2023లో ఎస్సీ, ఎస్టీ యువతకు సెప్టెంబర్ మాసం రెండోవారంలో హైదరాబాద్‌లో 21రోజుల పాటు ప్రోగ్రాంను డిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డిక్కీ కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు శైలజ, డిక్కీ అడ్మిన్ పరమేశ్, నారాయణ, స్టేట్ కోఆర్డినేటర్ అరుణ్ ఉన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ బి.గోపి

### ఓటు ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం

కరీంనగర్ అర్బన్: ఓటు ప్రాముఖ్యతపై ప్రణాళికాబద్ధంగా విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర జాయింట్ ఎన్నికల ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌తో వీసీలో మాట్లాడారు. విద్యాసంస్థల్లో ప్రత్యేక ఎలక్టోరల్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని, ఓటరు ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ నెల 15నాటికి మంజూరు చేసిన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డు త్వరగా ముద్రణ చేయాలని తెలిపారు. రెండో విడత ఓటరు జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల కంటే ముందు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని, రెండవ ఓటరు సవరణ షెడ్యూల్‌పై సమాచారం అందించాలని, ఈ నెల 21న విడుదల చేస్తామని, సెప్టెంబర్ 19 లోపు అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. కలెక్టర్ బి గోపి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

# గృహ'లక్ష్మి'లు ఎవరో?

- లబ్ధిదారుల ఎంపిక మరూ
- నగరంలో మూడు వేల దరఖాస్తులు
- డివిజన్‌ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన
- 19వ తేదీలోగా నివేదిక





మాట్లాడుతున్న మేయర్ సునీల్ రావు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కీలక దశకు చేరుకుంది. నగరవ్యాప్తంగా 60 డివిజన్ల నుంచి మూడువేల దరఖాస్తులు రాగా, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ బుధవారం నుంచి మొదలైంది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నగరపాలకసంస్థ ఉద్యోగులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన ప్రారంభించారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పరిశీలన ఉండనుంది. కాగా క్షేత్రస్థాయిలో పర్యటించే ఉద్యోగులు, అధికారులకు మేయర్ యాదగిరి సునీల్‌రావు దిశానిర్దేశం చేశారు.

**డివిజన్‌కు 50 మించలేదు..**

నిరుపేదల సొంతింటి కలను నిజం చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెట్టడం తెలిసిందే. సొంత స్థలం ఉండి, ఇంటి నిర్మాణం చేసుకొనే వారికి రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లించే అవసరం లేకుండా రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడమే ఈ పథకం ఉద్దేశం. మహిళల పేరిటనే ఆర్థిక సహాయం అందించనుండడంతో ఈ పథకానికి గృహలక్ష్మి అనే నామకరణం చేశారు. ఈ పథకానికి అర్హుల నుంచి నగరపాలకసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో ఇటీవల దరఖాస్తులు స్వీకరించారు. అర్బన్ కావడంతో నగరవ్యాప్తంగా కేవలం మూడు వేల దరఖాస్తులు వచ్చాయి. సరాసరిగా 60 డివిజన్‌లను పరిశీలిస్తే డివిజన్‌కు 50 దరఖాస్తులకు మించి రాలేదు. కాగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు, క్షేత్రస్థాయిలో పరిశీలనకు సిద్ధమయ్యారు. ఇందుకోసం నగరపాలకసంస్థ రెవెన్యూ విభాగం ఆర్‌ఐ, బిల్‌కలెక్టర్లను వినియోగించుకోనున్నారు. ఆర్‌ఐలు, బిల్‌కలెక్టర్‌లు ఆయా డివిజన్‌లకు వెళ్లి, వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. మూడు రోజుల పరిశీలన అనంతరం ఈ నెల 19న నివేదిక అందజేయనున్నారు. ఈ నివేదిక మేరకు అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

**పారదర్శకంగా పరిశీలన : మేయర్**

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా ఉండాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికపై క్షేత్రస్థాయిలో పరిశీలించే ఆర్‌ఐలు, బిల్‌కలెక్టర్లతో పాటు అధికారులకు బుధవారం నగరపాలక కార్యాలయంలో దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారుల గుర్తింపు పారదర్శకంగా ఉండాలని, ఎక్కడా నిబంధనలు మీరొద్దని హితబోధ చేశారు. వచ్చిన 3వేల దరఖాస్తులను డివిజన్‌ల వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఈ నెల 19వ తేదీలోగా పరిశీలన పూర్తి చేసి, తుది నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు పంపించి, 20వ తేదీ తరువాత రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, కమిషనర్ సేవా ఇస్లావత్, డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి, ఆర్వో ఆంజనేయులు, ఆర్‌ఐలు శ్రీకాంత్, రషీద్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

# 22 మందికి కారుణ్య నియామకాలు

కరీంనగర్ అర్బన్: ఎట్టకేలకు కారుణ్య నియామకాలు చేపట్టారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర కారణాలతో మూడు, నాలుగేళ్ల వ్యవధిలో మరణించినవారుండగా 22 మందికి ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. వారంతా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగగా కాలయాపన తప్పా కార్యాచరణ కరవైంది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌గా బీ.గోపి బాధ్యతలు చేపట్టిన తొలిసారి ఈ నెల 1న ప్రజావాణిలో కారుణ్య నియామకాల కోసం యువత రాగా వీలైనంత త్వరగా ఫైల్ సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పక్షం రోజుల్లోనే 22మందికి కారుణ్య నియామక పత్రాలను సిద్ధం చేయగా బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్‌తో కలిసి నియామకపు పత్రాలను అందజేశారు. వైద్యారోగ్యశాఖ, రెవెన్యూ, ఐఅండ్‌పీఆర్, ఇంటర్ ఎడ్యుకేషన్, డీఈవో, ఆడిట్ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారు.

# కల్యాణ వైభోగమే..

- నేటినుంచి శ్రావణమాసం.. • ఈనెల 19 నుంచి డిసెంబర్ 31 వరకు..
- 53 శుభ ముహూర్తాలు.. జిల్లాలో సుమారు 13 వేల వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా

విద్యానగర్(కరీంనగర్): సకల వేడుకల సమయం.. శ్రావణమాసం వచ్చేసింది. రెండు మాసాల తరువాత శుభగడియలను తీసుకొచ్చింది. శ్రావణమాసం ఆరంభంతో జిల్లా వ్యాప్తంగా శుభకార్యాల సందడి నెలకొననుంది. ఈనెల 19 నుంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిబాజాలు మోగనున్నాయి. వివాహాలు.. ఇతర శుభకార్యాలకు జిల్లాప్రజలు సిద్ధమవగా.. ఈనెల 19నుంచి డిసెంబర్ 31వరకు 5నెలల కాలంలో 53 శుభముహూర్తాలు ఉన్నాయని, సుమారు 13వేల వివాహాలు జరిగే అవకాశం ఉందని వేద పండితులు వివరించారు.

### శుభ ముహూర్తాలివే..

ఆషాఢం, అధిక శ్రావణం కారణంగా వివాహాది శుభకార్యాలకు 2నెలల పాటు బ్రేక్ పడింది. ఈనెలలో 19, 20, 22, 24, 26, 30, 31 తేదీల్లో మంచి రోజులున్నాయి. సెప్టెంబర్‌లో 1, 2, 3, 6, 7, 8 తేదీలు, అక్టోబర్‌లో 18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31 తేదీలు.. నవంబర్‌లో 1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29 మొత్తం 14 రోజులున్నాయి. డిసెంబర్‌లో 3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31 తేదీలు మంచి రోజులు ఉన్నాయని వేద పండితులు తెలిపారు.

### వ్యాపార వర్గాల్లో పెళ్లి సందడి

పెళ్లిళ్ల నేపథ్యంలో బంగారు, వస్త్ర దుకాణాలు, పెళ్లి వస్తువుల దుకాణాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. కరీంనగర్‌తో పాటు చుట్టూ 10కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫంక్షన్ హాళ్లు ఇప్పటికే బుక్ అయ్యాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఫంక్షన్ హాళ్లు దొరకనివారు ఖాళీస్థలాల్లో వివాహాలు జరుపుకునేందుకు సిద్ధం అవుతున్నారు. తక్కువ ముహూర్తాలు ఉండడంతో వేదబ్రాహ్మణులకు, బ్యాండ్, సౌండ్, పెళ్లిపందిరి, క్యాటరింగ్ వారికి డిమాండ్ పెరిగింది.

### ఐదునెలల్లో ముహూర్తాలు

గత రెండు నెలలుగా ముహూర్తాలు లేకపోవడతో శుభకార్యాలు లేవు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 31వరకు మంచి రోజులు ఉన్నాయి. శుభాకార్యాలకు, పెళ్లిళ్లకు ఈ ఐదునెలల్లో మొత్తం 53 రోజులు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– మంగళంపల్లి శ్రీనివాసశర్మ, నగర వైదిక పురోహితులు



## క్లుప్తంగా

### చల్మెడ ఆస్పత్రి సేవలకు గుర్తింపు



ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ గోపి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ చల్మెడ ఆనందరావు ఆస్పత్రి ఆరోగ్యశ్రీ పథకం కింద అందిస్తున్న వైద్యసేవలకు ప్రభుత్వ గుర్తింపు లభించింది. ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన–ఆరోగ్యశ్రీ తెలంగాణ ద్వారా ఉత్తర తెలంగాణలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, సిద్దిపేట, నిజామాబాద్ జిల్లాల ప్రజలకు ప్రత్యేక వైద్య నిపుణులతో దవాఖానాలో వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుజాత సమక్షంలో కలెక్టర్ గోపి చల్మెడ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆసీం అలీకి ప్రశంసాపత్రం అందజేశారు.

### ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కరీంనగర్‌క్రైం: మానేరు డ్యాం, కేబుల్ బ్రిడ్జి తోపాటు రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రవికుమార్ హెచ్చరించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా మంది యువకులు బైక్‌లపై వేగంగా వెళ్తూ ప్రయాణికులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ప్రాణహాని కలిగేటట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు యువకులు వరంగల్ నుంచి బైక్ రైడ్ చేస్తూ మానేరు డ్యాం వద్దకు వచ్చారని పేర్కొన్నారు. వీరిలో అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ స్టంట్స్ చేసిన అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

### నూతన నియామకం



సతీశ్‌కుమార్

సప్తగిరికాలనీ(కరీంనగర్): బహుజన స్టూడెంట్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా చొప్పదండి మండలంలోని రాగంపేటకు చెందిన ఉండాడి సతీశ్‌కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్ల గణేశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు సతీశ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు హార్దిక శుభాకాంక్షలు



సహాయ సంచాలకులు, గనులు, భూగర్భ శాఖ, కరీంనగర్
జిల్లా గనులు మరియు భూగర్భ శాఖలో విశిష్ట సేవలందించినందుకు గాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు గారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న శుభసందర్భంగా గారికివే మా హార్దిక శుభాకాంక్షలు...
కార్యాలయ సిబ్బంది, గనులు మరియు భూగర్భ శాఖ, కరీంనగర్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GRANITE MACHINES FOR SALE
a) SOCOMEC Italian 72 Multi Wire Variable Thickness Sparingly Used Cutting Machine, In Perfect Running Condition with All Accessories.
b) BARSANTI Italian 16 Head, Brand New Unused Fully Automatic Polishing Line, Perfect Trial Condition with All Accessories.
7397741830
BANGALORE

WANTED

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 21000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర॥ 6281342090, 9949857816. [WA-7213]

■ INC ఆఫీస్ నందు పనిచేయుటకు యువతి యువకులు కావలెను. P/T-9K / F/T - 24K. ఇతర వివరాలకు ✆ 6300264252 [G-786475]

www.sakshi.com

■ లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్3K ఫోన్: 9640400073 [HA-189320]

■ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో పార్ట్ / ఫుల్ టైం పనిచేస్తూ.. అధికంగా సంపాదించే అవకాశం కలదు. స్త్రీ / పు. అర్హులు. వివరాలకు సంప్ర : 80087 72103 [V- 797279]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221494]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

# పంచాయతీల్లో యూపీఐ సేవలు

- ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్న కేంద్రం
- నెలాఖరులోగా అన్ని గ్రామాలకు విస్తరించేందుకు చర్యలు
- నిధుల వ్యయంపై నిఘా
- జిల్లాలో 313 గ్రామాలు



కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

కరీంనగర్: గ్రామ పంచాయతీల్లో మరింత పారదర్శకతకు ప్రభుత్వాలు శ్రీకారం చుడుతున్నాయి. ఆదాయ, వ్యయాలపై నిఘా పెడుతూనే ప్రతి పైసా ప్రజాప్రయోజనాలకు ఖర్చు చేసేలా నిబంధనలు కఠినతరం చేస్తున్నాయి. పన్నులు వసూలవుతున్నాయా? వసూలైనవి ఏమవుతున్నాయో లెక్కలు చెప్పడం కష్టమే. ఈ నేపథ్యంలో పంచాయతీల బలోపేతానికి, డిజిటల్ పరంగా మరింత ముందుకు నడిపించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాయి. సాంకేతికత పరుగులు పెడుతున్న ఈ రోజుల్లో మార్కెట్‌లో కూరగాయలు మొదలుకొని హోటల్ చెల్లింపులు, ఇతర వస్తువులు కొనుగోలు సైతం స్మార్ట్‌ఫోన్ ద్వారా యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్) సేవలను వినియోగిస్తున్నారు. దీంతో పంచాయతీల్లో సైతం యూపీఐ సేవలు అందించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నెలాఖరులోపు అన్ని గ్రామాలను యూపీఐ సేవల వినియోగ పంచాయతీలుగా ప్రకటించడానికి సిద్ధమవుతోంది.

**మారుమూల పల్లెల్లో సైతం..**

గత మూడేళ్లలో మారుమూల పల్లెల్లో సైతం యూపీఐ సేవలు విస్తరించాయి. డిజిటల్ సేవలకు అలవాటు పడిన చిన్న దుకాణాలు మొదలుకొని అందరూ దీన్నే వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలను నగదు రహిత చెల్లింపుల వైపు ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రతీ పంచాయతీలో యూపీఐ అమలుకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే దీనిపై పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఐ సేవలను వినియోగించేలా పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నారు.

**పారదర్శకత.. అక్రమాలకు అడ్డుకట్ట**

కరీంనగర్ జిల్లాలో 313 గ్రామాలున్నాయి. మేజర్ పంచాయతీల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లింపు, కొన్ని పత్రాల జారీకి ఆన్‌లైన్ పేమెంట్స్ వినియోగంలో ఉన్నాయి. చాలా పంచాయతీల్లో పన్నుల వసూలు ఇప్పటికీ నగదు రూపంలోనే చేస్తున్నారు. దీంతో ఆ డబ్బును వివిధ అభివృద్ధి పనులు లేదా ఇతర ఖర్చుల పేరుతో పద్దులు రాసి, పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల ఇకముందు పన్నుల వసూలు, పత్రాల జారీకి పంచాయతీల్లో యూపీఐ ద్వారా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఫలితంగా పంచాయతీ వ్యవస్థ పూర్తి పారదర్శకంగా మారి, అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

**అవినీతికి ఆస్కారం ఉండదు**



యూపీఐ సేవలతో పంచాయతీల్లో ఆదాయ, వ్యయాల్లో పారదర్శకత వస్తుంది. అవినీతికి ఆస్కారం ఉండదు. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రారంభించాం. సాంకేతిక సమస్యలున్న పల్లెల్లో ఈ నెలాఖరులోగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– వీరబుచ్చయ్య, డీపీవో

# భూమి తమదేనంటూ బెదిరింపులు

- ప్రహరీ నిర్మాణం అడ్డగింత.. యజమానిపై దాడి
- అడ్డుకున్న స్థానికులు.. తాడుతో చెట్టుకు కట్టేసి పోలీసులకు అప్పగింత
- మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామంలో ఘటన



ముగ్గురిని తాడుతో చెట్టుకు కట్టేసిన స్థానికులు

మానకొండూర్: తమకు సంబంధం లేని భూమిలోకి చొరబడి సదరు భూమి తమదేనంటూ ముగ్గురు వ్యక్తులు సీడ్ ప్లాంటు యజమానిని బెదిరించారు. అతడిపై దాడికి దిగారు. స్థానికులు అడ్డుకుని ఆ ముగ్గురిని చెట్టుకు కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించగా కేసు నమోదైన ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్లలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. కరీంనగర్‌కు చెందిన గురిజాల జయరామయ్య మూడేళ్లక్రితం మానకొండూర్ మండలం చెంజర్ల శివారులో సర్వే నంబర్ 156లో 1.08 ఎకరాల భూమిని కరీంనగర్‌కు చెందిన బొమ్మవరం కిషన్‌రావు వద్ద కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమిలో సంఘమిత్ర సీడ్స్, కార్పొరేషన్ పేరిట గోదాం నిర్మించాడు. బుధవారం సీడ్ కంపెనీ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా తిమ్మాపూర్ మండలం రేణికుంటకు చెందిన రాజుగౌడ్, కరుణాకర్, దివాకర్ అక్కడికి చేరుకున్నారు. ఆ భూమి తమదేనంటూ గోడ కట్టకుండా అడ్డుకున్నారు. చంపుతామని యజమానిపై దాడిచేశారు. చొక్కా చింపేసి, చంపుతామని బెదిరించారు. అక్కడే ఉన్న కొందరు స్థానికులు ఆ ముగ్గురిని చెట్టుకు బంధించారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. సీడ్ ప్లాంటు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

**సీడ్ యజమానిపై కేసు**

చెంజర్ల శివారులోని తమ భూమి వద్దకు వెళ్లగా.. సంఘమిత్ర సీడ్ యజమాని బంధించాడని తిమ్మాపూర్ మండలంలోని రేణికుంటకు చెందిన దివాకర్, రాజుగౌడ్, కరుణాకర్ ఫిర్యాదు మేరకు సంఘమిత్ర యజమాని జయరామయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# జీపీ కార్మికులకు రూ.5 లక్షల బీమా

- అంత్యక్రియలకు రూ.10 వేలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 1,877 మంది కార్మికులు



పని చేస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

కరీంనగర్‌రూరల్: గ్రామ పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ కార్మికులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. డిమాండ్లు నెరవేర్చుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 34 రోజులు వారు చేపట్టిన సమ్మెకు స్పందించింది. కార్మికులు చనిపోతే తక్షణ సహాయం కింద రూ.10 వేల చెల్లింపు, ఒక్కొక్కరికి రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తూ ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో కరీంనగర్ జిల్లాలోని 313 గ్రామ పంచాయతీల్లో 1,877 మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది.

**వేతనం రూ.9,500..**

ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించిన తర్వాత ప్రతి పంచాయతీకి ట్రాక్టర్ అందించింది. జనాభా ప్రాతిపదికన మల్టీపర్పస్ కార్మికులను నియమించుకునే అవకాశాన్ని పంచాయతీలకు కల్పించింది. ఒక్కో కార్మికుడికి రూ.8,500 వేతనం చెల్లించగా మే డే కానుకగా మరో రూ.1,000 పెంచింది. అయితే వేతనం తప్ప ఇతర సౌకర్యాలు లేకపోవడంతో ఆందోళన చెందిన కార్మికులు నెల రోజులకు పైగా సమ్మె చేశారు. దీంతో సర్కారు ప్రతి కార్మికుడికి ఉచితంగా బీమా చేయాలని నిర్ణయించింది.

**పంచాయతీ నిధుల నుంచే ప్రీమియం**

రైతుబీమా తరహాలోనే పంచాయతీ కార్మికులకు రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్మికుడు మరణిస్తే నామినీకి లేదా కుటుంబానికి బీమా సొమ్ము అందనుంది. ప్రీమియం డబ్బులను పంచాయతీ నిధుల నుంచే చెల్లించాలని సర్కారు ఆదేశించింది. గతంలో పంచాయతీ కార్మికుడు మృతిచెందితే అంత్యక్రియల కోసం రూ.5 వేలు చెల్లించగా ప్రస్తుతం రూ.10 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

**కార్మికులకు ప్రయోజనం**

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్మికులందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

– వీరబుచ్చయ్య, డీపీవో

### పశుమిత్రల ధర్నా



కరీంనగర్: పశుమిత్రలకు కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. తెలంగాణ పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాడి లలిత, పెండేలా ప్రభలు మాట్లాడుతూ.. పశుమిత్రల వెట్టిచాకిరీ రద్దు చేసి, కనీస వేతనం జీవో 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నిర్ణయం చేయాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్, గ్లౌజులు, మెడికల్ కిట్లు, ప్రయాణ ఖర్చులు, కృత్రిమ గర్భధారణ శిక్షణ ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి ఎలక్ట్రిక్ బైకులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమా అనూష, మనీషా, స్వర్ణలత, భవానీ, వనజ, స్వప్న, అంజలి, లక్ష్మి, కల్పన, సరోజన, మమత, జక్కి అనూష పాల్గొన్నారు.

### 'గాంధీ'ని వీక్షించిన 2,884 మంది విద్యార్థులు



కరీంనగర్‌కల్చరల్: జిల్లాలోని ఆరు సినిమా థియేటర్లలో గాంధీ చలనచిత్రాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ప్రదర్శించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని వెంకటేశ్వర, శ్రీనివాస, మమత, హుజూరాబాద్‌లో నటరాజ్, జమ్మికుంటలోని అన్నపూర్ణ, మురళి థియేటర్లలో గాంధీ చిత్రాన్ని ప్రదర్శించగా 2,884మంది విద్యార్థులు వీక్షించినట్లు తెలిపారు.

### రేపు క్రీడాకారుల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: 14, 16, 18, 20 సంవత్సరాల బాలబాలికలకు, పురుషులు, మహిళలకు హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్‌లో ఈ నెల 20న రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఈ నెల 18న ఎంపిక పోటీలు నిర్వహించి, జిల్లా నుంచి పది మంది క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

### అల్ఫోర్స్ పాఠశాలలో క్రికెట్ పోటీలు



కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో బుధవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విభాగంలో తేజస్ హౌస్ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి త్వరలో జరగబోయే ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని చైర్మన్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్లు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 29 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 29వ తేదీ నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ పరీక్షలు ఈ నెల 29, 31, వచ్చే నెల 2, 5, 8, 11వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు తమకు కేటాయించిన సెంటర్లకు పరీక్షా సమయానికి ముందే హాజరుకావాలని సూచించారు.

# రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో సత్తా చాటాలి

- జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి
- జిల్లాస్థాయి పోటీలకు స్పందన



జిల్లా జట్టుతో జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ సత్తా చాటి, చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అన్నారు. కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో జూడో సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో, మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి జూనియర్స్ జూడో పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో జూడో క్రీడకు విశేష ఆదరణ ఉందన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ పురుషుల, మహిళల పోటీలు జరగనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 380 మంది క్రీడాకారులు 50 మంది కోచ్‌లు, మేనేజర్లు, రెఫరీలు హాజరు కానున్నట్లు తెలిపారు. క్రీడాకారులందరికీ ఉచిత భోజనం, వసతి సౌకర్యాలను మానేరు విద్యాసంస్థలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బంగారు పతకం సాధించిన క్రీడాకారులను ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నామని అన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్ రెడ్డి, జూడో సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, సంయుక్త కార్యదర్శి ఎల్వీ రమణ, బాధ్యులు సత్యనారాయణ, గోలి సుధాకర్, నేదునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోబోటిక్ సర్జరీతో మోకీలు మార్పిడి

- ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సునీల్



పేషెంట్‌తో కలిసి మాట్లాడుతున్న డాక్టర్ సునీల్

కరీంనగర్‌టౌన్: ఏ వయసు వారికైనా రోబోటిక్ సర్జరీతో మోకీలు, తుంటి మార్పిడి చేయవచ్చని యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ జాయింట్ రీప్లేస్మెంట్, ఆర్థోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన ఆకుల రాజేశ్వరి మోకాళ్ల నొప్పులతో బాధ పడుతూ నడవలేక, తన పనులు తాను చేసుకోలేక ఇబ్బందులు పడుతుండగా ఆమె కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌కు తీసుకువచ్చారని అన్నారు. 71 సంవత్సరాలు ఉన్న ఆమెకు రోబోటిక్ సర్జరీతో మోకీలు మార్పిడి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం రాజేశ్వరి మామూలుగా నడవగలుగుతోందని పేర్కొన్నారు. ఎలాంటి కత్తిగాట్లు లేకుండా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో రోబోటిక్ సర్జరీ ద్వారా సక్సెస్ రేటు బాగుందని తెలిపారు. విదేశాల్లో సుమారు రూ.10 లక్షల వరకు అయ్యే ఈ ఆపరేషన్ యశోదలో అందులో నాలుగో వంతు ఖర్చుతో చేస్తున్నట్లు చెప్పారు. వైద్య రంగంలో మన దేశం అమెరికా, ఇతర దేశాలతో సమానంగా ఉందన్నారు. అయితే అన్ని మోకాలు నొప్పులకు ఆపరేషన్ చేయాల్సిన అవసరం లేదన్నారు. మందులు, ఇంజెక్షన్లతో కూడా నయమవుతాయని పేర్కొన్నారు.

# కిరోసిన్ పోసుకొని మహిళ ఆత్మహత్యాయత్నం

- తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న రమాదేవి

జమ్మికుంట: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరి రమాదేవి తన భర్త రామ్మూర్తితో కలిసి తల్లి సుగుణ ఇంట్లో ఉంటోంది. భర్తతో గొడవలు జరగడంతో అతను ఆరు నెలల క్రితం హైదరాబాద్ వెళ్లిపోయాడు. దీంతో రమాదేవి మానసికంగా కుంగిపోయి, అనారోగ్యానికి గురైంది. ఆమె తల్లి నెల రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న రమాదేవి బుధవారం సాయంత్రం ఒంటిపై కిరోసిన్ పోసుకొని, నిప్పంటించుకుంది. ఆమె అరుపులకు కాలనీవాసులు అక్కడికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని కౌన్సిలర్ శ్రీపతి నరేష్, స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. ఆమె చికిత్స పొందుతోందని పేర్కొన్నారు.

# 'శ్రీ చైతన్య'లో అలరించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్: విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకుంటే భవిష్యత్తు బాగుంటుందని శ్రీ చైతన్య కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్ రెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. చైర్మన్ జ్యోతిప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. అకాడమిక్స్‌లో చురుకుదనంతోపాటు సాంకేతిక నైపుణ్యం, వ్యక్తిగత విలక్షణాలను పెంపొందించుకుంటూ ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యేలా విద్యార్థులు సాధన చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాళ్లు ప్రసాద్ రాజ్, వెంకటేశ్వర్లు, ఈసీఈ, మెకానికల్ విభాగాధిపతులు ఎస్.నరేశ్‌కుమార్, రవీందర్, అకాడమిక్ ఇన్‌చార్జి శశికాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# 'మోడల్' హాస్టల్ సిబ్బంది ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

కరీంనగర్: జీవో 60 ప్రకారం వేతనాలు పెంచాలని మోడల్ స్కూళ్ల హాస్టల్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. మోడల్ స్కూల్ హాస్టల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. హాస్టల్ సిబ్బంది అతి తక్కువ వేతనాలతో పదేళ్లుగా పని చేస్తున్నారని, వీరిని 2018లో సర్వశిక్ష అభియాన్‌లో విలీనం చేశారన్నారు. వీరికి వేతనాలు పెంచి, నిర్దిష్ట డ్యూటీ చార్ట్ అమలు చేయాలని, అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. మోడల్ స్కూల్ తరహాలో జీవో 60 ప్రకారం కేర్ టేకర్‌కు రూ.22,750, ఏఎన్ఎంకు రూ.19,500, వాచ్‌మెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్లకు రూ.15,600 చెల్లించాలన్నారు. స్కూళ్లు, హాస్టళ్లలో స్వీపర్లు, డే వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు లావణ్య, కృష్ణవేణి, జయశ్రీ, రజిత, సునీత, విమల, ఇందిర, శారద, మంగ, సరోజన, లక్ష్మి పాల్గొన్నారు.

## మద్యం మత్తులో నడిపిండు..
# రైతును బలితీసుకుండు

- ట్రాక్టర్ కిందపడి అంబారిపేటవాసి దుర్మరణం
- పలుమార్లు పైనుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన మృతదేహం



పోచయ్య (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): మద్యం తాగి వాహనాలు నడపరాదని పోలీసులు ఎంత అవగాహన కల్పించినా కొందరు వినడం లేదు. మద్యం మత్తులో ట్రాక్టర్ నడిపిన వ్యక్తి ఓ రైతును బలితీసుకున్నాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబారిపేటకు చెందిన ముడిమడుగుల పోచయ్య(50) తన వ్యవసాయ పొలం దున్నడానికి మంగళవారం అదే గ్రామానికి చెందిన జాడి బానయ్యను పిలిచాడు. అతను అతిగా మద్యం తాగి, ఆ మత్తులో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్నాడు. వెనక ఉన్న పోచయ్యను గమనించకుండా వేగంగా నడపడంతో ట్రాక్టర్ అతన్ని తొక్కుకుంటూ వెళ్లింది. ఈ సంఘటనలో పోచయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్న బానయ్య పలుమార్లు ట్రాక్టర్‌ను మృతదేహం పైనుంచి తిప్పడంతో నుజ్జునుజ్జయి, తల, మొండెం, కాళ్లు, చేతులు వేటికవే పూర్తిగా తెగిపోయాయి. పొలం దున్నడం పూర్తయిన తర్వాత పోచయ్య కనిపించడం లేదని అతని కుమారుడు సతీశ్‌కు చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు గ్రామంలో వెతకగా ఆచూకీ లభించలేదు. రాత్రి సమయంలో పొలంలో వెతకగా రక్తం, పోచయ్య శరీర భాగాలు కొద్దిగా కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు బుధవారం పొలంలో పూర్తిగా తెగిపడిన మృతుడి శరీర భాగాలను బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. పోచయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మద్యం తాగి, ట్రాక్టర్ నడిపి, పోచయ్య మృతికి కారణమైన బానయ్యపై కఠినచర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబసభ్యులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### వాజ్‌పేయికి నివాళి



నివాళి అర్పిస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్‌: మాజీ ప్రధాని, బీజేపీ దిగ్గజ నేత దివంగత అటల్‌ బిహారి వాజపేయి 5వ వర్ధంతిని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రేకుర్తిలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వ పూర్ణ చందర్‌రెడ్డి, 39వ బూత్‌ అధ్యక్షుడు దుర్గం ఆంజనేయులు, బీజేపీ సీనియర్‌ నాయకులు వొల్లాజీ వెంకటస్వామి, ఎండీ మజీద్‌ తదితరులు పాల్గొన్నారు.

### నియామకం



రాజ్‌కుమార్‌

కరీంనగర్‌: తెలంగాణ బీసీ జనసేన రజక కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా మావురపు రాజ్‌కుమార్‌ను నియమిస్తూ బీసీ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు ఆంజనేయులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ చట్ట సభలో బీసీల రిజర్వేషన్లు సాధనకై, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ సాధనకు, బీసీ కులాల వారీగా జనాభా గణణ చేపట్టాలని జరిగే ఉద్యమంలో భాగస్వాములవుతామని తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన బీసీ జనసేన రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు ఆంజనేయులు, తదితరులకు రాజ్‌కుమార్‌ కృతజ్ఞతలు తెలిపారు.

### 'గుడి నిర్మించడం సమంజసం కాదు'

విద్యానగర్‌(కరీంనగర్‌): నగరంలోని భాగ్యరెడ్డి వర్మ విగ్రహం వెనుక గతంలో సులభ్‌ కాంప్లెక్స్‌ నిర్మించారని, ఇప్పుడు పక్కనే చిన్నగుడి నిర్మించడం సమంజసం కాదని తెలుగుదేశం ఎస్సీ సెల్‌ కరీంనగర్‌ పార్లమెంట్‌ అధ్యక్షుడు బొల్లమల్ల సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భాగ్యరెడ్డి వర్మ సంఘ సంస్కర్త, గొప్ప మానవతావాది, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని, ఆయనకు తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిఆపరు. విగ్రహం వెనుక ఉన్న సులభ్‌ కాంప్లెక్స్‌ను తొలగించి విగ్రహం చుట్టూ గ్రిల్లింగ్‌ ఏర్పాటు చేసి సుందరమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

### నేడు 'గద్దర్‌ యాది' సంస్మరణ సభ

కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని ఫిలింభవన్‌లో గురువారం సాయంత్రం 6గంటలకు 'గద్దర్‌ యాది' పేరుతో సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు కవి అన్నవరం దేవేందర్‌, కఫిసా అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కఫిసా, తెరవే, సాహితీ గౌతమి, పద్యకవితా సదస్సు, తెలంగాణసాహితీ, తెలుగు రక్షణ వేదిక, తెలంగాణ కళావేదిక, ఉదయసాహితీ, భవానీ సాహిత్యవేదిక, తెలుగుభాషా సంరక్షణ సంఘం, సమతాసాహితీ, శరత్‌ సాహితీకళాస్రవంతి, రుద్రమ సాహితీస్రవంతి, ఎన్నీల ముచ్చట్లు గుంపు, బతుకమ్మ మ్యూజిక్‌ ఛానల్‌ సంస్థల సంయుక్త అధ్వర్యంలో సభ జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా సంస్థల బాధ్యులు కవులు, రచయితల, కళాకారులు, గద్దర్‌ అభిమానులు పాల్గొనాలని కోరారు.

# మహాత్ముడు.. మహనీయుడు

- బాపూజీ బాటలో పయనిస్తాం
- ఆయన జీవితం ఆదర్శనీయం
- జీవిత చరిత్ర తెలుసుకోవడం గొప్ప అనుభూతి
- 'గాంధీ' చిత్రం చూసిన చిన్నారుల మనోగతం



మమతా థియేటర్‌లో గాంధీ చిత్రం వీక్షించేందుకు వచ్చిన విద్యార్థులు

కరీంనగర్‌కల్చరల్‌: భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో భాగంగా సినిమా థియేటర్లలో పాఠశాల విద్యార్థులకు కోసం గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. మహాత్మాగాంధీ జీవిత చరిత్ర, స్వాతంత్య్రోదమ సంఘటనలు, నాయకులు, చరిత్రపై నేటి విద్యార్థులకు అవగాహన, వారిలో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు నగరంలోని పలు థియేటర్‌లలో చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని పలు థియేటర్లలో పాఠశాల విద్యార్థులు గాంధీజీ చిత్రం వీక్షించారు. చిత్రం చూసిన పలువురు విద్యార్థులను 'సాక్షి' పలకరించగా.. తమ అభిప్రాయలను వెల్లడించారు.



శ్రీనివాస థియేటర్‌లో సినిమా వీక్షిస్తున్న విద్యార్థులు

### చరిత్ర తెలుసుకున్నాం



ఈరోజు గాంధీ చిత్రం చూశా.ఈ చిత్రం ద్వారా గత మన చరిత్రను తెలుసుకున్నాం. స్వాతంత్య్ర ఉద్యమం, నాయకులు, చరిత్రపై అవగాహన పెరిగింది. మహాత్మా గాంధీ గొప్పతనం తెలిసింది.

– బి.భవిత, 7వ తరగతి, శ్రీచైతన్య స్కూల్‌, కరీంనగర్‌

### వారి త్యాగం మరువలేనిది



ఈ రోజు థియేటర్‌లో గాంధీ చిత్రం చూశా. నాటి స్వాతంత్య్రోద్యమంలో మన నాయకులు పడిన కష్టాలు, వారి త్యాగాల ఫలితమే నేటి మన స్వేచ్ఛకు కారణం. మహనీయుల త్యాగం మరువలేనది.

– సీహెచ్‌.అభిలాష్‌, 8వ తరగతి, సిద్ధార్థ హైస్కూల్‌, కరీంనగర్‌

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు



గాంధీ చిత్రం ద్వారా నాటి స్వాతంత్య్రోద్యమం, చరిత్ర తెలుసుకునే గొప్ప అవకాశం మాకు లభించింది. దేశభక్తి స్ఫూర్తి రగిలించింది ఈ చిత్రం. ఇలాంటి సినిమాను ఉచితంగా చూసే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఎస్‌.లహరి, 5వ తరగతి, సిద్ధార్థ హైస్కూల్‌, కరీంనగర్‌

### గొప్ప అనుభూతి



గాంధీజీ, స్వాతంత్య్ర ఉద్యమం గురించి ఇప్పటి వరకు పుస్తకాల్లో చదివాం. గాంధీ చిత్రం చూడటం వల్ల నాటి పరిస్థితులు, స్వాతంత్య్రోద్యమం కళ్లను కట్టినట్లు కనిపించింది. ఇలా దృశ్య రూపంలో చరిత్రను తెలుసుకోవడం గొప్ప అనుభూతి. దేశభక్తి పెరిగింది.

– బి.గౌతమి, 9వ తరగతి, శ్రీచైతన్య స్కూల్‌, కరీంనగర్‌

## చిత్ర కథ: కలెక్టరేట్‌లో వానరాల బెడద





కలెక్టరేట్‌లో వానరాల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. కలెక్టరేట్‌ సముదాయంలో సుమారు 30కి పైగా శాఖలుండగా విధులు నిర్వహించాలంటే కత్తిమీద సాములా మారింది. రోజూ మధ్యాహ్నం వేళలో కుప్పలు తెప్పలుగా కోతులు కార్యాలయాలకు చేరుతుండగా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. భోజన విరామ సమయంలో ఇంటికి వెళ్లాలంటే భయం భయంగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. ఇటీవల పౌరసంబంధాల శాఖలో చేరి వానరాలు బీభత్సం సృష్టించగా తలుపులు మూసుకునే పరిస్థితి ఏర్పడింది. కోతుల నియంత్రణకు పక్కా చర్యలు చేపట్టాలని కలెక్టరేట్‌ ఉద్యోగులు కోరుతున్నారు. – కరీంనగర్‌ అర్బన్‌

# 'గృహలక్ష్మి' దరఖాస్తులపై విచారణ



చామనపల్లిలో సర్వే చేస్తున్న ఎంపీడీవో జగన్మోహన్‌

కరీంనగర్‌రూరల్‌: సొంతస్థలం ఉన్న పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి కరీంనగర్‌ మండలంలో మొత్తం 1,020 దరఖాస్తులు వచ్చాయి. సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో పలువురు పేదలు చేసుకున్న దరఖాస్తులపై బుధవారం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. తహసీల్దార్‌, ఎంపీడీవో, ఏవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు బృందాలు తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి చామనపల్లి, దుబ్బపల్లి, నగునూరు, నాయబ్‌ తహసీల్దార్‌ శంకర్‌ బొమ్మకల్‌, మొగ్దుంపూర్‌ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల సాయంతో దరఖాస్తుల ఆధారంగా మోఖాపై వెళ్లి వివరాలు పరిశీలించారు. ఈనెల 20వరకు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

# హరితనగరంగా మార్చడమే లక్ష్యం



భగత్‌నగర్‌లో మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్‌ సునీల్‌రావు

కరీంనగర్‌ కార్పొరేషన్‌: కరీంనగర్‌ను హరితనగరంగా మార్చడమే లక్ష్యంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు మేయర్‌ సునీల్‌రావు తెలిపారు. బుధవారం నగరంలోని 12వ డివిజన్‌ భగత్‌నగర్‌ వెంకటేశ్వరకాలనీలో పూలు, పండ్ల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయడంతో పాటు, పలు నివాసగృహాల్లో ఇంటి యజమానులతో కలిసి స్వయంగా మొక్కలు నాటారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న నగరాన్ని గ్రీన్‌ అండ్‌ క్లీన్‌ సిటీగా మార్చేందుకు ప్రజలు సహకరించాలని అన్నారు. పదిరోజుల పాటు డివిజన్‌ల వారీగా మొక్కలు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రజలు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. నగరపాలకసంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న 11 నర్సరీల్లో హరితహారం కోసం 6 లక్షల మొక్కలు పెంచడం జరిగిందన్నారు. 60 డివిజన్‌లలో 3.24 లక్షల పండ్లు, పూలతో పాటు వివిధ రకాల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌ చల్ల స్వరూపరాణి హరిశంకర్‌, కమిషనర్‌ సేవా ఇస్లావత్‌, కార్పొరేటర్లు తోట రాములు, నాంపల్లి శ్రీనివాస్‌, ఎస్‌ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ కిష్టప్ప, డీఈ ఓం ప్రకాష్‌, హరితహారం ఇన్‌చార్జి నరేందర్‌రావు, ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

### సదరం స్లాట్‌ ఇక్కట్లు తొలగించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌టౌన్‌: వికలాంగుల సర్టిఫికెట్లు అందించేందుకు ఏర్పాటు చేసిన సదరం శిబిరం స్లాట్లు కొద్ది నెలలుగా దొరకడం లేదని, కొంత మంది బ్లాక్‌ చేసి అసలైన లబ్ధిదారులకు అందకుండా చేస్తున్నారని యూత్‌ కాంగ్రెస్‌ నాయకులు బుధవారం కలెక్టర్‌ డాక్టర్‌ గోపికకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. మూగ, చెవిటితో ఇబ్బంది పడుతున్న ఎండీ అయాన్‌ అనే నిరుపేద బాలుడు 10 నెలలుగా స్లాటు బుకింగ్‌ దొరకక ప్రతినెలా మీసేవ నుంచి నిరాశతో తిరిగి వస్తున్నాడని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్‌ రహమాన్‌ పాల్గొన్నారు.

**ఫ్లాష్‌.. ఫ్లాష్‌..**

### మద్యం మత్తులో వ్యక్తి దారుణ హత్య

కరీంనగర్‌ క్రైమ్‌: కరీంనగర్‌ పట్టణంలోని రాంనగర్‌లో ఒక మద్యం దుకాణం సమీపంలో కొంతమంది వ్యక్తులు మద్యం మత్తులో విచక్షణ రహితంగా దాడి చేయడంతో పవన్‌(38) అనే యువకుడు గాయాలపాలై మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలగందల్‌ గ్రామానికి చెందిన పవన్‌ అనే వ్యక్తి ఫిష్‌ మార్కెట్‌ వద్ద నివాసం ఉంటున్నాడు. వెల్డింగ్‌ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. బుధవారం రాత్రి రాంనగర్‌లోని ఒక వైన్స్‌ సమీపంలో ఉండగా, కొంతమంది వ్యక్తులు అకస్మాత్తుగా వచ్చి మద్యం మత్తులో విచక్షణ రహితంగా దాడి చేయడంతో తీవ్రగాయాలు కాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పవన్‌ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వైన్స్‌ దుకాణం పరిధిలోని సీసీకెమెరాల ఫుటేజీలు పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నట్లు టూటౌన్‌ పోలీసులు తెలిపారు.

# మంచినీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు



పైప్‌లైన్‌ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ ప్రజలకు మంచినీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన పైప్‌లైన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఫిల్టర్‌ బెడ్‌ నుంచి ట్యాంకులకు వచ్చే పైప్‌లైన్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, వాటి మరమ్మతులు పూర్తయ్యే వరకు తాత్కాలికంగా చీకటి గుడి వద్దనున్న పైపులైన్‌ నుంచి మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. పైప్‌లైన్‌ మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

# కొత్తపల్లి ప్రెస్‌క్లబ్‌ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌

కరీంనగర్‌: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్‌ జర్నలిస్టుల సంఘం అనుబంధ కొత్తపల్లి మండల ప్రెస్‌క్లబ్‌ కార్యవర్గ ఎన్నికలు బుధవారం రామాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. టీయూడబ్ల్యూజే కరీంనగర్‌ జిల్లా అధ్యక్షుడు తాడూరు కరుణాకర్‌, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్‌, కోశాధికారి సందీప్‌ కుమార్‌ల సమక్షంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా కొత్త సత్యనారాయణ (సాక్షి), కార్యదర్శిగా తోడేటి తిరుపతి (ప్రజాపక్షం), ఉపాధ్యక్షుడిగా బొల్లి గోవర్ధన్‌ (మన తెలంగాణ), సహాయ కార్యదర్శిగా ఇట్టినేని శ్రీనివాస్‌ (సూర్య), కోశాధికారిగా సిర్ర తిరుపతి (నమస్తే తెలంగాణ), ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా నాంతబాద్‌ శ్రీనివాస్‌ (ఆంధ్రప్రభ), కార్యవర్గ సభ్యులుగా సింహాచలం రవి (ఆంధ్రజ్యోతి), పడకంటి శ్రీనివాస్‌ (నవతెలంగాణ), బొలబత్తిని శ్రీనివాస్‌ (వెలుగు), బూతగడ్డ తిరుపతి (జనంసాక్షి)లు ఎన్నికయ్యారు.

# ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేయాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

కరీంనగర్‌టౌన్‌: పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నేషనల్‌ అర్బన్‌ హెల్త్‌ మిషన్‌ (ఎన్‌యూహెచ్‌ఎం) పథకం కింద పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్‌ చేయాలని కోరుతూ అన్ని కేడర్ల ఉద్యోగులు బుధవారం జిల్లా వైద్యాధికారికి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కరుణ, సరిత, పుష్ప, మంగ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలి





మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవారెడ్డి

కరీంనగర్‌: రాష్ట్రంలోని కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్‌ చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్‌ ఎదుట కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చి సేవలు చేసిన ఏఎన్‌ఎంలపై నిర్లక్ష్యం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్‌ చేయకుండా 1,520 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ జారీచేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే కొత్తగా ఇచ్చిన నోటిఫికేషన్‌ రద్దుచేసి కాంట్రాక్టు ఏఎన్‌ఎంలను రెగ్యులర్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. సాక్షాత్తు సీఎం కేసీఆర్‌ తెలంగాణ వస్తే కాంట్రాక్టు, అవుట్‌ సోర్సింగ్‌, డైలీ వైజ్‌ ఉద్యోగాలు ఉండవని స్పష్టంగా ప్రకటించారని ఆ హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. నీటమునిగిన పొలాలు



ఇరుకుల్లలో ఎస్సారెస్పీ కాలువలో చెత్తాచెదారం



నీటమునిగిన పొలాలు

- ఎస్సారెస్పీ కాలువ పైపులకు అడ్డుగా చెత్తాచెదారం
- చెత్తను తొలగించడంలో సిబ్బంది జాప్యం

కరీంనగర్‌రూరల్‌: అధికారుల నిర్లక్ష్యంతో పంట పొలాలు నీటమునిగాయి. ఎస్సారెస్పీ కాలువ పైపులకు అడ్డుగా చెత్త చేరడంతో కిందకు పోవాల్సిన నీరు సమీపంలోని పొలాల్లో చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ చెత్తను తొలగించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు..

- ఎస్సారెస్పీ డీ89 ప్రధాన కాలువ ద్వారా నగునూరు, ఇరుకుల్ల, మొగ్దుంపూర్‌ తదితర గ్రామాలకు వారం రోజుల నుంచి సాగునీరు సరఫరా అవుతున్నాయి. బుధవారం ఇరుకుల్ల చౌరస్తాలోని కాలువ వంతెన పైపులకు అడ్డుగా చెత్త చేరడంతో నీళ్లన్నీ నిండిపోయి సమీపంలోని పొలాల్లోకి పోతున్నాయి. పొలాలు నీట మునిగిపోవడంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పైపులకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించేందుకు చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు.
- ఇరుకుల్ల–చామనపల్లి బీటీరోడ్డు నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టరు కాలువపై ఉన్న వంతెనను విస్తరించారు. కొత్తపైపులను వేయాల్సి ఉండగా కాంట్రాక్టరు పాతపైపులకు కొత్తపైపులను లింక్‌ చేశారు. పైపుల నుంచి నీరు ఎక్కువ పరిమాణంలో వెళ్లపోవడంతో నీళ్లన్నీ నిలిచిపోతున్నాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం పైపుల్లో చెత్తాచెదారం నిండటంతో కిందకు నీరు తక్కువగా పోవడంతో ఆయకట్టు చివరి గ్రామాలైన చెర్లభూత్కూర్‌, మొగ్దుంపూర్‌లకు నీళ్లందని పరిస్థితి నెలకొంది. 15రోజుల నుంచి వర్షాలు కురువక ఆందోళన చెందుతున్న రైతాంగానికి కాలువ నీరు సైతం రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా ఎస్సారెస్పీ అధికారులు స్పందించి ఆయకట్టు చివరిప్రాంతాలకు కాలువ నీటి సరఫరా సక్రమంగా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### చెత్త తొలగించేందుకు చర్యలు

ఇరుకుల్ల వద్ద పైపులకు అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని రెండురోజుల్లో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. పైపుల్లో చెత్తచెదారం నిండటంతో నీరు కిందకు పోవడం లేదు. వారబందీ విధానంలో కాలువ నీటి సరఫరా జరుగుతోంది. గురువారంతో వారబందీ ముగిసిన అనంతరం పైపులను పరిశీలించి తగిన చర్యలు చేపడుతాం.

– మౌనిక, ఏఈ, ఇరిగేషన్‌

# కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు





దీక్షల్లో పాల్గొన్న స్వీపర్లు

కరీంనగర్‌: రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లలో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ కలెక్టరేట్‌ ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారానికి 36వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా తెలంగాణ పశుమిత్ర వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజమల్లు, రమేశ్‌ మాట్లాడుతూ గత 40ఏళ్లుగా రూ.150కి పనిచేసిన వీరికి ప్రస్తుతం రూ.5200 గౌరవ వేతనం లభిస్తుందని, ప్రభుత్వాలు రెగ్యులర్‌ చేస్తామని మోసం చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమన వేతనం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. నాయకులు రమేశ్‌, అలీం,శంకరయ్య, మొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

### నేడు కెమెరా ఆర్ట్స్‌ క్లబ్‌ సిల్వర్‌ జూబ్లీ వేడుకలు

కరీంనగర్‌ కల్చరల్‌: కరీంనగర్‌ కెమెరా ఆర్ట్స్‌ క్లబ్‌ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సాయంత్రం నగరంలోని మంకమ్మతోట బాలాజీ ఫంక్షన్‌ హాల్‌లో సిల్వర్‌ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు కౌశిక్‌కుమార్‌, గణేశ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం జరిగే వేడుకలకు మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు కలెక్టర్‌ బి.గోపి, మేయర్‌ వై.సునీల్‌రావు తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కరీంనగర్‌ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్‌ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

రమేష్‌, ACO - 7997958214
కరీంనగర్‌ : రాజశేఖర్‌ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్‌ : మహేశ్‌ - 9573106760
హుజూరాబాద్‌ : ప్రశాంత్‌ - 7331119941
టోల్‌ ఫ్రీ నం.: 1800 425 9899

# ఆర్టీసీలో మరోసారి 'కారుణ్యం'

- 1,538 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి
- మూడు దశల్లో నియామకాలు

**సాక్షి, అమరావతి:** ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంపై చిత్తశుద్ధిని చాటుకుంటూ మరోసారి కారుణ్య నియామకాలకు ఏపీ ప్రభుత్వం అనుమతించింది. సర్వీసులో ఉండగా మరణించిన ఆర్టీసీ సిబ్బంది కుటుంబాలకు ఊరట కల్పిస్తూ అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించనున్నారు. 2016 నుంచి 2020 జనవరి వరకు మృతి చెందిన 311 మంది ఆర్టీసీ సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ ఇప్పటికే అనుమతించారు. ఆ ఉద్యోగాలను భర్తీ చేసిన ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం వారికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తాజాగా 2020 జనవరి 1 నుంచి ఇప్పటివరకు మరణించిన ఆర్టీసీ సిబ్బంది వారసులకు కూడా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయించారు. ఈమేరకు రెండో విడత కారుణ్య నియామకాలకు ఆర్టీసీ కార్యాచరణ చేపట్టింది.

**మూడు దశల్లో..**

2020 జనవరి 1 నుంచి 2023 ఆగస్టు 15 వరకు 1,538 మంది ఆర్టీసీ ఉద్యోగులు చనిపోయారు. ఆయా కుటుంబాల్లో అర్హులైన వారసులకు కారుణ్య నియామకాల కింద మూడు దశల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. మొదటి దశలో కలెక్టర్ల ఆధ్వర్యంలోని జిల్లా కమిటీలు ఉద్యోగాలు కల్పిస్తాయి. ఆయా జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వారిని నియమిస్తారు. జిల్లా కమిటీలు గుర్తించిన పోస్టులను భర్తీ చేయగా మిగిలిన వారికి ఆర్టీసీలో ఉద్యోగాలు కల్పిస్తారు. అప్పటికీ ఇంకా అర్హులు మిగిలిపోతే వారికి మళ్లీ జిల్లా కమిటీల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తారు. ఇప్పటికే మొదటి దశగా జిల్లా కమిటీల ద్వారా కారుణ్య నియామకాల ప్రక్రియను చేపట్టారు. మిగిలిన ఉద్యోగాల కల్పనకు కూడా ఆర్టీసీ సమాయత్తం అవుతోంది.

**ఆర్టీసీలో 715 పోస్టుల గుర్తింపు**

కారుణ్య నియామకాల కోసం ఆగస్టు 15 నాటికి ఆర్టీసీలో అందుబాటులో ఉన్న ఉద్యోగాలను గుర్తించారు. రాష్ట్రంలో 12 ఆర్టీసీ రీజియన్ల వారీగా మొత్తం 715 ఉద్యోగాలను గుర్తించారు. వీటిలో డ్రైవర్ పోస్టులు 346, కండక్టర్ పోస్టులు 90, అసిస్టెంట్ మెకానిక్ పోస్టులు 229, ఆర్టీసీ కానిస్టేబుల్ పోస్టులు 50 ఉన్నాయి. కారుణ్య నియామకాల కింద ఈ పోస్టులను నెల రోజుల్లో భర్తీ చేయాలని ఆర్టీసీ భావిస్తోంది.

# అంతా 'సార్' చెప్పినట్లే..

**బయటపడ్డ పుంగనూరు మర్డర్ ప్లాన్ • పుంగనూరులో పోలీసుల్ని చంపాలి.. అల్లకల్లోలం సృష్టించాలి**

- పోలీసుల ఎదుట నోరు విప్పిన చల్లా బాబు డ్రైవర్ నవీన్‌కుమార్
- పోలీసులు కేసు పెడితే కోర్టులో మన 'సార్' చూసుకుంటాడు
- టీడీపీ నేతల రహస్య సమావేశంలో చల్లా బాబు ఆదేశాలు
- అంతకుముందు అంగళ్లలో చంద్రబాబుతో చల్లా బాబు భేటీ
- అన్నీ 'సార్' ఆదేశాల మేరకే..



పుంగనూరు వద్ద టీడీపీ మూకల దాడి (ఫైల్)

**చిత్తూరు అర్బన్ :** చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో పోలీసులను చంపాలన్న కుట్ర, వాహనాలను తగులబెట్టడం, వ్యూహ ప్రతివ్యూహాలన్నీ 'సార్'కు తెలిసే జరిగాయా? ఈ విధ్వంసకాండంతో సొంత పార్టీ కార్యకర్తల్ని సైతం బలిదానం తీసుకోవాలని 'సార్'నుంచి ఉత్తర్వులు వచ్చాయా? పోలీసులు కేసు పెడితే కోర్టులో కాపాడే విషయం కూడా 'సార్'చూసుకుంటారని స్పష్టమైన హామీ లభించిందా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈనెల 4వ తేదీన పుంగనూరు వద్ద జరిగిన విధ్వంసకాండతో పదుల సంఖ్యలో పోలీసులపై హత్యాయత్నం జరగడం, వాహనాలు తగులబెట్టిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు పరారీలో ఉండగా.. ఇతని డ్రైవర్ కలకడ నవీన్ కుమార్, మరో ఇద్దరు నిందితులు దోవల అమర్‌నాథ్, సి.పెద్దన్నలను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. చల్లా బాబు డ్రైవర్‌ను పోలీసులు విచారించగా ఈ కుట్రలకు సంబంధించిన పూర్తి ప్లాన్‌ను విస్పష్టంగా వివరించినట్లు తెలుస్తోంది. నిందితుడి నేర ఒప్పుదల వాంగ్మూలంలో పలు విషయాలను పూస గుచ్చినట్లు చెప్పేశాడని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

**1వ తేదీ : కుట్రకు రూపం**

ఈ నెల 4వ తేదీ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటన పుంగనూరు బైపాస్ మీద వెళ్లాల్సి ఉండగా.. అనుమతి లేకున్నా పుంగనూరు పట్టణంలోకి వెళ్లడానికి టీడీపీ నేతలు పట్టుపట్టడం, ఆపై పోలీసులను చంపాలని విధ్వంసకాండ సృష్టించగా ఓ పోలీసు కంటిచూపు పోగొట్టుకోగా, పదుల సంఖ్యలో పోలీసులకు తలలు పగిలి రక్త గాయాలైన విషయం తెలిసిందే. ఈ కుట్రకు ఈనెల 1వ తేదీనే టీడీపీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం చల్లా బాబు, ఇతని పీఏ గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్ ముగ్గురూ రొంపిచెర్ల నుంచి పుంగనూరుకు కారులో బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లగానే చల్లా బాబు ఫోన్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు. 'సరే సార్.. సరే సార్.. మీరు చెప్పినట్లే చేస్తాను. బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లు అన్నీ అక్కడ డంప్ చేస్తాం. మిమ్మల్ని టౌన్‌లోకి రానివ్వమంటూ పోలీసులు చెప్పగానే మనవాళ్లు దాడి చేస్తారు. పోలీసులను కానీ, అవసరమైతే వైసీపీ వాళ్లపై దాడి చేసి చంపైనా సరే మీరు చెప్పినట్లే ప్రోగ్రాం పెట్టిస్తా సార్..'అని మాట్లాడినట్లు సమాచారం. మరుసటి రోజు తన ఇంటి వద్ద జరిగే అతి ముఖ్యమైన సమావేశానికి పిలవాల్సిన కొందరి పేర్లను గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌కుమార్‌కు చల్లా బాబు అప్పగించాడు.

**2వ తేదీ : వ్యూహ రచన**

రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారి పల్లె పంచాయతీ, గర్నిమిట్టవారిపల్లెలోని చల్లా బాబు ఇంటి వద్ద టీడీపీలోని ముఖ్యమైన నాయకులతో రహస్య సమావేశం నిర్వహించారు. టీడీపీకి చెందిన హేమంత్‌రెడ్డి, మోహన్‌నాయుడు, నగేష్, రమేష్ రెడ్డి ఇంకా పలువురు ముఖ్య నేతల్ని పిలిపించిన చల్లా బాబు మాట్లాడటం మొదలుపెట్టాడు. ఇందులో రాళ్లు, మద్యం బాటిళ్లు, టపాకాయ బాంబులు, కర్రలు ఎక్కడ డంప్ చేయాలో చెప్పాడు. పోలీసులు కాల్పులు ఓపెన్ చేసేలా ఎలా రెచ్చగొట్టాలో ఆదేశాలిచ్చాడు. ఒకరిద్దరు ఖాకీల ప్రాణాలు పోతే.. టీడీపీ కార్యకర్తలు చేసే బలిదానం వల్ల పార్టీ మైలేజ్ పెరుగుతుందని నమ్మబలికాడు. ఇదే జరిగితే రాష్ట్రంలో అధికార పార్టీకి జరిగే డ్యామేజ్, టీడీపీకి వచ్చే మైలేజ్ గురించి వివరించాడు. ఎవరెవరు ఏ పనులు చేయాలో అప్పగించి, అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరగాలని చల్లా బాబు ఆదేశించాడని సమాచారం.

**3వ తేదీ : వ్యూహం అమలుపై ప్లాన్**

చల్లాబాబు మరికొంత మంది టీడీపీ నాయకుల్ని తన ఇంటి వద్దకు పిలిపించాడు. పుంగనూరు విధ్వంసకాండ ఎలా చేయాలి? పోలీసులను ఎలా చంపాలి? ఖాకీలు ఫైర్ ఓపెన్ చేసేలా రెచ్చగొట్టే విధానం? ఆపై జరిగే అల్లర్లలో ఎవరెవరి పాత్ర ఏమిటనే ప్లాన్ గురించి చెప్పాడు.

**4వ తేదీ : వ్యూహం అమలు**

ఉదయం 10 గంటలు కావస్తోంది. చల్లా బాబు అంగళ్లకు వెళ్లారు. అక్కడ చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యాడు. ఇద్దరూ కొద్దిసేపు మాట్లాడుకున్నారు. ఆపై చల్లా బాబు, అతని పీఏ గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్ నవీన్‌కుమార్‌తో కలిసి కారులో పుంగనూరు బయలుదేరారు. కారు మదనపల్లె దాటిన తర్వాత.. 'వీఐపీ కంటే మనం ముందుండాలి.. అక్కడ ఏం చేయాలో ముందుగా అనుకున్నట్లే అంతా జరగాలి' అని గోవర్ధన్‌రెడ్డిని చల్లా బాబు ఆదేశించాడు. 'అన్నా.. ఇదే జరిగితే పెద్ద గొడవలు జరుగుతాయి. పోలీసులు మనపై కేసులు పెడతారు. ఎట్లా అన్నా..'అని గోవర్ధన్‌రెడ్డి, చల్లా బాబును ప్రశ్నించినట్లు తెలిసింది. 'పోలీసులు పెట్టే కేసుల్ని కోర్టులో మన 'సార్'చూసుకుంటాడు..'అని చల్లా బాబు భరోసా ఇచ్చాడు. ఆపై జరిగిన విధ్వంసకాండలో చల్లా బాబు దగ్గరుండి మరీ టీడీపీ నేతల్ని రెచ్చగొట్టి.. పోలీసులను చంప్రేయండ్రా అంటూ, వాళ్ల వాహనాలను తగులబెట్టాలంటూ ఆదేశాలు ఇచ్చాడు.

**ఇంతకూ ఆ సార్ ఎవరో?**

పుంగనూరులో మారణహోమం సృష్టించాలనే ప్లాన్ వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఎవరు? చల్లా బాబుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ఆ 'సార్'ఎవరు? వ్యవస్థలను మేనేజ్ చేయగలిగిన ధైర్యం ఉన్న ఆ 'సార్'ధైర్యమేమిటి? పోలీసులు ఆవేశంలో ఫైర్ ఓపెన్ చేసి వుంటే.. జరిగి ఉండే భారీ ప్రాణ నష్టానికి ప్రభుత్వాన్నే కూలదోసి సీఎం కుర్చీలో ఎక్కాలన్నదే ఆ 'సార్'లక్ష్యమా? మదిని తొలిచే ఈ ప్రశ్నలకు పోలీసుల దర్యాప్తు సమాధానం చెప్పనుంది.

# కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

- ఏపీలో రెగ్యులరైజేషన్‌కు ఐదేళ్ల సర్వీసు నిబంధన ఎత్తివేత
- స్వాతంత్ర్య దినోత్సవ వేళ సీఎం వైఎస్ జగన్ శుభవార్త
- 2014 జూన్ 2 ముందు నుంచి ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరూ రెగ్యులరైజేషన్



**సాక్షి, అమరావతి:** కాంట్రాక్టు ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుభవార్త అందించారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించి ఐదేళ్ల సర్వీసు నిబంధనను ఎత్తివేస్తూ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ గత మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఇందుకు 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులనే రెగ్యులరైజేషన్ చేసేలా నిబంధన విధించారు. తాజాగా ముఖ్యమంత్రి జగన్ ఐదు సంవత్సరాల నిబంధనను తొలగిస్తూ సంబంధిత ఫైలుకు మంగళవారం ఆమోద ముద్ర వేశారు. వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులరైజ్ చేయాలనే ఉద్దేశంతో ఏ సంఘం డిమాండ్ చేయకుండానే స్వయంగా ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల నిబంధనను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 2014 జూన్ 2వ తేదీకి ముందు నియమితులై ఇప్పటి వరకు కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరి సర్వీసును రెగ్యులరైజ్ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి. ముఖ్యమంత్రి జగన్ తీసుకున్న నిర్ణయం పట్ల కాంట్రాక్టు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీ విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ ఖరారు

- గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి కొత్త పీఆర్సీ
- 8 శాతం ఫిట్‌మెంట్.. 12 వాయిదాల్లో పీఆర్సీ బకాయిలు

**సాక్షి, అమరావతి:** ఏపీ విద్యుత్ సంస్థల్లోని 28,355 కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తూ.. ఉద్యోగుల వేతన సవరణ (పీఆర్సీ) ఖరారైంది. కొత్తగా అమల్లోకి రానున్న సింగిల్ మాస్టర్ స్కేలుతో కూడిన పీఆర్సీ ఒప్పందంపై ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలు (ఏపీఈపీడీసీఎల్), (ఏపీసీపీడీసీఎల్), (ఏపీఎస్పీడీసీఎల్) ఉన్నతాధికారులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీఎస్‌పీఈజేఏసీ) ప్రతినిధులు, పలు యూనియన్ల నాయకులు బుధవారం సంతకాలు చేసి పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం కొత్త పీఆర్సీ గతేడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. పీఆర్సీ బకాయిలను విద్యుత్ సంస్థలు 12 వాయిదాల్లో ఉద్యోగులకు చెల్లిస్తాయి. అలాగేవారికి 8 శాతం ఫిట్‌మెంట్ లభిస్తుంది. సింగిల్ మాస్టర్ స్కేలు అనే కొత్త విధానాన్ని అమల్లోకి తేనున్న నేపథ్యంలో అధికారులు లోతుగా అధ్యయనం చేసి కొత్త స్కేళ్లు రూపొందించారు. పేస్కేళ్లలో తేడాలు ఉంటే సరిచేసేందుకు ట్రాన్స్‌కో జేఎండీ నేతృత్వంలో మూడు డిస్కంల సీఎండీలతో హెచ్‌ఆర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. దీంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేస్తూ పీఆర్సీ ఒప్పందంపై సంతకాలు చేశారు. యాజమాన్యాల తరఫున ఏపీజెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జేఎండీ మల్లారెడ్డి, డిస్కంల సీఎండీలు.. పృథ్వీతేజ్, పద్మా జనార్దనరెడ్డి, సంతోష్ రావు, ఉద్యోగ సంఘాల తరఫున 1104, 327, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, జేఏసీ ప్రతినిధులు సంతకాలు చేసినవారిలో ఉన్నారు.

# జీపీఎస్‌లో జీవిత భాగస్వామికీ పెన్షన్

**ఆమోదించిన ఏపీ ప్రభుత్వం**

**సాక్షి, అమరావతి:** గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) విధానంలో జీవిత భాగస్వామికి పెన్షన్ అందనుంది. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్టు తెలిసింది. త్వరలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి. రిటైర్డ్ ఉద్యోగి నెలవారీ అందుకునే పెన్షన్‌లో 60 శాతాన్ని జీవిత భాగస్వామికి అందించాలని నిర్ణయించారు. యాన్యుటీలో ఏమైనా లోటు ఏర్పడితే ప్రభుత్వం భరించనుంది. దీంతో రిటైరైన ఉద్యోగి చనిపోయినా అతని భార్యకు పెన్షన్ భద్రత లభిస్తుంది. జీపీఎస్ వర్తించే ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే.. వారు సర్వీసులో చివరి నెల మూల వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వడానికి ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిన విషయం విదితమే. ద్రవ్యోల్బణం ప్రభావాన్ని తగ్గించడానికి ఆ మేరకు పెన్షన్ పెంపునకు జీపీఎస్‌లో అవకాశం ఉన్న విషయం విదితమే.

# భార్య హత్యకు రూ.9లక్షలు సుపారీ

- బార్‌లో పథకం.. ఆపై రెక్కీ నిర్వహణ
- మంచిర్యాలలో మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

**మంచిర్యాలక్రైం:** ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అడ్డు తొలగించుకోవడానికి భర్తే కాలయముడయ్యాడు. రూ.9లక్షలు సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించాడు. మంచిర్యాలలో ఈ నెల 10న జరిగిన బత్తిని శరణ్య(27) హత్య కేసులో మిస్టరీ వీడింది. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. హత్యకు సంబంధించిన వివరాలను మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ బుధవారం తన కార్యాలయంలో వెల్లడించారు. మంచిర్యాల పట్టణంలోని గోపాల్‌వాడకు చెందిన బత్తిని శరణ్య తన ఇంటి పక్కనే ఉండే సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ జియా ఉల్ హక్ ప్రేమించుకున్నారు. 2013 ఫిబ్రవరి 19న హైదరాబాద్‌లోని ఆర్యసమాజ్‌లోని వివాహం చేసుకున్నారు. కొంత కాలం కలిసే ఉన్నారు. వీరికి కూతురు మనిస్విని జన్మించింది. జాయా ఉల్ హక్ మరో అమ్మాయితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ శరణ్యతో గొడవ పడేవాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయి. వరకట్న వేధింపులు, మెయింటనెన్స్ కోసం ఆమె కేసు వేసింది. ఆ తర్వాత శరణ్య స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పని చేస్తూ జీవనం సాగించింది. విడాకులు ఇవ్వాలని జియా ఉల్ హక్ చాలాసార్లు బెదిరించాడు. విడాకులు ఇవ్వడానికి ఆమె అంగీకరించకపోవడంతో ఎలాగైనా హత్య చేయాలని భావించాడు.

**డబ్బులు పంచుకుందామని వచ్చి..**

శరణ్యను హత్య చేయించిన ఆమె భర్త జియా బుధవారం పోలీసులకు లొంగిపోయాడు. హత్య చేసిన వారు, సహకరించిన వారు సుపారీ డబ్బును పంచుకోవడానికి స్థానిక రాజీవ్‌నగర్ సమీపంలోని హైవేపై కలుసుకుంటున్నారని పోలీసులకు వెల్లడించాడు. పోలీసులు అక్కడికి చేరుకోగానే గమనించి రవితేజ పారిపోయాడు. మిగతా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

**నిందితులు..**

జియా రూ.9లక్షలు ఇచ్చిన తన భార్యను హత్య చేయించాడు. నిందితులంతా యువకులే కావడం గమనార్హం. ప్రధాన నిందుతుడి జియా ఉల్ హక్, స్థానిక రాళ్లపేటకు చెందిన చంద్రగిరి సాయికుమార్, అండాలమ్మ కాలనీకి చెందిన ధారంగుల రాజ్‌కుమార్, ధారంగుల శివ, ఎండీ.ఆమేర్ గౌరి, గోపాల్‌వాడకు చెందిన వేముల సాయి, జైపూర్ మండలం కుందారానికి చెందిన పల్లికొండ అనిల్, పల్లికొండ శివకృష్ణలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.4వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా, మరో నిందితుడు గొల్లవాడకు చెందిన మాచర్ల రవితేజ పరారీలో ఉన్నాడు.

**బార్‌లో పథకం..**

జూన్ 12న బక్రీద్ పండుగకు మంచిర్యాలకు వచ్చిన జియా ఉల్ హక్ తన స్నేహితుడు చంద్రగిరి సాయికుమార్‌తో శరణ్యను హత్య చేయాలని, ఎవరైనా తెలిసిన వారు ఉంటే చూడాలని, సుపారీ ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. సాయికుమార్ రూ.10లక్షలు కావాలని అడగడంతో రూ.9లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని విడతల వారీగా ఇచ్చాడు. శరణ్యను గుర్తు పట్టేందుకు ఫొటో ఇచ్చి వివరాలు తెలియజేశాడు. సాయికుమార్ తన స్నేహితులతో కలిసి స్థానిక తిరుమల బార్‌లో హత్యకు ప్రణాళిక రూపొందించి పలుమార్లు శరణ్య పని చేసే ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లే దారిలో రెక్కీ నిర్వహించారు. రైల్వే ఏ క్యాబిన్ ప్రాంతం హత్యకు అనుకూలంగా ఉంటుందని సాయికుమార్ స్నేహితుల్లో ఒకడైన రవితేజ హత్య ఎలా చేయాలో పథకం వేసుకున్నారు. 10న ఉదయం ఐదుగురు వ్యక్తులు కత్తులతో రైల్వే ఏ క్యాబిన్ వద్ద కాపు కాశారు. ఉదయం విఫలం కావడంతో సాయంత్రం ఎలాగైనా చంపాలని అనుకున్నారు. శరణ్య విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఏ క్యాబిన్ రైల్వే ట్రాక్ దాటగానే నిందితులు రాజు, శివ చెట్ల పొదల్లో నుంచి ఒక్కసారిగా కత్తులతో ఆమెపై దాడి చేసి హత్య చేశారని పోలీసులు తెలిపారు. శివ అక్కడ ఉన్న రాళ్లతో తలపై మోదాడు. మరికొందరు పక్కనే కాపు కాస్తూ ఉన్నారు. అనంతరం రైల్వేట్రాక్ గుండా పారిపోయారు. రాజు, శివ మోటార్‌సైకిల్‌పై పెద్దపల్లి వెళ్లి బస్టాండ్‌లో బండిని పార్క్ చేసి హైదరాబాద్ నుంచి వైజాగ్, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చి తప్పించుకుందామని అనుకున్నారు.

# సాయం కోసం ఎదురుచూపు

- ఊపిరితిత్తుల వ్యాధితో మంచానికే పరిమితం
- గీత కార్మిక వృత్తిని వదిలి రైస్‌మిల్లు ఆపరేటర్‌గా వెళ్తే అనారోగ్యానికి గురైన వైనం

**చొప్పదండి:** గీత కార్మిక వృత్తిని వదిలి రైస్‌మిల్లు ఆపరేటర్‌గా వెళ్తే అనారోగ్యానికి గురయ్యాడో వ్యక్తి. చేతిలో చిల్లి గవ్వ లేక మంచానికే పరిమితమయ్యాడు. ఆరోగ్యం దినదినం క్షీణిస్తున్నా వ్యాధి నయం చేసుకోవడానికి ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న కార్మికుడి దీనగాథ. చొప్పదండి పట్టణానికి చెందిన పొన్నం శ్రీనివాస్ (48) గీత కార్మికుడిగా జీవనం కొనసాగిస్తుండేవాడు. పట్టణంలోని రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా అవకాశం రావడంతో చాలా ఏళ్లుగా పనిచేసి ఇద్దరు కూతుళ్లు, కుమారుడి పెళ్లిళ్లు చేశాడు. అంతా సవ్యంగా జరుగుతుందనుకుంటున్న సమయంలో శ్రీనివాస్ రెండు ఊపిరితిత్తులు చెడిపోయాయి. ఉన్న డబ్బంతా ఖర్చయినా రోగం నయం కాలేదు. మెరుగైన వైద్యానికి ఖర్చు పెట్టే స్థోమత లేదు, అందె ఇంట్లో ఉంటున్న శ్రీనివాస్ ఇప్పటికే రూ.మూడు లక్షల వరకు ఖర్చు చేశాడు. మరో రూ.లక్షకుపైగా డబ్బు అవసరముందని, దాతలు స్పందించి ఆరోగ్యం మెరుగయ్యేందుకు సాయం చేయాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.



అనారోగ్యానికి ముందు పొన్నం శ్రీనివాస్



అనారోగ్యంతో ఉన్న పొన్నం శ్రీనివాస్

**72860 80944 నంబర్‌కు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా సాయం చేయాలని కోరుతున్నాడు.**

# వస్త్రపరిశ్రమ సొంతంగా ఎదగాలి

- ప్రభుత్వ ఆర్డర్లు రాకున్నా నిలదొక్కుకోవాలి
- సిరిసిల్ల వస్త్రానికి బ్రాండ్ ఇమేజ్ తేవాలి
- రెండు నెలల్లో పెండింగ్ బిల్లులు ఇప్పిస్తాం
- చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి
- సిరిసిల్లలో బతుకమ్మ చీరల తయారీ పరిశీలన



సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తిని పరిశీలిస్తున్న చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి

**సిరిసిల్ల:** సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సొంతంగా ఎదగాలని, ప్రభుత్వ ఆర్డర్లు రాకున్నా ప్రపంచంతో పోటీపడే వస్త్రాలను తయారుచేస్తూ నిలదొక్కుకోవాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి కోరారు. సిరిసిల్లలోని నెహ్రూనగర్, వెంకట్రావునగర్‌లలో బతుకమ్మ చీరల తయారీని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్డర్లు రాకముందు, వచ్చిన తరువాత సిరిసిల్లలో వచ్చిన మార్పులపై ఆరా తీశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో అలుగు వర్షిణి మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్డర్లే కాకుండా ప్రైవేటు ఆర్డర్లతో పరిశ్రమ నిలదొక్కుకోవాలని సూచించారు. యారన్, ఫ్యాబ్రిక్, అపెరల్ విభాగంలోనూ రాణించాలన్నారు. హైదరాబాద్‌లో లంగాల కొరత ఉందని, క్వాలిటీ లంగాలను తయారుచేస్తే మంచి మార్కెటింగ్ ఉంటుందన్నారు. పోచంపల్లి తరహాలో సిరిసిల్ల వస్త్రాలకు బ్రాండ్ సాధించాలన్నారు. రాజుపాలెం, తిరువూర్, ఈరోడ్‌లో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని తెలిపారు. సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను రెండు నెలల్లో క్లియర్ చేస్తామన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జౌళిశాఖ ఆర్‌డీడీ అశోక్‌రావు, ఏడీ సాగర్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కమలాకర్, వస్త్రోత్పత్తిదారులు పాల్గొన్నారు.

## నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈ నెల 25 వరకు విద్యార్థులకు అవకాశం

**కాగజ్‌నగర్‌టౌన్:** కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల కేంద్రీయ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024- 25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఈ నెల 17తో గడువు ముగియనుండగా గ్రామీణ విద్యార్థుల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులు https://navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. కొంతమంది ఆధార్‌తో మొబైల్ నంబర్ లింక్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారు ఆధార్ ఆప్షన్‌లో 'నో' అని నమోదు చేసి, రెసిడెన్సీ సర్టిఫికెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మళ్లీ కనిపించిన చిరుత

**నిర్మల్:** జిల్లాకేంద్రం శివారులో చిరుతపులుల సంచారం స్థానికులను కంగారు పెడుతోంది. ఇటీవల బంగల్‌పేట్ చెరువు–విశ్వనాథ్‌పేట్ మధ్యలో కనిపించిన ప్రాంతంలోనే బుధవారం రాత్రి మళ్లీ తారసపడింది. స్థానిక మహాలక్ష్మీనగర్‌కు చెందిన యువకుడు విశ్వనాథ్‌పేట్ నుంచి బంగల్‌చెరువు కట్ట వైపు వస్తుండగా రోడ్డు పక్కనే చిరుతపులి కనిపించింది. సదరు యువకుడు కాలనీవాసులు, పోలీసులకు సమాచారం అందించాడు. స్థానికులు వెంటనే వెళ్లి సదరు ప్రాంతంలో పరిశీలించగా మళ్లీ చెట్లపొదల్లో కనిపించడంతో కంగారు పడుతున్నారు. అటవీ అధికారులు వెంటనే చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.

## మాత్రల పంపిణీ పరిశీలన

**జన్నారం:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్, చింతగూడ, పైడిపెల్లి గ్రామాల్లో బోదకాలు వ్యాధి నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని వరంగల్ జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య బుధవారం పరిశీలించారు. మాత్రలు వేస్తున్నారా లేదా అని దానిపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యురాలు ఉమశ్రీ, సిబ్బంది రాంబాబు, కమలాకర్, లలిత, మంజుల, కళావతి పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

**చొప్పదండి:** జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి 25 వరకు గడవు పొడిగించారు. ఈ నెల 16వ తేదీ వరకు ఉన్న గడువును మళ్లీ పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులకు మరో మారు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ మంగతాయారు కోరారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 20న ఉంటుందని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
గురువారం ॥ 17-8-2023

పండగ - అలంకరణ









# శ్రావణం.. పర్యావరణహితం

**సంప్రదాయ వేడుకలకు వేదిక శ్రావణం. కళ కళలాడే వెలుగులను మోసుకువచ్చే మాసం. తీరైన శోభను తీర్చడానికి శ్రమతోపాటు డబ్బునూ ఖర్చు పెడతారు. ఎక్కువ కష్టపడకుండా పర్యావరణ స్నేహితంగా శ్రావణ మాస వ్రతాలకు, పూజలకు ఎకోఫ్రెండ్లీ థీమ్‌తో ఇంటిని అందంగా ఎలా తీర్చిదిద్దుకోవచ్చో హైదరాబాద్ వాసి డెకార్ నిపుణులు కల్పనా రాజేష్ ఇస్తున్న సూచనలు ఇవి..**

**ఆకులు అల్లుకున్న గోడ**

ఎక్కడైతే వ్రతం పీట పెడతారో ఆ చోట గోడకు తమలపాకులు, విస్తరాకులు, మర్రి ఆకులను ఒక దానికి ఒకటి కుట్టి, సెట్ చేయవచ్చు. మధ్య మధ్యలో బంతిపూలు లేదా గులాబీలు అమర్చవచ్చు. లేదంటే, ఇరువైపులా దండ కట్టి వేలాడదీయవచ్చు. ఏది సహజంగా ఉంటుందో దానిని ఎంపిక చేసుకోవాలి. బ్యాక్‌డ్రాప్‌లో వెదురు బుట్టలను ఉపయోగించవచ్చు. ఈ బుట్టలకు పూల అలంకారం చేస్తే కళగా కనిపిస్తుంది. ఇప్పుడు చాలావరకు బ్యాక్ డ్రాప్‌లో వాడే కర్టెన్స్ ప్రింటెడ్‌వి వచ్చినవి వాడుతుంటారు. వాటిని ఎంపిక చేసుకుంటే మనం అనుకున్న థీమ్ రాదు. ఇక వీటిలో పాలియస్టర్‌వి వాడకపోవడం మంచిది. ఎకో థీమ్‌లో ఎంత పర్యావరణ హితంగా ఆలోచనను అమలు చేస్తే అంత కళ ఉట్టిపడుతుంది. రంగు రంగుల హ్యాండ్లూమ్ శారీస్‌ను కూడా బ్యాక్ డ్రాప్‌కి వాడచ్చు. వట్టివేళ్లతో తయారుచేసే తెరలు కూడా వాడచ్చు.







**అందమైన తోరణం...**

మామిడి ఆకులు చెట్టు నుంచి కోసిన తర్వాత కూడా ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది. ఎలాగూ మామిడి ఆకులు తోరణం కడతారు. అలాగే, ఇప్పుడు వరికంకులతో తోరణాన్ని కట్టచ్చు. వీటిని వేడుక పూర్తయ్యాక మరుసటి రోజు బయట గుమ్మానికి అలంకారంగా వాడచ్చు. ఆ తర్వాత మట్టిలో వేస్తే ఎరువుగా మారిపోతుంది. అమ్మవారికి కట్టే చీర కూడా నారాయణ్‌పేట, ఇక్కత్ వంటి హ్యాండ్లూమ్ పట్టు చీర ఎంపిక చేసుకోవచ్చు. బ్యాక్ డ్రాప్ ఫ్రేమ్ చేసుకోవాలంటే మూడు వెదురు కర్రలు తీసుకొని, క్లాత్, అరటి ఆకులతో సెట్ చేయవచ్చు.

## అతిథులకు ఎకో కానుక

మార్కెట్లో వెదురు బుట్టలు దొరుకుతున్నాయి. పండ్లు, పూలు వంటివి ఈ బుట్టల్లో సెట్ చేయవచ్చు. అతిథులకు అందజేయడానికి ఇవి బాగుంటాయి. రసాయనాలు కలపని ఆర్గానిక్ పసుపు, కుంకుమ ఎంచుకోవాలి. చేనేత బ్లౌజ్ పీస్ పెడితే గిఫ్ట్ ప్యాక్ రెడీ అవుతుంది.



మన దగ్గర ఉన్న పర్యావరణ వస్తువులను సరిచూసుకొని, వాటితో ఎలా అలంకరణను పెంచుకోవచ్చనేది ముందుగా ఆలోచించి, ఆ విధంగా సిద్ధంగా చేసుకుంటే సంతృప్తికరమైన డిజైన్ వస్తుంది. పువ్వులు ఎక్కువ సేపు తాజాగా ఉండటానికి కెమికల్ స్ప్రే చేస్తుంటారు. థర్మోకోల్ మీద ఆకులు పెట్టి చాలా మంది ఎకో ఫ్రెండ్లీ అంటుంటారు. కానీ, మనం ఎంచుకునే థీమ్ మొత్తం తిరిగి మట్టిలో కలిసిపోయే విధంగా ఉంటేనే అది పర్యావరణ హితం అవుతుంది.

– కల్పనా రాజేష్,
డెకార్‌బై కృష్ణ నిర్వాహకురాలు



**ఇత్తడి బిందెలు .. గంటలు**

ఇంట్లో బిందెలు ఉంటాయి కదా... వాటిలో మట్టిని నింపి, అరటి చెట్లను సెట్ చేసుకోవచ్చు. స్టీల్ బిందె అయితే నచ్చిన క్లాత్ చుట్టి, మట్టి నింపితే చాలు. కుందులు జత అడుగు పొడవు ఉన్నవి ఎంచుకొని, రెండు వైపులా అమర్చుకోవచ్చు. ఒక వెడల్పాటి పాత్రలో బియ్యం నింపి, మధ్యలో కొబ్బరిపువ్వు సెట్ చేసి పెడితే ఎంతో అందంగా వచ్చేస్తుంది. అమ్మవారికి మల్లెపూల దండ, కలువపువ్వు మంచి కాంబినేషన్. లేదంటే గులాబీలు పెట్టుకోవచ్చు. గుమ్మం దగ్గర రెండు వైపులా పాత కాలం నాటి ఇత్తడి పాత్రలు ఉంటే వాటిలో మొక్కలు పెట్టవచ్చు. ఇత్తడి గంటలు ఉంటే వాటిని డెకార్ ప్లేస్‌లో అలంకారంగా వేలాడదీయవచ్చు. అరటిగెల పెట్టచ్చు.

**ప్లాస్టిక్‌కు నో ఛాన్స్**

ప్లాస్టిక్ పువ్వులతో వచ్చే అనర్థాలు ఎన్నో. వీటి బదులుగా బంతి, చామంతి, గులాబీ, కొబ్బరి ఆకుతో చేసిన దండలను, కాటన్ దారాలు







ఉపయోగించవచ్చు. రంగవల్లికల కోసం రసాయన రంగులు వాడకుండా పువ్వులతో ముగ్గులు వేయచ్చు. ఆర్గానిక్ కలర్స్ వాడుకోవచ్చు. కింద కూర్చోవడానికి కోరాగ్రాస్ చాపలు, కలంకారీ, షోలాపూర్ బెడ్‌షీట్స్ వాడచ్చు.

**బొమ్మలతో భలే..**

తెలుగు రాష్ట్రాల్లో మనవైన బొమ్మలు ఉన్నాయి. కొండపల్లి, నిర్మల్, చేర్యాల మాస్క్స్... ఆ బొమ్మలు పెట్టి కూడా అలంకారం చేసుకోవచ్చు. బ్రాస్ ఖరీదు ఎక్కువ అనుకుంటే టెర్రకోట ప్లాంటర్స్, గుర్రపు బొమ్మలు, మట్టి ప్రమిదలు, రంగురంగు గాజులు... వాడవచ్చు.

## దానిమ్మ తొక్క పారేయకండోయ్!

బ్యూటిప్

దానిమ్మ గింజలు తిని తొక్క పారేస్తుంటాం. దానిమ్మ గింజల్లో కంటే తొక్కలోనే యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే తొక్కను ఎలా వాడుకోవచ్చో చూద్దాం...

- దానిమ్మ తొక్కలను ఎండలో ఆరబెట్టాలి. చక్కగా ఎండిన తరువాత పొడిచేసి నిల్వచేసుకోవాలి.
- టేబుల్‌స్పూను దానిమ్మ పొడిలో అరటేబుల్ స్పూను నిమ్మరసం, అరటేబుల్ స్పూను తేనె వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు స్క్రబ్బర్‌లా రుద్ది కడగాలి. ఈ స్క్రబర్ వల్ల మృతకణాలు , ట్యాన్ తొలగి ముఖ చర్మం మృదువుగా మారుతుంది.



- దానిమ్మ తొక్కలో అధికంగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి కాబట్టి...తొక్కలను శుభ్రంగా కడిగి రసం తీసి తాగితే , ఆరోగ్యానికి మంచిది.
- కప్పు నీటిలో టీస్పూను దానిమ్మ పొడి, అరచెక్క నిమ్మరసం వేసి తాగినా మంచిదే.

మెంటల్ హెల్త్

**మానసిక అనారోగ్యం వెంటనే తెలియదు. తమకు మానసిక అనారోగ్యం ఉంది అని చాలామంది తామే అంగీకరించరు. కుటుంబ సభ్యులు గమనించినా నామోషి వల్ల వైద్యుని దగ్గరకు తీసుకెళ్లరు. 'వైద్యులే ఇంటింటికి వెళ్ల చెక్ చేస్తే చాలా సమస్యలు తెలుస్తాయి' అంటుంది ఇరా ఖాన్. ఆమిర్ ఖాన్ కూతురైన ఇరా ఖాన్ మానసిక సమస్యలతో బాధ పడుతూ తనలా బాధ పడేవారి కోసం 'అగత్సు ఫౌండేషన్' స్థాపించి మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను ప్రచారం చేస్తోంది.**

# మనసు కలతకు మందు ఉంది



తండ్రి ఆమిర్‌ఖాన్‌తో ఇరా ఖాన్

బాంద్రాలోని పాలీ విలేజ్‌లో ఉంటుంది రెండంతస్తుల అగత్సు ఫౌండేషన్. ముంబైలో ముఖ్యంగా బాంద్రాలో ఉన్న మానసిక సమస్యల బాధితులు అక్కడికి వచ్చి సహాయం పొందవచ్చు. చుట్టుపక్కల బస్తీల్లో ఉన్నవారు కూడా వచ్చి అందులోని కమ్యూనిటీ సెంటర్‌లో వైద్య సహాయం పొందవచ్చు. నిజానికి మానసిక వైద్యం, కౌన్సిలింగ్, థెరపీ కొంచెం ఖరీదుతో కూడినవి. కాని ఇక్కడ 50 రూపాయల నుంచి 750 రూపాయల లోపు ఎంతైనా ఫీజు కట్టవచ్చు. ఇక్కడ నలుగురు సైకియాట్రిస్టులు ఉంటారు. వైద్యసూచనలు చేస్తారు. దీనికి తోడు నిర్ణీత రోజులలో బాంద్రాలో డోర్ టు డోర్ తిరిగి ఇళ్లల్లో ఉన్నవాళ్ల మానసిక సమస్యలను తెలుసుకుని వైద్య సహాయం ఎంత అవసరమో చెబుతారు. ఈ పనులన్నీ మంచి ఫలితాలను ఇస్తున్నాయి. అగత్సు ఫౌండేషన్ స్థాపించి ఈ పనంతా చేస్తున్న వ్యక్తి ఇరా ఖాన్. ఆమిర్ ఖాన్– రీనా దత్తా (మొదటి భార్య)ల కుమార్తె. 'శరీరానికే కాదు.. మనసుకూ గాయాలవుతాయి. ఆ గాయాల వల్ల మనసు ప్రభావితం అవుతుంది. దానికి సరైన వైద్య సహాయం అందాలి' అంటుంది ఇరా ఖాన్.



● ఇరా ఖాన్

**స్వయంగా బాధితురాలు**

'మా కుటుంబంలో మానసిక సమస్యలు ఉన్నాయి. నా మానసిక సమస్యకు అనువంశికత కొంత కారణం అనుకుంటాను. నాకు 12వ ఏట స్కూల్లో ఉన్నప్పటి నుంచే డిప్రెషన్ సూచనలు కనిపించాయి. అయితే గుర్తించలేదు. ఇంటర్ తర్వాత నెదర్లాండ్స్‌లో లిబరల్ ఆర్ట్స్ చదవడానికి వెళ్లినప్పుడు నేను తీవ్ర డిప్రెషన్‌తో బాధ పడ్డాను. రోజంతా ఏడుస్తూ... నిద్రపోతూ ఉండేదాన్ని. నా డిప్రెషన్‌కు నా తల్లిదండ్రుల విడాకులు వేసిన ప్రభావం కూడా కారణం కావచ్చు. అక్కడ నేను చదువు డిస్కంటిన్యూ చేసి ఇండియా వచ్చి ఒక సంవత్సరం బ్రేక్ తీసుకున్నాను. మళ్లీ వెళ్లి జాయిన్ అయినా చదవలేకపోయాను. 2018లో చదువు మానేసి ఇండియా వచ్చేశాను. ఇక్కడకు వచ్చాక నా బాధ లోకానికి చెప్పాలనిపించింది. 2019లో మొదటిసారి నా డిప్రెషన్ గురించి చెప్పాను. ఇందుకు నా తల్లిదండ్రులు అడ్డు చెప్పలేదు. నాకు వారెంతో సపోర్ట్‌గా నిలిచారు. అంతేకాదు మానసిక ఆరోగ్యం విషయంలో చాలా మంది చూపే నిర్లక్ష్యానికి ముగింపు పలికే చైతన్యం కోసం పని చేయాలంటే అందుకూ సపోర్ట్ చేశారు. అలా ఈ అగత్సును మొదలెట్టాను' అని తెలిపింది ఇరా ఖాన్.

**మానసిక శుభ్రత**

'మనందరికీ శారీరక శుభ్రత తెలుసు. అలాగే మానసిక శుభ్రత కూడా ఉండాలి. భావోద్వేగాల శుభ్రత ఉండాలి. నా విషయమే చూడండి... డబ్బుంది.. తల్లిదండ్రుల సపోర్ట్ ఉంది... మంచి వైద్య సహాయం ఉంది... అయినా సరే డిప్రెషన్ నన్ను చావగొట్టింది. అలాంటిది పై మూడింటిలో ఏది లేకపోయినా అలాంటి వారు ఎంత బాధ పడుతుంటారో అర్థం చేసుకోవాలి. ప్రభుత్వ పరంగా, ప్రయివేటుగానూ ప్రజల మానసిక ఆరోగ్యం గురించి చేయవలసిన పని చాలా ఉంది. యాంగ్జయిటీ, డిప్రెషన్ వంటి వాటిని మనసును శుభ్రం చేసుకోవడం వల్ల తొలగించుకోవాలి. ఇందుకు చేయవలసిన పనులతో పాటు మందులు కూడా తీసుకోవాల్సి రావచ్చు. మేం ఏం చేస్తామంటే ఒక మానసిక సమస్యతో బాధపడుతున్నవారిని అలాంటి సమస్యతోనే బాధ పడుతున్నవారితో కలుపుతాము. వారంతా ఒక కమ్యూనిటీ అవుతారు. ఒకరికొకరం సాయంగా దీనిపై పోరాడవచ్చనే ధైర్యం తెచ్చుకుంటారు. ఆ విధంగా మేము పని చేస్తాం' అంటుంది ఇరా ఖాన్.

**గమనించుకోవాలి**

'మానసిక సమస్యలు పునరావృత్తం అవుతుంటాయి. మీరు ఏం చేస్తే సమస్య అధికమవుతుంది, ఏం చేయకపోతే సమస్య తక్కువ అవుతుంది గమనించుకోవాలి. ఎన్ని రోజులకొకమారు సమస్య కనపడుతూ ఉంది... ఎన్నాళ్లకు దూరమవుతుంది ఇదంతా గమనించుకుని మనకు మనమే సమస్యపై పోరాడాలి. మంచి నిద్ర అలజడి తగ్గిస్తుంది. నిద్ర సరిగా పట్టేలా చూసుకోవాలి' అంటుంది ఇరా ఖాన్.

మానసిక సమస్యలను దాచుకోవద్దని, అవి శారీరక సమస్యల్లాంటివేనని చెబుతోంది ఇరా ఖాన్. 'సెలబ్రిటీ కూతురినై ఉండి నేను బయటకు చెప్పినప్పుడు మీరు కూడా చెప్పండి. సహాయం పొందండి' అని కోరుతోందామె.

సైబర్ టాక్



# సర్కారు డబ్బులు వచ్చాయా?

## ఇదో రకం సైబర్ మోసం

'సరోజిని ఇంట్లో పని చేసుకుంటుంటే ఫోన్ మోగింది. చేస్తున్న పని వదిలేసి, ఫోన్ అందుకుంది. గవర్నమెంట్ ఆఫీసు నుంచి ఫోన్ చేస్తున్నామనగానే తమ పొదుపు సంఘం గురించే అని, అవతలి వాళ్లు చెప్పేది వినడానికి చెవులు రిక్కించింది. 'ప్రభుత్వం నుంచి వచ్చే పథకం మొత్తం డబ్బులు బ్యాంకులో జమ అయ్యాయా' అని అడిగారు అవతలి నుంచి. 'ఇంకా రాలేదు సార్! వచ్చాక చెబుతా!' అంది సరోజిని. 'అంటే, మీరు వడ్డీ డబ్బులు కట్టలేదు. వడ్డీ వెంటనే కడితే వచ్చే మొత్తం జమ అవుతుంది, లేదంటే లేదు' అని చెప్పడంతో కంగారు పడింది. 'మా సంఘం వాళ్లందరినీ అడిగి చెబుతాను' అంటే 'అంత టైమ్ లేదు ఇప్పుడే కట్టేయాలి. అనడంతో తన ఖాతా నెంబర్, ఫోన్‌కి వచ్చిన నెంబర్ చెప్పింది. ఆ తర్వాత ఫోన్ కట్ అయ్యింది. అంతలో అదే బృందంలో ఉండే కమల పరిగెత్తుకుంటూ వచ్చి, 'బ్యాంక్ వాళ్లు ఫోన్ చేశారు, ఆ తర్వాత వాళ్లేదో ఓటీపీ అని అడిగారు. చెప్పగానే నా ఖాతాలో పన్నెండు వేల రూపాయలు కట్ అయ్యాయి. అవి మళ్లీ వస్తాయా?!' అని అడిగింది. అప్పుడే సరోజిని అకౌంట్ నుంచి పదివేల రూపాయలు కట్ అయినట్టు మెసేజ్ వచ్చింది.

చూశారుగా... సైబర్ నేరగాళ్ల కొత్త తరహా మోసాలు ఇవి. అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని ఖాతాలో ఉన్నదంతా దోచుకుంటున్న ఈ నేరగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలంటే ఏం చేయాలో చెబుతున్నారు సైబర్ నిపుణులు.

**అనుమానం రాకుండా దోపిడీ..**

- సైబర్ నేరగాళ్లు తాము ప్రభుత్వ కార్యాలయం నుండి మాట్లాడుతున్నామంటారు.
- ప్రభుత్వ పథకాల పేరిట పొదుపు సంఘాల మహిళలకు ఫోన్ చేసి తెలుగు భాషలో మాట్లాడుతుంటారు.
- వెంటనే వడ్డీ చెల్లిస్తే ఆ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందని చెబుతారు.
- మీ ఖాతాలో కొంత నగదు నిల్వ ఉండాలని పొదుపు సంఘాల మహిళలకు ఫోన్లు చేస్తుంటారు.
- 'తమ ఖాతాలో నగదు నిల్వ లేదు' అని మహిళలు చెబితే 'ప్రభుత్వం డబ్బులు ఇస్తామన్నా.. మీ ఖాతాలో డబ్బులు లేకపోవడం ఏంటని, బ్యాంకులో తగినంత నగదు లేకపోతే పథకం డబ్బులు రావని చెబుతుంటారు.
- నేరగాళ్ల మాటలు నమ్మి, మహిళలు తమ స్మార్ట్ ఫోన్ లోని మనీ యాప్స్ ద్వారా డబ్బులు చెల్లిస్తుంటారు.

ఇలాంటి ఫోన్ కాల్స్ వస్తే ఏ మాత్రం నమ్మకూడదు. మోసగాళ్ల బారిన పడి మీ కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దు. బ్యాంక్ ఖాతా, వ్యక్తిగత వివరాలు, ఓటీపీ వంటివి ఎవరికీ చెప్పకూడదు. ఈ సైబర్ మోసాల పట్ల గ్రామీణ మహిళలు అవగాహన పెంచుకోవాలి. తెలిసిన వారు గ్రామీణ మహిళలను సైబర్ నేరాల పాలిటపడకుండా అప్రమత్తంగా ఉండాలనే విషయాలను తెలియజేయాలి.

**వెబ్‌సైట్ అయితే..**

ప్రభుత్వ సైట్‌లు.. అంటే, ఆయుష్మాన్ యోజన, కిసాన్ యోజన, జన్ ధన్ యోజన వంటి పోర్టల్‌లు, అనేక నకిలీ వెబ్‌సైట్‌లు ప్రజలను మోసగించడానికి స్కామర్‌లకు సాధారణ పద్ధతిగా మారాయి. ఈ మోసపూరిత వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక ప్రభుత్వ పోర్టల్‌ల రూపకల్పన, కంటెంట్‌ను అనుకరిస్తాయి. వారు ప్రభుత్వ పథకాలపై ప్రజల నమ్మకాన్ని క్యాష్ చేసుకుంటారు.

అటువంటి స్కామ్‌ల బారిన పడకుండా ఉండటానికి, మీరు తీసుకోవలసిన కొన్ని చర్యలు:

- అధికారిక ప్రభుత్వ డొమైన్‌తో సరిపోలుతుందని నిర్ధారించుకోవడానికి వెబ్‌సైట్ యుఆర్ఎల్‌ని చెక్ చేయాలి. ప్రభుత్వ వెబ్‌సైట్‌లు సాధారణంగా భారత దేశంలో ".gov.in" వంటి స్థిరమైన డొమైన్ నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. డొమైన్‌లో అక్షరదోషాలు లేదా వైవిధ్యాలు ఉన్న వెబ్‌సైట్‌ల పట్ల జాగ్రత్తగా ఉండండి.
- వినియోగదారుల డేటాను రక్షించడానికి చట్టబద్ధమైన వెబ్‌సైట్‌లు సురక్షిత కనెక్షన్‌లను (HTTP) ఉపయోగిస్తాయి. సైట్ సురక్షితంగా ఉందని నిర్ధారించుకోవడానికి అడ్రస్ బార్ లో ప్యాడ్‌లాక్ చిహ్నాన్ని తనిఖీ చేయాలి.
- అధికారిక మూలాలు: అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లు లేదా అధికారిక కమ్యూనికేషన్ ఛానెల్‌లలో అందించిన సమాచారం, లింక్‌లను మాత్రమే నమ్మాలి. లింక్‌లపై క్లిక్ చేయడం లేదా అనుమానాస్పద ఈ-మెయిల్స్, మెసేజ్‌లు లేదా సోషల్ మీడియా పోస్ట్‌ల నుండి సమాచారాన్ని షేర్ చేయడం మానుకోవాలి.
- మీకు ఆసక్తి ఉన్న ప్రభుత్వ పథకాన్ని అధికారిక మూలాల నుండి నేరుగా పరిశోధించాలి. ఇది మీకు అర్హత ప్రమాణాలు, ప్రయోజనాలు, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టమైన అవగాహనను ఇస్తుంది. తెలియని వెబ్‌సైట్‌ల సమాచారంపై మాత్రమే ఆధారపడకూడదు.
- పథకం లేదా ఆఫర్ ప్రామాణికత గురించి మీకు ఖచ్చితంగా తెలియకుంటే, వివరాలను ధృవీకరించడానికి సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారిక హెల్ప్‌లైన్ లేదా కస్టమర్ సేవను సంప్రదించాలి.
- ప్రభుత్వ పథకాలకు సాధారణంగా రిజిస్ట్రేషన్ లేదా దరఖాస్తు కోసం ఎలాంటి ముందస్తు చెల్లింపులు అవసరం లేదు. ఏదైనా ప్రయోజనాన్ని అందించే ముందు ఫీజు చెల్లించమని వెబ్‌సైట్ మిమ్మల్ని అడిగితే జాగ్రత్త పడాలి.
- ఆఫర్ నిజం కానంత మంచిగా అనిపిస్తే, అది బహుశా అలానే ఉంటుంది. స్కామర్‌లు బాధితులను తమ ఉచ్చులోకి లాగేందుకు తరచుగా మనోహరమైన వాగ్దానాలను ఉపయోగిస్తారు.
- ఈ మోసాల గురించి మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు కూడా బాధితులుగా పడకుండా వారికి అవగాహన కల్పించండి.
- మోసపోయామని గ్రహిస్తే బాధితులు వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు తెలియజేయాలి. 1930కి కాల్ చేయవచ్చు. https://www.cybercrime.gov.in ద్వారా రిపోర్ట్ చేయవచ్చు.



ఇన్‌పుట్స్:
**అనిల్ రాచమల్ల**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



## అంతర్జాతీయ క్రికెట్‌కు వహాబ్ రియాజ్ గుడ్‌బై

ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ టి20 లీగ్‌లపై మరింత దృష్టి సారించేందుకు... పాకిస్తాన్ సీనియర్ పేస్ బౌలర్ వహాబ్ రియాజ్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. 38 ఏళ్ల వహాబ్ పాకిస్తాన్ తరఫున 27 టెస్టులు ఆడి 83 వికెట్లు, 91 వన్డేలు ఆడి 120 వికెట్లు, 36 టి20లు ఆడి 34 వికెట్లు పడగొట్టాడు. 2008లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన వహాబ్ పాక్ తరఫున చివరిసారి 2020 డిసెంబర్‌లో న్యూజిలాండ్‌పై ఆడాడు. మొహాలీలో భారత జట్టుతో జరిగిన 2011 వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో వహాబ్ ఐదు వికెట్లతో ఆకట్టుకున్నాడు.

## పృథ్వీ షాకు గాయం... వన్-డే కప్ నుంచి అవుట్



ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో భారత క్రికెటర్ పృథ్వీ షా ఆట కేవలం 10 రోజుల్లోనే ముగిసింది. 23 ఏళ్ల పృథ్వీ షా వన్-డే కప్ టోర్నీలో నార్తంప్టన్‌షైర్ క్లబ్ తరఫున బరిలోకి దిగాడు. నాలుగు మ్యాచ్‌లు (125 నాటౌట్, 244, 26, 34) ఆడి 429 పరుగులు సాధించాడు. డర్హమ్ జట్టుతో జరిగిన నాలుగో మ్యాచ్ సందర్భంగా పృథ్వీ షా ఫీల్డింగ్ చేస్తూ మోకాలి గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా ఈ సీజన్‌లోని మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు.

## మోహిత్‌కు స్వర్ణం



అమ్మాన్ సిటీ (జోర్డాన్): ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. బుధవారం జరిగిన పురుషుల ఫ్రీస్టయిల్ 61 కేజీల విభాగంలో మోహిత్ కుమార్ పసిడి పతకాన్ని సాధించాడు. ఫైనల్లో మోహిత్ 9-8 పాయింట్ల తేడాతో ఎల్దర్ అఖమదునినోవ్ (రష్యా)పై గెలుపొందాడు. పల్వీందర్ చీమా (2001), రమేశ్ కుమార్ (2001), దీపక్ పూనియా (2019) తర్వాత ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం గెలిచిన నాలుగో భారతీయ రెజ్లర్‌గా మోహిత్ గుర్తింపు పొందాడు. భారత్‌కే చెందిన జైదీప్ (74 కేజీలు), దీపక్ చహల్ (97 కేజీలు) కాంస్య పతకాలు నెగ్గగా... సాగర్ (79 కేజీలు) రజతం సాధించారు. మహిళల 76 కేజీల విభాగంలో భారత రెజ్లర్ ప్రియా ఫైనల్లోకి దూసుకెళ్లింది.

## రెండో గేమ్‌లో అర్జున్ ఓటమి




బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత్‌కు ఒక పతకం ఖరారైంది. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మధ్య క్వార్టర్ ఫైనల్ టైబ్రేక్‌కు దారి తీసింది. వీరిద్దరిలో ఒకరు సెమీఫైనల్ చేరనుండటంతో భారత్‌కు కనీసం కాంస్య పతకం ఖరారైంది. అర్జున్‌తో తొలి గేమ్‌లో ఓడిపోయిన ప్రజ్ఞానంద బుధవారం జరిగిన రెండో గేమ్‌లో నల్ల పావులతో ఆడుతూ 75 ఎత్తుల్లో నెగ్గాడు. దాంతో వీరిద్దరు 1-1తో సమఉజ్జీగా నిలిచారు. వీరిద్దరి మధ్య విజేతను నిర్ణయించేందుకు నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు. భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, విదిత్ సంతోష్ గుజరాతి పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) 1.5-0.5తో గుకేశ్‌పై, నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్) 1.5-0.5తో విదిత్‌పై, కరువానా (అమెరికా) 1.5-0.5తో లీనియర్ (అమెరికా)పై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

# పసిడి పోరుకు భారత జట్లు



అదితి స్వామి, పర్ణీత్ కౌర్, జ్యోతి సురేఖ



ప్రథమేశ్, ఓజస్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ

- ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నీ
- సెమీస్‌లో బ్రిటన్‌పై పాయింట్ తేడాతో నెగ్గిన జ్యోతి సురేఖ బృందం
- దక్షిణ కొరియాపై షూట్ ఆఫ్‌లో గెలిచిన ఓజస్ త్రయం

పారిస్: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో కనబరిచిన జోరును భారత ఆర్చర్లు ప్రపంచకప్ స్టేజ్-4 టోర్నీలోనూ కొనసాగించారు. బుధవారం జరిగిన కాంపౌండ్ విభాగం టీమ్ ఈవెంట్స్‌లో భారత మహిళల, పురుషుల జట్లు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించాయి. ఆంధ్రప్రదేశ్ స్టార్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ చాంపియన్ అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు సెమీఫైనల్లో 234-233తో ఎల్లా గిబ్సన్, లేలా అనిసన్, ఇసాబెల్ కార్పెంటర్‌లతో కూడిన బ్రిటన్ జట్టును ఓడించింది. శనివారం జరిగే ఫైనల్లో మెక్సికో జట్టుతో భారత్ బృందం తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో మెక్సికో 234-233తో దక్షిణ కొరియాపై గెలిచింది. క్వాలిఫయింగ్‌లో అగ్రస్థానంలో నిలిచి టాప్ సీడ్ హోదాలో నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 233-230 ఎస్తోనియా జట్టును ఓడించింది.

మరోవైపు ప్రపంచ చాంపియన్ ఓజస్ దేవ్‌తలే, అభిషేక్ వర్మ, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కూడా బంగారు పతకంపై గురి పెట్టింది. తొలి రౌండ్‌లో భారత జట్టు 239-235తో ఇటలీపై గెలిచింది. క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 237-235తో మెక్సికో జట్టును ఓడించింది. భారత్, టాప్ సీడ్ దక్షిణ కొరియా జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్లో నాలుగు సిరీస్‌ల తర్వాత రెండు జట్లు 235-235తో సమంగా నిలిచాయి. దాంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్' అనివార్యమైంది. 'షూట్ ఆఫ్'లోనూ రెండు జట్లు 30-30తో సమంగా నిలిచాయి. అయితే కొరియా ఆర్చర్లతో పోలిస్తే భారత ఆర్చర్ ఓజస్ దేవ్‌తలే కొట్టిన బాణం కేంద్ర బిందువుకు అతి సమీపంలో ఉండటంతో భారత జట్టును విజేతగా ప్రకటించారు. రెండో సెమీఫైనల్లో అమెరికా 238-234తో డెన్మార్క్‌పై గెలిచి శనివారం జరిగే స్వర్ణ పతక మ్యాచ్‌లో భారత్‌తో పోటీపడేందుకు సిద్ధమైంది.

**రెండో రౌండ్‌లో ధీరజ్**

బుధవారం జరిగిన పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌తోపాటు అతాను దాస్ రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-2తో ఇమాదిద్దీన్ బాక్రి (అల్జీరియా)పై, అతాను దాస్ 6-0తో ఎలైన్ వాన్ స్టీన్ (బెల్జియం)పై గెలుపొందారు. భారత్‌కే చెందిన మృణాల్ చౌహాన్ 3-7తో ఫ్లోరియన్ ఫాబెర్ (స్విట్జర్లాండ్) చేతిలో, తుషార్ ప్రభాకర్ 2-6తో పీటర్ బుకువాలస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయారు. రికర్వ్ క్వాలిఫయింగ్ టీమ్ ర్యాంకింగ్ రౌండ్‌లో భారత జట్టు 2034 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. దాంతో భారత జట్టుకు నేరుగా రెండో రౌండ్‌లోకి 'బై' లభించింది.

## రూ. 832 కోట్లు!

**సౌదీ క్లబ్ 'అల్ హిలాల్'తో నెమార్ ఒప్పందం**




రియాద్: ప్రపంచ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాళ్ల కోసం కోట్లాది డాలర్లతో సౌదీ అరేబియా క్లబ్‌లు క్యూ కడుతున్నాయి. ఎంత భారీ మొత్తమైనా చెల్లించి సొంతం చేసుకునేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే క్రిస్టియానో రొనాల్డో (అల్ నాసర్) ఇక్కడి లీగ్‌లో ఆడుతుండగా ఇప్పుడు మరో టాప్ ప్లేయర్ నెమార్ ఈ జాబితాలో చేరాడు. ఈ బ్రెజిల్ ఆటగాడితో తాజాగా సౌదీ క్లబ్ 'అల్ హిలాల్' ఒప్పందం కుదుర్చుకుంది. ఇందు కోసం నెమార్‌కు వార్షిక వేతనంగా 100 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 832 కోట్లు) చెల్లించనున్నట్లు సమాచారం. దీంతోపాటు ఇతర సౌకర్యాలూ నెమార్‌కు లభిస్తాయి. గత ఆరు సీజన్లుగా పారిస్ సెయింట్ జర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్ తరఫున నెమార్ ఆడాడు. తాజా పరిణామాల్లో భాగంగా ట్రాన్స్‌ఫర్ ఫీ కింద పీఎస్‌జీ క్లబ్‌కు అల్ హిల్ మరో 98 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 819 కోట్లు) కూడా చెల్లించనుంది. గాయాలతో ఇబ్బంది పడుతూ గత కొంత కాలంగా ఫామ్ కోల్పోయిన నెమార్‌కు ఇంత భారీ మొత్తం చెల్లించేందుకు అల్ హిలాల్ ముందుకు రావడం విశేషం.

## విజేత వ్రిత్తి అగర్వాల్



భువనేశ్వర్: జాతీయ సబ్ జూనియర్, జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు తెలంగాణకు ఒక స్వర్ణం, రెండు కాంస్య పతకాలు లభించాయి. బాలికల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో తెలంగాణ అమ్మాయి వ్రిత్తి అగర్వాల్ విజేతగా నిలిచింది. వ్రిత్తి 17 నిమిషాల 44:33 సెకన్లలో గమ్యానికి చేరి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్-2 బాలికల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సాగి శ్రీనిత్య (తెలంగాణ), గ్రూప్-2 బాలికల 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో మిట్టపల్లి రిత్విక (తెలంగాణ) కాంస్య పతకాలు సాధించారు.

## తొలిసారి ఫైనల్లో ఇంగ్లండ్



సిడ్నీ: మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో ఈసారి కొత్త జట్టు చాంపియన్‌గా అవతరించనుంది. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 3-1 గోల్స్ తేడాతో ఆతిథ్య ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. తద్వారా మూడో ప్రయత్నంలో ఆ జట్టు తొలిసారి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. 2015, 2019 టోర్నీల్లో ఇంగ్లండ్ జట్టు సెమీఫైనల్లో ఓడిపోయింది. ఇంగ్లండ్ తరఫున ఎల్లా టూన్ (36వ ని.లో), లౌరెన్ హెంప్ (71వ ని.లో), అలెసియా రుసో (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... ఆస్ట్రేలియా జట్టుకు సామ్ కెర్ (63వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. ఆదివారం జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడుతుంది. మంగళవారం జరిగిన తొలి సెమీఫైనల్లో స్పెయిన్ 1-0తో స్వీడన్ జట్టును ఓడించింది. ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు ప్రపంచ కప్ టోర్నీ జరగ్గా... నాలుగుసార్లు అమెరికా (1991, 1999, 2015, 2019)... రెండుసార్లు జర్మనీ (2003, 2007), ఒక్కోసారి నార్వే (1995), జపాన్ (2011) జట్లు టైటిల్ సాధించాయి.

## కోస్టల్ రైడర్స్ శుభారంభం



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ తొలి మ్యాచ్‌లో కోస్టల్ రైడర్స్ జట్టు 12 పరుగుల తేడాతో బెజవాడ టైగర్స్ జట్టుపై గెలిచి శుభారంభం చేసింది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. మన్నాల ప్రణీత్ (31; 3 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ షేక్ రషీద్ (20; 4 ఫోర్లు), మద్దిల హర్షవర్ధన్ (32; 2 ఫోర్లు, 1 సిక్స్), మిట్టా లేఖజ్ రెడ్డి (26; 5 ఫోర్లు), పాథూరి మనోహర్ (24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. బెజవాడ టైగర్స్ బౌలర్లలో లలిత్ మోహన్ మూడు వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 150 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బెజవాడ టైగర్స్ 19.4 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్ మున్నంగి అభినవ్ (57; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కోస్టల్ జట్టు బౌలర్లలో చీపురపల్లి స్టీఫెన్, సుదర్శన్, ఆశిష్, మనోహర్ రెండు వికెట్ల చొప్పున తీసి బెజవాడ జట్టును దెబ్బ తీశారు.

## స్టోక్స్ పునరాగమనం

**ఇంగ్లండ్ వన్డే జట్టులో చోటు**



లండన్: ఏడాది క్రితం వన్డే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయడంలో ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సఫలమైంది. 2019 వరల్డ్ కప్ ఫైనల్ హీరో స్టోక్స్ తమ బోర్డు విజ్ఞప్తి మేరకు మళ్లీ వన్డేలు ఆడేందుకు సిద్ధమయ్యాడు. దాంతో న్యూజిలాండ్‌తో వచ్చే నెలలో జరిగే వన్డే సిరీస్‌కు అతడిని ఎంపిక చేశారు. 15 మందితో కూడిన టీమ్‌ను ఈ సిరీస్ కోసం ఈసీబీ ప్రకటించింది. వరల్డ్ కప్ కోసం టీమ్‌ను ప్రకటించేందుకు మరింత సమయం ఉన్నా... సెలక్టర్ ల్యూక్ రైట్ చెప్పిన దాని ప్రకారం మార్పుల్లేకుండా ఇదే బృందం వరల్డ్ కప్‌కూ కొనసాగే అవకాశం ఉంది.

# సినిమా



● ప్రభాస్



● విజయ్ దేవరకొండ, సమంత



● నాగ చైతన్య

## లవ్ టైమ్

సినిమాల్లో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ నడుస్తుంది. ఒకసారి హారర్‌ది హవా అయితే ఇంకోసారి కామెడీది.. మరోసారి యాక్షన్ ఇరగదీస్తుంది.. అయితే ట్రెండ్‌తో సంబంధం లేని జానర్ ఏదంటే అది 'లవ్'. అందుకే ఏడాది పొడవునా 'ఇట్స్ లవ్ టైమ్' అంటూ లవ్‌స్టోరీస్ రూపొందుతుంటాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవాటిలో, ఆన్ సెట్‌కి వెళ్లనున్న చిత్రాల్లో చాలా ప్రేమకథలు ఉన్నాయి. కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

**ఖుషీగా ప్రేమలో...**

హీరో విజయ్ దేవరకొండకి ప్రేమకథలు కొత్తేమీ కాదు. 'అర్జున్ రెడ్డి, గీత గోవిందం, డియర్ కామ్రేడ్, వరల్డ్ ఫేమస్ లవర్' వంటి ప్రేమ కథా చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత లవ్ స్టోరీస్ చేయకూడదనుకుని యాక్షన్ బాట పట్టారు. అయితే డైరెక్టర్ శివ నిర్వాణ చెప్పిన ప్రేమ కథ నచ్చడంతో 'ఖుషి' సినిమా చేశారు విజయ్. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా పలుమార్లు చెప్పారు. ఈ మూవీలో సమంత హీరోయిన్. విప్లవ్ (విజయ్ దేవరకొండ), ఆరాధ్య(సమంత) ప్రేమించుకుంటారు. అయితే ఇంట్లో వాళ్లు ఒప్పుకోకపోవడంతో బయటకి వచ్చి పెళ్లి చేసుకుని కొత్త జీవితం మొదలెడతారు. ఆ తర్వాత తమ మధ్య తలెత్తిన మనస్పర్థలు, గొడవలను తట్టుకొని మళ్లీ ఎలా కలిశారు? అనే కథాంశంతో 'ఖుషి' రూపొందినట్లు టాక్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... 'గీత గోవిందం' (2018) వంటి ప్రేమకథా చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న హీరో విజయ్ దేవరకొండ-దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమాకి శ్రీకారం జరిగింది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోందని టాక్.

**పీరియాడికల్ లవ్...**

యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ వరుసగా పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. అందులోనూ ఎక్కువగా యాక్షన్ సినిమాలే. జస్ట్ ఫర్ చేంజ్ అన్నట్టు అప్పుడప్పుడు ప్రేమకథలు ఒప్పుకుంటారు. ఆయన కెరీర్‌లో 'వర్షం, డార్లింగ్, మిస్టర్ పర్‌ఫెక్ట్' వంటి పలు హిట్ ప్రేమకథా చిత్రాలున్నాయి. తాజాగా మరో లవ్ స్టోరీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట ప్రభాస్. ప్రేమకథా చిత్రాలను తనదైన శైలిలో ఆవిష్కరించే హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ ఓ సినిమా చేయనున్నారని టాక్. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో పీరియాడికల్ లవ్‌స్టోరీగా ఈ సినిమా ఉంటుందట. అయితే ప్రభాస్ ప్రస్తుత కమిట్‌మెంట్స్ వల్ల హనుతో చేసే సినిమాకి ఇంకా టైమ్ పడుతుందట.

**గ్రామంలో ప్రేమ**

శ్రీకాకుళంలోని ఒక మారుమూల గ్రామం అది. ఓ అమ్మాయి-అబ్బాయి ప్రేమలో పడ్డారు. ఎవరెన్ని చేసినా విడదీయలేని ప్రేమ బంధం వారిది. అయితే అనుకోకుండా ఓ విపత్తు ఎదురవుతుంది. ఆ తర్వాత ఈ ప్రేమ జంట కథ ఎలాంటి మలుపు తీసుకుంది? అనే నేపథ్యంలో నాగచైతన్య హీరోగా ఓ చిత్రం రూపొందనుంది. ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకత్వం వహించనున్నారు. మత్స్యకారుల నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రం ఉంటుంది. 2018లో గుజరాత్ వెరావల్ నుండి వేటకు వెళ్లి పాక్ కోస్ట్ గార్డ్‌కు చిక్కిన 21 మంది భారతీయుల్లో ఒక వ్యక్తి జీవితం నేపథ్యంలో ఈ చిత్రం ఉండనుందట. ఈ చిత్రం కోసం శ్రీకాకుళం యాస, భాషలు నేర్చుకుంటున్నారు నాగచైతన్య.

ఈ సినిమా షూటింగ్ అక్టోబర్ చివర్లో లేదా నవంబరులో ఆరంభం కానుంది.

**టిల్లు లవ్**

అట్లుంటది మనతోని అంటూ రాధిక (నేహా శెట్టి) ప్రేమ కోసం వెంట పడి హిట్ సాధించారు సిద్ధు జొన్నలగడ్డ. విమల్ కృష్ణ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ-నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'డీజే టిల్లు'. ఇప్పుడు ఆ ప్రేమని రెండు రెట్లు ఎక్కువగా అందించేందుకు సిద్ధమవుతున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. ఈ సినిమా వచ్చే నెల 15న రిలీజ్ కానుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమాకి సంబంధించిన 'టికెటే కొనకుండా..' పాట లిరికల్ వీడియోలో హీరోయిన్‌ని ప్రేమలో పడేయడానికి హీరో పడే పాట్లు నవ్వులు తెప్పిస్తాయి. 'డీజే టిల్లు' కంటే 'టిల్లు స్క్వేర్'లో నవ్వులు, ప్రేమ రెట్టింపు ఉంటాయని చిత్ర యూనిట్ ఇప్పటికే స్పష్టం చేసింది. మరి టిల్లు కొత్త ప్రేమ కహానీ ఏంటో తెలియాలంటే సెప్టెంబర్ 15 వరకూ వేచి చూడాలి.



● సిద్ధు, అనుమప


## సుట్టంలా సూసి పోకలా...



● నేహా శెట్టి, విశ్వక్ సేన్

విశ్వక్ సేన్, నేహా శెట్టి జంటగా కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 8న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'అద్దాల ఓణీలా ఆకాశ వాణిలా గోదారి గట్టుపై మెరిశావు మణిలా..' అంటూ మొదలై 'సుట్టంలా సూసి పోకలా.. సుట్టేసుకోవే చీరలా..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ బుధవారం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో విడుదల చేసింది. మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా స్వరకల్పనలో శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. ఈ పాట విడుదల వేడుకలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ - ''సుట్టంలా..' పాట మృదువుగా ఉన్నప్పటికీ.. సినిమా మాత్రం మాస్‌లా ఉంటుంది'' అన్నారు. ''యువన్‌గారికి పెద్ద అభిమానినైన నాకు ఆయనతో కలిసి పని చేసే అవకాశం కల్పించిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు కృష్ణచైతన్య.

## విలన్ భైర



● సైఫ్ అలీఖాన్

'దేవర' కోసం భైరగా మారారు బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, విలన్ పాత్రలో సైఫ్ అలీఖాన్ నటిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా బుధవారం (ఆగస్టు 16) సైఫ్ అలీఖాన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'దేవర' చిత్రంలోని భైర పాత్రలో సైఫ్ నటిస్తున్నారని వెల్లడించి, ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు ఎన్టీఆర్. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న థియేటర్స్‌లో విడుదల కానుంది.

## ఆత్మాభిమానం.. అహంభావం కాదు



● క్లాక్స్, కార్తికేయ, రామ్‌చరణ్, నేహాశెట్టి, రవీంద్ర బెనర్జీ

''2012 డిసెంబరు 21.. ప్రపంచం అంతా యుగాంతం వస్తుందని భయపడిన రోజు. కానీ ఎక్కడా ఏం జరగలా.. ఒక్క మా ఊర్లో తప్ప... (అజయ్ ఘోష్)' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'బెదురులంక 2012' ట్రైలర్. కార్తికేయ గుమ్మకొండ, నేహా శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్ దర్శకత్వంలో సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్ చరణ్ విడుదల చేసి, మాట్లాడుతూ - ''కొత్త కాన్సెప్ట్‌లను సెలక్ట్ చేసుకుని సినిమాలు చేస్తుంటారు కార్తికేయ. 'బెదురులంక 2012' ట్రైలర్, ఇందులో చెప్పిన కథ బాగుంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. 'నేను నమ్మనిది నేను చేయను.. అది నా సెల్ఫ్ రెస్పెక్ట్.. ఈగో కాదు' (ఆత్మాభిమానం.. అహంభావం కాదు) అంటూ కార్తికేయ చెప్పిన డైలాగ్స్ కూడా ట్రైలర్‌లో ఉన్నాయి ''చిరంజీవిగారికి వీరాభిమాని అయిన కార్తికేయ ఈ సినిమాలో తన అభిమాన హీరో అసలు పేరు.. శివ శంకర వరప్రసాద్ పాత్రలో నటించారు. యుగాంతం వస్తుందని ఆంధ్రప్రదేశ్‌లోని బెదురులంక గ్రామంలో కొందరు కేటుగాళ్లు ప్రజల్లో ఉన్న భక్తిని ఆసరాగా చేసుకుని దేవుడి పేరుతో ఎలా దోపిడీ చేశారు? వారికి శివశంకర వరప్రసాద్ ఏ విధంగా బుద్ధి చెప్పాడు? అన్నదే ఈ సినిమా కథ'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

# రీల్స్

## ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్



● నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా తెలుగు-తమిళ భాషల్లో రూపొందుతున్న 'ఎలెవెన్' సినిమా బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. లోకేశ్ అజ్లస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రేయా హరి కథానాయిక. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు లోకేశ్ అజ్లస్.

## హారతందుకో..



● పాయల్

'అమ్మా డంగురు డంగురు డంగురుమా... అమ్మా అమ్మోరు డంగురు డంగురుమా... హారతందుకో... మమ్ము ఆదుకో..' అంటూ మొదలవుతుంది 'గణ గణ మెగాలిరా..' పాట లిరికల్ వీడియో. అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందిన 'మంగళవారం' చిత్రంలోనిదీ పాట. పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో, శ్రీ తేజ్, చైతన్య కృష్ణ, అజయ్ ఘోష్, లక్ష్మణ్ కీలక పాత్రల్లో నటించారు. అజయ్ భూపతి నిర్మాణ భాగస్వామిగా, స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'గణ గణ మెగాలిరా..' పాట లిరికల్ వీడియోను బుధవారం విడుదల చేశారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ పాటకు భాస్కర భట్ల సాహిత్యం అందించగా వీఎం మహాలింగం పాడారు. ''కొన్నేళ్లపాటు జాతరలలో ఈ పాట వినిపిస్తుంది'' అన్నారు అజయ్ భూపతి. ''ఓ కీలక సందర్భంలో ఈ పాట వస్తుంది'' అన్నారు నిర్మాతలు.

## మంచి సినిమాగా పేరొస్తుంది



● శ్రీనివాస్

సయ్యద్ సోహైల్, రూపా కొడవయూర్ జంటగా శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ వింజనంపాటి మాట్లాడుతూ- ''నా వ్యక్తిగత జీవితంలోని ఘటనల ఆధారంగా, మేల్ ప్రెగ్నెంట్ అనే వార్తను పేపర్‌లో చదివి ఈ కథ రాసుకున్నాను. అమ్మాయి కోసం అబ్బాయి, అబ్బాయి కోసం అమ్మాయి చూడాల్సిన చిత్రం ఇది. తెలుగు పరిశ్రమలో ఓ మంచి సినిమా చేశామనే పేరు వస్తుంది'' అన్నారు.

## సైన్స్‌కు ఆధారం ఆధ్యాత్మికతేనా?



● గంగాధర్, శేర్

శేర్ (సిరాజ్) నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'హర ఓం హర'. అశోక్ కుల్లర్, దేవేంద్ర మదన్ సింగ్ నేగి నిర్మిస్తున్న ఈ చిత్రంలో గంగాధర్, కర్ణిక ఇతర ముఖ్య తారాగాణం. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన ఓ షెడ్యూల్ తూర్పు గోదావరి జిల్లాలో ముగిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ''ఆధ్యాత్మికత అంతా సైన్స్‌తోనే ముడిపడి ఉందని, సైన్స్‌కు ప్రధాన వనరు ఆధ్యాత్మికతేనని నిరూపిస్తూ రూపొందిస్తున్న సినిమా ఇది. తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో సుమన్, ఆమని కీలక పాత్రధారులు.

స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ | 138 | 65,539 |
| నిఫ్టీ ▲ | 30 | 19,465 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,567 | ▽ | 64 |
| డోజోన్స్ | 34,931 | ▽ | 15 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,357 | ▽ | 33 |
| డాక్స్ | 15,789 | ▲ | 22 |
| షాంఘై | 3,150 | ▽ | 26 |
| నికాయ్ | 31,767 | ▲ | 472 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

# డిజిటల్ ఇండియా ప్రాజెక్టు పొడిగింపు

**రూ. 14,903 కోట్ల కేటాయింపు**




**న్యూఢిల్లీ:** డిజిటల్ ఇండియా ప్రాజెక్టును పొడిగించే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇందు కోసం 2021–22 నుంచి 2025–26 మధ్య కాలానికి రూ. 14,903 కోట్లు కేటాయించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. దీని కింద 6.25 లక్షల మంది ఐటీ నిపుణులకు కొత్త నైపుణ్యాల్లోను, 2.64 లక్షల మందికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీలోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పొడిగించిన డిజిటల్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా మరో తొమ్మిది సూపర్ కంప్యూటర్లను నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ మిషన్‌కు (ఎన్‌సీఎం) జోడించనున్నట్లు మంత్రి చెప్పారు. ఇప్పటికే ఎన్‌సీఎం కింద 18 సూపర్ కంప్యూటర్స్ ఉన్నట్లు వివరించారు. డిజిటల్ ఇండియా పథకం 2015లో ప్రారంభమైనప్పుడు రూ. 4,500 కోట్లతో 2022 నాటికి ఎన్‌సీఎం కింద 70 సూపర్‌కంప్యూటర్స్‌ను నెలకొల్పే ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. వాటికి అదనంగా మరో తొమ్మిది సూపర్‌కంప్యూటర్లకు తాజాగా ఆమోదముద్ర వేసిందని మంత్రి చెప్పారు.

**12 కోట్ల మంది విద్యార్థులకు కోర్సులు..**

డిజిటల్ ఇండియా కార్యక్రమం కింద 12 కోట్ల మంది కాలేజీ విద్యార్థుల కోసం సైబర్ అవగాహన కోర్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని 1,200 స్టార్టప్‌లకు ఆర్థిక తోడ్పాటు అందించే వెసులుబాటు కూడా ఉందని వైష్ణవ్ చెప్పారు. 1,787 యూనివర్సిటీలు, పరిశోధన సంస్థల నెట్‌వర్క్ అయిన నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్‌ను డిజిటల్ ఇండియా ఇన్ఫోవేస్‌గా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం తదితర రంగాల్లో కృత్రిమ మేధను వినియోగించేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పా రు. డిజిలాకర్ యాప్‌ను లఘు, చిన్న, మధ్య తరహా సంస్థలకూ అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

## భారత్ బ్యాంకింగ్ పటిష్టమవుతోంది: ఫిచ్

**న్యూఢిల్లీ:** కోవిడ్ తీవ్రత తగ్గుముఖం పట్టడంతో భారతీయ బ్యాంకుల నిర్వహణా పరిస్థితులు గణనీయంగా మెరుగుపడుతున్నట్లు రేటింగ్ ఏజెన్సీ– ఫిచ్ తన తాజా ప్రకటనలో పేర్కొంది. బ్యాంకింగ్‌కు సంబంధించి పలు సూచీలు కోవిడ్ ముందుస్తు పరిస్థితులకన్నాసైతం ముందంజలో ఉన్నట్లు వివరించింది. కొన్ని రంగాల విషయంలో బ్యాంకుల రుణ బకాయిలూ తగ్గుతున్నట్లు తెలిపింది. 'ఆర్థిక వ్యవస్థ భారీ పరిమాణం, డిమాండ్ పరిస్థితులు లాభదాయకమైన వ్యాపారాన్ని సృష్టించడానికి అలాగే ఆదాయాలు పెరగడానికి, ఇబ్బందులను తగ్గించడానికి బ్యాంకింగ్‌కు మరిన్ని అవకాశాలను అందించాల్సి ఉంది'' కూడా ఫిచ్ పేర్కొంది.




# అదానీ పవర్‌లో 8.1% వాటా విక్రయం

- జీక్యూజీ, ఇతర ఇన్వెస్టర్ల పెట్టుబడి
- రూ. 9,000 కోట్లతో కొనుగోలు
- సెకండరీ మార్కెట్లో భారీ డీల్స్‌లో ఒకటి




**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం జీక్యూజీ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్లు తాజాగా అదానీ పవర్‌లో 8.1 శాతం వాటాలు కొనుగోలు చేశాయి. ఇందుకోసం 1.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 9,000 కోట్లు) వెచ్చించాయి. సెకండరీ మార్కెట్‌లో అత్యంత భారీ ఈక్విటీ డీల్స్‌లో ఇది కూడా ఒకటని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. స్టాక్ మార్కెట్ డేటా ప్రకారం.. 31.2 కోట్ల షేర్లను ప్రమోటర్ అదానీ కుటుంబం విక్రయించగా, సగటున షేరుకు రూ. 279.17 రేటుతో జీక్యూజీ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్లు కొనుగోలు చేశారు. జీక్యూజీ ఇప్పటికే అదానీ గ్రూప్‌నకు చెందిన పలు సంస్థల్లో ఇన్వెస్ట్ చేసిన నేపథ్యంలో.. ఒక ఇన్వెస్టరు, ప్రమోటరు గ్రూప్ మధ్య ఈ తరహా లావాదేవీ జరగడం భారత్‌లో ఇదే తొలిసారని సంబంధిత వర్గాలు వివరించాయి.. అదానీ గ్రూప్ వ్యాపార ప్రమాణాలను, బలాన్ని ఇది సూచిస్తోందని తెలిపాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ దెబ్బతో అదానీ గ్రూప్ అతలాకుతలం అయిన పరిస్థితుల్లో, ఈ ఏడాది మార్చి నుంచి ఆ గ్రూప్ సంస్థల్లో జీక్యూజీ క్రమంగా ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో 5.4 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీలో 6.54%, అదానీ ట్రాన్స్‌మిషన్‌లో 2.5 శాతం వాటాలు కొనుగోలు చేసింది.

### జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలోనూ..




మరో స్టాక్ మార్కెట్ డీల్‌లో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలో జేఎస్‌డబ్ల్యూ ఇన్వెస్ట్‌మెంట్స్ 1.27 శాతం వాటాలను రూ. 717.57 కోట్లకు విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా జీక్యూజీ పార్ట్‌నర్స్, వాషింగ్టన్ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ తదితర సంస్థలు కొనుగోలు చేశాయి. జేఎస్‌డబ్ల్యూ ఇన్వెస్ట్‌మెంట్స్.. షేరు ఒక్కింటికి రూ. 341.7 రేటు చొప్పున 2.10 కోట్ల షేర్లను విక్రయించింది. డీల్ అనంతరం జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలో జేఎస్‌డబ్ల్యూ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా 20.22 శాతం నుంచి 18.95 శాతానికి తగ్గింది. ఇటీవలే జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీలో జీక్యూజీ పార్ట్‌నర్స్ ఎమర్జింగ్ మార్కెట్స్ ఈక్విటీ ఫండ్ రూ. 411 కోట్లతో 1.19 కోట్ల షేర్లను కొనుగోలు చేసింది.

## చకాన్ ప్లాంటులో 2 లక్షల ఈవీలు

**2029 నాటికి ఎంఅండ్ఎం వార్షికోత్పత్తి లక్ష్యం**




**కేప్‌టౌన్ (దక్షిణాఫ్రికా):** మహారాష్ట్రలోని చకాన్‌లో నెలకొల్పుతున్న ప్లాంటు నుంచి వార్షికంగా 2 లక్షల ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తిని సాధించాలని మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) నిర్దేశించుకుంది. 2027–29 మధ్య కాలంలో దీన్ని సాధించగలమని సంస్థ ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ విభాగం) వీజే నక్రా తెలిపారు. 2030 నాటికల్లా తమ మొత్తం వాహన విక్రయాల్లో 30 శాతం వాటా ఎలక్ట్రిక్ వాహనాలదే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు. బీఈ శ్రేణిలో తొలి వాహనాన్ని వచ్చే ఏడాది ఆఖర్లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అంతకన్నా 4–5 నెలల ముందు నుంచే చకాన్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభం కాగలదని నక్రా వివరించారు. చకాన్‌లో రూ. 10,000 కోట్లతో విద్యుత్ వాహనాల ప్లాంటును నెలకొల్పేందుకు కంపెనీకి ఈ ఏడాది జనవరిలో అనుమతులు లభించాయి. బార్న్ ఎలక్ట్రిక్ (బీఈ) మోడల్స్ తయారీ కోసం ఈ ప్లాంటుపై వచ్చే 7–8 ఏళ్లలో కంపెనీ భారీగా ఇన్వెస్ట్ చేస్తోంది. ఎక్స్‌యూవీ, కేవలం విద్యుత్ వాహనాల కోసమే ఉద్దేశించిన బీఈ బ్రాండ్‌ల కింద మొత్తం అయిదు ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్స్‌ను ప్రవేశపెట్టడంపై కంపెనీ కసరత్తు చేస్తోంది.

# సెన్సెక్స్ 507 పాయింట్ల రికవరీ

- నిఫ్టీకి 30 పాయింట్ల లాభం
- మిడ్ సెషన్ నుంచి కొనుగోళ్లు
- ఐటీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్



**ముంబై:** మిడ్‌సెషన్ నుంచి ఐటీ, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు బుధవారం కనిష్టస్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ షేర్లు 2 శాతం వరకు రాణించి సూచీల దన్నుగా నిలిచాయి. ఉదయం సెషన్‌లో 369 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 138 పాయింట్ల లాభంతో 65,539 వద్ద స్థిరపడింది. కనిష్టం నుంచి మొత్తంగా 507 పాయింట్లు రికవరీ అయ్యింది. నిఫ్టీ సైతం 118 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 30 పాయింట్ల లాభంతో 19,465 వద్ద ముగిసింది.

దేశీయంగా ద్రవ్యోల్బణం పెరగడం, చైనా ఆర్థిక వ్యవస్థ మాంద్య ఆందోళనలు, అమెరికాకు బ్యాంకులకు ఫిచ్ డౌన్‌గ్రేడ్ రేటింగ్ హెచ్చరికలు పరిణామాల నేపథ్యంలో తొలిసెషన్‌లో సూచీలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే బ్రిటన్‌లో ద్రవ్యోల్బణ తగ్గుముఖం పట్టినట్లు డేటా గణాంకాలు వెల్లడి కావడం, యూఎస్ ఫెడ్ మినిట్స్, పారిశ్రామికోత్పత్తి డేటా వెల్లడి ముందు షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో అనూహ్యంగా సెంటిమెంట్ మెరుగుపడింది. మెటల్, ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మధ్య, చిన్న తరహా షేర్లు రాణించడంతో బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.50%, 0.25 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 723 కోట్ల విలువైన షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,406 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. పార్సీ కొత్త ఏడాది సందర్భంగా ఫారెక్స్, మనీ మార్కెట్లు బుధవారం పనిచేయలేదు.

**మార్కెట్లో మరిన్ని సంగతులు...**

- ఇండిగో ప్రమోటర్ శోభ అగర్వాల్ ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 2.9% వాటాను రూ.2,802 కోట్లకు అమ్మారు. దీంతో కంపెనీ షేరు 3.56% నష్టపోయి రూ.2458 వద్ద ముగిసింది.
- క్యూ1లో రూ.7,840 నష్టాన్ని ప్రకటించడంతో టెలికం ఆపరేటర్ వోడాఫోన్ ఐడియా 3% నష్టపోయి రూ.7.82 వద్ద స్థిరపడింది.
- ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా బర్మన్ ఫ్యామిలీ రిలిగేర్ ఎంటర్‌ప్రైజెస్‌లో 7.5% వాటాను రూ.534 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో బీఎస్ఈలో రిలిగేర్ షేరు 6% పెరిగి రూ.233 వద్ద స్థిరపడింది.

### ఎస్‌బీఎఫ్‌సీ బంపర్ లిస్టింగ్

బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. ఇష్యూ ధర రూ.57తో పోలిస్తే 44% ప్రీమియంతో రూ.82 వద్ద లిస్టయ్యింది. మరింత కొనుగోళ్ల మద్దతు లభించడంతో 67% ఎగిసి రూ.95 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివరికి రూ.61% లాభంతో రూ.92 వద్ద స్థిరపడింది. కంపెనీ విలువ రూ.9,813 కోట్లుగా నమోదైంది.

## పీఎఫ్‌సీ సీఎండీగా పర్మిందర్ చోప్రా బాధ్యతలు



**న్యూఢిల్లీ:** దేశంలోనే అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీ, ప్రభుత్వరంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) చైర్మన్, ఎండీగా (సీఎండీ) పర్మిందర్ చోప్రా బాధ్యతలు స్వీకరించారు. సంస్థకు తొలి పూర్తి స్థాయి మహిళా చైర్మన్ అని పీఎఫ్‌సీ తెలిపింది. జూన్ 1 నుంచి పీఎఫ్‌సీ సీఎండీగా అదనపు బాధ్యతలను ఆమె నిర్వహిస్తుండగా, ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆ బాధ్యతల్లోకి వచ్చారు. అంతక్రితం వరకు పీఎఫ్‌సీ డైరెక్టర్ (ఫైనాన్స్)గా పనిచేశారు. డైరెక్టర్ (ఫైనాన్స్)గా పర్మిందర్ చోప్రా ఎన్‌పీఏలను కనిష్టానికి తగ్గించి, సంస్థ లాభదాయకతను పెంచడంలో, మహారత్న హోదా పొందడంలో కీలకంగా పనిచేశారు. విద్యుత్, ఫైనాన్షియల్ రంగాల్లో 35 ఏళ్ల అనుభవం ఉంది.

## వీఈ కమర్షియల్‌కు 550 బస్సుల ఆర్డర్



**బెంగళూరు:** వీఈ (వోల్వో అండ్ ఐషర్) కమర్షియల్ వెహికల్స్‌కు విజయానంద్ ట్రావెల్స్ నుంచి 550 ఇంటర్ సిటీ బస్సుల సరఫరా ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ విలువ దాదాపు రూ.500 కోట్లు. ''విజయానంద్ ట్రావెల్స్ నుంచి ఆర్డర్ పొందడం సంతోషంగా ఉంది. వీలైనంత తొందర్లో బస్సులను డెలివరీ చేస్తాము'' అని వీఈసీవీ కంపెనీ ఎండీ వినోద్ అగర్వాల్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాలకు పరిమితమైన విజయానంద్ ట్రావెల్స్ ప్రస్తుత ఆర్డర్ ద్వారా పాన్ ఇండియా బ్రాండ్‌ను సొంతం చేసుకుంటుందని కంపెనీ ఎండీ శివ శంకేశ్వర్ అన్నారు.

## కళ్లజోళ్లపై టైటాన్ ప్లస్ 25% ఆఫర్

**హైదరాబాద్:** టైటాన్ అనుబంధ సంస్థ టైటాన్ ప్లస్ ప్రతి రెండు కళ్లజోళ్ల కొనుగోలుపై 25% ఆఫర్ ప్రకటించింది. రూ.4,999 విలువైన రెండు 'బ్లూటెక్' కళ్లజోళ్లను రూ.3,700కు.., రూ.10,500 విలువైన రెండు 'ప్రోగ్రెసివ్' కళ్లజోళ్లను రూ.8,499కు పొందవచ్చు. టైటాన్ ప్లస్ అవుట్‌లెట్లలో ఆగస్టు 18 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది.




---

# భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### కడప గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌లో 45 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

కడప గవర్నమెంట్ మెడికల్ కాలేజ్.. సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 45
» **విభాగాలు:** గైనకాలజీ, అనెస్తీషియా, రేడియో డయాగ్నోసిస్, సైకియాట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్,అనాటమీ తదితరాలు.
» **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(డీఎం/ఎంసీహెచ్/ఎండీ/ఎంఎస్ /డీఎన్‌బీ).
» **ఎంపిక విధానం:** పీజీలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2023.
» **రిక్రూట్‌మెంట్ వాక్ ఇన్ తేది:** 21.08.2023.
» **కౌన్సెలింగ్ స్థలం:** కౌన్సెలింగ్ హాల్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, కడప.
» **వెబ్‌సైట్:** https://kadapa.ap.gov.in

### డా.వైఎస్సార్ ఏఎఫ్ఏయూ, కడపలో బీఆర్క్ ప్రవేశాలు

కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీలోని ప్రభుత్వ/ప్రైవేట్/మైనారిటీ /అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థల్లో బీఆర్క్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** మ్యాథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ తదితర ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. నాటా–2023/జేఈఈ(మెయిన్) బీఆర్క్ పేపర్–2ఏ 2023 ఎగ్జామ్‌లో వ్యాలిడ్ స్కోరు సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** నాటా–2023/జేఈఈ(మెయిన్) బీఆర్క్ పేపర్–2ఏ 2023 స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 24.08.2023.
» **సర్టిఫికేట్ వెరిఫికేషన్ తేది:** 25.08.2023 నుంచి 28.08.2023 వరకు.
» **వెబ్ ఆప్షన్స్ తేదీలు:** 04.09.2023,05.09.2023.
» **మొదటి విడత ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 07.09.2023.
» **వెబ్‌సైట్:** https://apsche.ap.gov.in

### కాళోజీ హెల్త్ యూనివర్శిటీ, వరంగల్‌లో ఎంపీహెచ్ కోర్సులో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రం, వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయంలో.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(నాలుగు సెమిస్టర్లు).
» **సీట్ల సంఖ్య:** 60 సీట్లు(కాంపిటెంట్ అథారిటీ కోటా–30 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటా–24 సీట్లు, ఫారెన్ నేషనల్స్ కోటా–06 సీట్లు).
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఎంట్రన్స్ టెస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.08.2023.
» **వెబ్‌సైట్:**www.knruhs.telangana.gov.in

### నేషనల్ లా యూనివర్శిటీ ఢిల్లీలో ఎల్ఎల్ఎం(ప్రొఫెషనల్) కోర్సులో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ, ఢిల్లీ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్ఎల్ఎం(ప్రొఫెషనల్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **స్పెషలైజేషన్:** క్రిమినల్ లా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్టడీస్,ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా, కమర్షియల్ లా, ఇన్విరాన్‌మెంటల్ లా అండ్జస్టిస్, కన్జూమర్ లా,హెల్త్ లా అండ్ పాలసీ, టాక్సేషన్ లా. » **అర్హత:** కనీసం 50శాతం మార్కులతో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు కనీసం మూడేళ్ల పాటు వృత్తిపరమైన పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కుల ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.08.2023.
» **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in

### నేషనల్ లా యూనివర్శిటీ ఢిల్లీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ, ఢిల్లీ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

**కోర్సు, సీట్ల వివరాలు**

» **ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్) ప్రోగ్రామ్:** 120 సీట్లు. అర్హత: సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్(10+2) ఉత్తీర్ణులవ్వాలి.»ఏడాది ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్: 80 సీట్లు. **అర్హత:** ఎల్ఎల్‌బీ లేదా తత్సమానమైన లా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **పీహెచ్‌డీ(లా, సోషల్ సైన్సెస్) ప్రోగ్రామ్:** 31 సీట్లు. **అర్హత:** ఎల్ఎల్ఎం/మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమానమైన డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:**ఆల్ ఇండియా లా ఎంట్రన్స్ టెస్ట్–2024 ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.11.2023.
» **అడ్మిట్ కార్డుల జారీ తేది:** 20.11.2023.
» **ప్రవేశపరీక్ష నిర్వహణ తేది:** 10.12.2023.
» **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in

# అవుతారా.. బ్యాంక్ ఆఫీసర్

» 3,049 పీవో/ఎంటీ పోస్టులకు ఐబీపీఎస్ ప్రకటన
» ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు
» ప్రిలిమ్స్, మెయిన్స్,ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక

**బ్యాంకింగ్ రంగ ఉద్యోగాల్లో అత్యంత క్రేజీ కొలువు.. పీవో(ప్రొబేషనరీ ఆఫీసర్). డిగ్రీ అర్హతతోనే పీవోగా ఉద్యోగంలో చేరి.. సీజీఎం, బ్యాంక్ చైర్మన్ స్థాయికి కూడా ఎదిగే అవకాశముంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టే ఐబీపీఎస్.. తాజాగా 3,049 పీవో/ఎంటీ(మేనేజ్‌మెంట్ ట్రైనీస్) పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ పీఓ/ఎంటీ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..**



ఐబీపీఎస్ నోటిఫికేషన్

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్.. సంక్షిప్తంగా ఐబీపీఎస్. ప్రతి ఏటా.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ మొదలు స్పెషలిస్ట్ ఆఫీసర్ల వరకూ.. వివిధ ఉద్యోగాలకు నియామక ప్రక్రియ చేపడుతున్న సంస్థ. తాజాగా.. 2024–25 సంవత్సరంలో ఆయా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రొబేషనరీ ఆఫీసర్/మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్ట్‌ల భర్తీకి ప్రక్రియ ప్రారంభించింది.

**మొత్తం 3,049 పీఓ పోస్టులు**

ఐబీపీఎస్ తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం అయిదు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 3,049 పీఓ పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ఆ వివరాలు..

- బ్యాంక్ ఆఫ్ ఇండియా–224 పోస్ట్‌లు, కెనరా బ్యాంకు–500 పోస్ట్‌లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–2,000 పోస్ట్‌లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు– 200 పోస్ట్‌లు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు–125 పోస్ట్‌లు. ఇవే కాకుండా..ఎంపిక ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూకో బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలలో కూడా పోస్ట్‌లు ఏర్పడే అవకాశం ఉంది.

**అర్హతలు**

- ఆగస్ట్ 21, 2023 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** ఆగస్ట్ 1, 2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

**మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ**

ఐబీపీఎస్ చేపట్టనున్న పీఓ/ఎంటీ నియామకాలకు సంబంధించి.. ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో ఉంటుంది. అవి..ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ. ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్‌లను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఈ రాత పరీక్షల్లో విజయం సాధించి నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. అందులోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిస్తే.. ప్రొవిజనల్ అలాట్‌మెంట్ లెటర్ అందజేస్తారు.

**ప్రిలిమినరీ 100 మార్కులు**

ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో 100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు–35 మార్కులు, రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రిలిమినరీలో పొందిన మార్కులు.. సెక్షన్ల వారీగా నిర్దేశిత కటాఫ్‌లు అనుసరించి.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ తర్వాత ఒక్కో పోస్ట్‌కు పది మందిని చొప్పున రెండో దశ మెయిన్స్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు.

**200 మార్కులకు మెయిన్స్**

రెండో దశ మెయిన్ పరీక్ష నాలుగు విభాగాల్లో 200 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 45 ప్రశ్నలు–60 మార్కులు, జనరల్ /ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 35 ప్రశ్నలు–40 మార్కులు, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 35 ప్రశ్నలు–60 మార్కులు.. ఇలా మొత్తం 155 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

**డిస్క్రిప్టివ్ టెస్ట్ కూడా**

మెయిన్ పరీక్షలో భాగంగానే ఆబ్జెక్టివ్ టెస్ట్‌తో పాటు అదనంగా ఇంగ్లిష్ డిస్క్రిప్టివ్ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్(లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే)లో ఒక ఎస్సే,ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది. దీనికి కేటాయించిన మార్కులు 25. సమయం 30 నిమిషాలు. మెయిన్ పరీక్షతోపాటే అదే రోజు ఈ డిస్క్రిప్టివ్ టెస్ట్ జరుగుతుంది.

**చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూ**

ఎంపిక ప్రక్రియలో చివరి దశ.. పర్సనల్ ఇంటర్వ్యూ. మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా.. సెక్షన్ వారీ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను నిర్దేశించి ఆ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు చివరగా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 100. ఇందులో జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు పొందాల్సి ఉంటుంది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి.

**వెయిటేజీ విధానం**

మెయిన్ పరీక్షలో మార్కులకు 80 శాతం వెయిటేజీ, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులకు 20 శాతం వెయిటేజీని నిర్దేశించారు. ఇలా మొత్తం వంద మార్కులకు గాను మెయిన్, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను క్రోడీకరించి తుది విజేతలకు నియామకాలు ఖరారు చేస్తారు.

### ప్రిపరేషన్ ఇలా

**రీజనింగ్**

ప్రిలిమ్స్, మెయిన్స్‌లో కీలకంగా నిలిచే రీజనింగ్‌పై అభ్యర్థులు పట్టు సాధించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

**క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్**

అర్థమెటిక్‌పై పట్టుతో ఈ విభాగంలో రాణించొచ్చు. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా సాధన చేయాలి. తద్వారా ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందొచ్చు.

**డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్**

డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించేందుకు కాలిక్యులేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలి. టేబుల్స్, డయాగ్రమ్స్, నంబర్ డేటా, లైన్ గ్రాఫ్, బార్ గ్రాఫ్ తదితర గ్రాఫ్ ఆధారిత డేటాలలోని సమాధానాన్ని క్రోడీకరించే విధంగా సాధన చేయాలి.

**జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్**

ఇటీవల కాలంలో జాతీయ ఆర్థిక రంగంలో మార్పులు, బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

**ఇంగ్లిష్ లాంగ్వేజ్**

బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు గట్టిగా కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 21.08.2023
- **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్(ఆన్‌లైన్) తేదీలు:** సెప్టెంబర్/అక్టోబర్‌లో.
- **మెయిన్ ఆన్‌లైన్ ఎగ్జామినేషన్ తేదీ:** నవంబర్‌లో
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** 2024 జనవరి/ఫిబ్రవరి నెలల్లో
- **వెబ్‌సైట్:** https://www.ibps.in

## క్లుప్తంగా...

### శ్రీ అనంతపద్మనాభ స్వామి ప్రతిమ ఆవిష్కరణ



శ్రీ అనంత పద్మనాభ స్వామి ప్రతిమను ఆవిష్కరిస్తున్న సుధారెడ్డి, నమ్రతా ఘట్టమనేని

బంజారాహిల్స్ (హైదరాబాద్): శివ్ నారాయణ్ జ్యువెలర్స్ రూపొందించిన సరికొత్త కళాఖండం శ్రీ అనంత పద్మనాభ స్వామి ప్రతిమను పారిశ్రామికవేత్త మేఘా కృష్ణారెడ్డి సతీమణి, స్టైల్ ఐకాన్ సుధారెడ్డి.. హీరో మహేష్ బాబు సతీమణి నమ్రతా ఘట్టమనేనితో కలిసి బుధవారం జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 25లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కళాఖండాన్ని ఇండియా ఇంటర్నేషనల్ జ్యువెలరీషో 2023లో అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా శివ్‌నారాయణ్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ తుషార్ అగర్వాల్ మాట్లాడుతూ.. కేరళలోని తిరువనంతపురం శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దివ్య విగ్రహం ప్రేరణతో ఈ ప్రతిమను రూపొందించినట్టు తెలిపారు. ప్రతిమ 8 అంగుళాల ఎత్తు, 18 అంగుళాల పొడవుందని, రెండు నెలల పాటు 32 మంది కళాకారులు నిత్యం 16 గంటల పాటు శ్రమించి తయారు చేశారని వివరించారు. దీని బరువు 2.8 కిలోలని తెలిపారు. 75 వేల వజ్రాలతో రూపొందించిన ఈ ఆభరణాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అపోలో జేఎండీ సంగీతారెడ్డి, నటుడు బాలకృష్ణ సతీమణి వసుంధర పాల్గొన్నారు.

### పీజీ డెంటల్ ప్రవేశాలకు నోటిఫికేషన్

**నేటి నుంచి 19 వరకు వెబ్ కౌన్సెలింగ్**


సాక్షి, హైదరాబాద్: ఎండీఎస్ సీట్ల భర్తీకి ఈనెల 17 నుంచి 19 వరకు మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. దరఖాస్తు ప్రక్రియ ముగియడంతో మొదటి విడత వెబ్ ఆప్షన్లకు విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. యూనివర్సిటీ పరిధిలోని పీజీ డెంటల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపింది. ఈనెల 17న ఉదయం 8 గంటల నుంచి 19న సాయంత్రం 4 గంటల వరకు తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలల వారీగా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించింది. మరింత సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www. knruhs. telangana. gov.inను సందర్శించాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో కోరాయి.

### ముగిసిన టెట్ దరఖాస్తుల గడువు

**2,83,620 దరఖాస్తుల స్వీకరణ.. వచ్చేనెల 9 నుంచి హాల్‌టికెట్లు**

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగిసింది. ఇప్పటి వరకు 2,83,620 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వరకూ దరఖాస్తుకు గడువు ఉండటంతో సంఖ్య స్వల్పంగా పెరిగే వీలుంది. టెట్ పరీక్షను సెప్టెంబర్ 15న నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 9 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పేపర్-1 రాయడానికి డీఎడ్ విద్యార్హత గల వారు అర్హులు. అయితే, బీఎడ్ చేసిన అభ్యర్థులు పేపర్-2తో పాటు పేపర్-1 కూడా రాసే అవకాశం కల్పించారు. దీని ద్వారా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులకు వీరు అర్హత సాధిస్తారు. ఈ కారణంగా పేపర్-1కు 80,990, పేపర్-2కు 20,370 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు పొడిగించాలనే అభ్యర్థనను విద్యాశాఖ తిరస్కరించింది. ముందు నిర్ణయించిన ప్రకారమే పరీక్ష ఉంటుందని అధికారులు స్పష్టంచేశారు.

### ఓయూ ఫౌండేషన్‌కు రూ.20 కోట్ల విరాళం



ఉస్మానియా యూనివర్సిటీ: మౌలిక వసతుల కల్పన కోసం రూ.100 కోట్ల లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఓయూ ఫౌండేషన్‌కు ఇప్పటివరకు రూ.20 కోట్ల విరాళం అందినట్లు వీసీ ప్రొఫెసర్ రవీందర్ తెలిపారు. సింగరేణి కాలరీస్ రూ.5 కోట్లు, ఎన్‌టీపీసీ రూ.5 కోట్లు, కోల్ ఇండియా లిమిటెడ్ రూ.3 కోట్లు, జెన్‌కో రూ.1.53 కోట్లు, భారత్ పెట్రోలియం రూ.1.5 కోట్లు విరాళంగా అందచేసినట్లు వీసీ వివరించారు. మరికొంతమంది కూడా తమ వంతుగా విరాళాన్ని అందించారని తెలిపారు. ఓయూ ఫౌండేషన్‌కు రూ.50 వేలను వీసీ రవీందర్ ఈ నెల 15న ప్రకటించారు.

### అంబేడ్కర్ వర్సిటీ ప్రవేశ గడువు సెప్టెంబర్ 5

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ, బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు గడువును సెప్టెంబర్ 5 వరకు పొడిగించినట్లు యూనివర్సిటీ విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7382929570 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# దక్షిణాదిలో ఇంజనీరింగ్ దర్జా..

**54 %** ఇంజనీరింగ్ సీట్లు ఈ రాష్ట్రాల్లోనే..

- డిగ్రీ తర్వాత విదేశీ విద్య మోజులో మనవాళ్లు..
- ఉత్తరాదిలో డిగ్రీ కోర్సుల వైపు మొగ్గు
- పాలనాపరమైన ఉద్యోగాల వేటలో అక్కడి విద్యార్థులు
- ఏఐసీటీఈ అధ్యయనం వెల్లడి




సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకే అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారు. అందులోనూ సాఫ్ట్‌వేర్ రంగాన్నే ఎంచుకుంటున్నారు. విదేశీ విద్య, అక్కడే స్థిరపడాలన్న ఆకాంక్ష దక్షిణాది రాష్ట్రాల విద్యార్థుల్లోనే ఎక్కువగా కన్పిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు మాత్రం వివిధ కోర్సులతో కూడిన కాంబినేషన్ డిగ్రీలు, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సులను ఎంచుకుంటున్నారు. ప్రతి విభాగంలోనూ పాలనాపరమైన ఉద్యోగాల్లో స్థిరపడాలన్న ఆకాంక్ష వెలిబుచ్చుతున్నారు. సాంకేతిక విద్య వైపు ఎక్కువగా మొగ్గు చూపకపోవడంతో ఉత్తరాది రాష్ట్రాల్లో ఇంజనీరింగ్ కాలేజీలు, సీట్లు తగ్గుతున్నాయి. అఖిల భారత సాంకేతిక విద్య మండలి (ఏఐసీటీఈ) జరిపిన తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. దీంతో ఈ మేరకు కోర్సుల్లో మార్పులు తేవాలని కేంద్ర ప్రభుత్వానికి ఏఐసీటీఈ సూచించింది.

దేశవ్యాప్తంగా 12,47,667 బీటెక్ సీట్లు (2022 గణాంకాలు) అందుబాటులో ఉన్నాయి. ఇందులో 6,74,697 సీట్లు దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఎంసీఏలో 70,065 సీట్లు ఉంటే, 30,812 (44 శాతం) దక్షిణాదిలో ఉన్నాయి. ఎంబీఏ, పీజీడీఎం వంటి మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించిన సీట్లు దేశవ్యాప్తంగా 3,39,405 ఉంటే, దక్షిణాదిన 1,57,632 సీట్లున్నాయి. 2015-16లో దక్షిణాది రాష్ట్రాల్లో 48.77 బీటెక్ సీట్లు ఉంటే, కేవలం ఆరేళ్లలో అవి 5.3 శాతం పెరిగాయని మండలి గుర్తించింది. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు బీటెక్ తర్వాత తక్షణ ఉపాధి అవకాశాలు కోరుకుంటున్నారు. సాఫ్ట్‌వేర్ లేదా ఇతర సాంకేతిక ఉపాధి అవకాశాలను ఎంచుకుంటున్నారు. ఈ కారణంగా దేశవ్యాప్తంగా ఉండే ఇంజనీరింగ్ సీట్లలో 54 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉంటున్నాయి. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో విద్యార్థులు ఒకే విధమైన కోర్సుల్లో చేరుతున్నారు. ముఖ్యంగా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్)ని, ఎంబీఏ, ఎంసీఏను ఎంచుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, పంజాబ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో విద్యార్థులు మాత్రం ఎక్కువగా సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. ఆ తర్వాత పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగానే సివిల్స్ వంటి పోటీ పరీక్షకు ఉత్తరాదిలోనే ఎక్కువగా శిక్షణ కేంద్రాలు ఉంటున్నాయని తేలింది.

**సగానికిపైగా ఇక్కడే..**

**విదేశాలు లేదా సాఫ్ట్‌వేర్..**

బీటెక్ పూర్తయిన వెంటనే దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు స్వదేశంలో ఎంటెక్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. ఎక్కువ మంది విదేశాలకు వెళ్తున్నారు. బీటెక్‌లో బ్రాంచీ ఏదైనా విదేశాల్లో మాత్రం సాఫ్ట్‌వేర్ అనుబంధ బ్రాంచీల్లోనే ఎంఎస్ పూర్తి చేస్తున్నారు. గత ఐదేళ్ళుగా సగటున 4 లక్షల మంది విదేశీ విద్యకు వెళ్తే, దక్షిణాది రాష్ట్రాల నుంచి 2.8 లక్షల మంది ఉన్నారని, ఇందులో బీటెక్ నేపథ్యం ఉన్న వాళ్ళు 1.50 లక్షల మంది ఉన్నారని ఏఐసీటీఈ పరిశీలనలో తేలింది ఎంఎస్ చేసేటప్పుడే పార్ట్ టైం ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎంఎస్ పూర్తయిన తర్వాత ఏదో ఒక ఉద్యోగంలో స్థిరపడుతున్నారు. ముఖ్యంగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లో స్థిరపడుతున్న వారిలో దక్షిణాది విద్యార్థులదే ముందంజ అని మార్కెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే చాలా కాలేజీల్లో సంప్రదాయ కోర్సుల సీట్లు మిగిలిపోతున్నాయి. ఏదేమైనా ఉత్తర, దక్షిణ రాష్ట్రాల్లో నెలకొన్న వ్యత్యాసంపై మరింత అధ్యయనం అవసరమని ఏఐసీటీఈ భావిస్తోంది.

| దక్షిణాది రాష్ట్రాల్లో బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ కాలేజీలు/ సీట్లు | తమిళనాడు/489 | ఆంధ్రప్రదేశ్ /280 | తెలంగాణ/189 | కర్ణాటక / 195 | కేరళ / 152 | పుదుచ్చేరి/15 |
|---|---|---|---|---|---|---|
| | 2,48,552 | 1,48,952 | 1,10,808 | 1,08,812 | 50,493 | 7,080 |

## అధిక మాసంలోనూ 'అదరగొట్టారు'

**వైన్‌షాపుల టెండర్లలో ఈనెల 14న రికార్డు స్థాయిలో దరఖాస్తులు**

- ఆ ఒక్కరోజే 14 వేలకు పైగా దాఖలు.. బుధవారానికి 43,500 దాటిన వైనం
- రెండేళ్లలో వచ్చిన మొత్తం దరఖాస్తులు 69వేల పైమాటే
- ఈసారి చివరి రెండు రోజుల్లో ఎన్ని వస్తాయన్న దానిపై ఉత్కంఠ
- శ్రావణ మాసం రావడంతో భారీగా దాఖలవుతాయని అంచనాలు



సాక్షి, హైదరాబాద్: అధిక మాసంలోనూ వైన్‌షాపు టెండర్ల ప్రక్రియ అదిరిపోయింది. ఈసారి ఎలాగైనా మద్యం షాపులు దక్కించుకోవాలన్న వ్యాపారుల ఆశతో భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈనెల 14న ఒక్కరోజే రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆ ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 14 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. ఇక, 15వ తేదీన సెలవుదినం కావడంతో 16వ తేదీ బుధవారం 8,500 పైగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం మీద 14, 16 తేదీల్లో కలిపి.. 23 వేల వరకు దరఖాస్తులు రాగా, ఈనెల 4 నుంచి 16 వరకు మొత్తం కలిపి 43,500 పైగా దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. కాగా, గత రెండేళ్ల కాలానికి గాను మొత్తం 10 రోజుల్లో 69 వేలకు పైగా దరఖాస్తులు రాగా, ఈసారి తొలి పది రోజుల్లో 43,500 మాత్రమే రావడం గమనార్హం. అయితే, ఈసారి గడువు రెండు రోజులు ఎక్కువగా ఇవ్వడం, అధిక శ్రావణం ముగిసి శ్రావణ మాసం రావడంతో చివరి రెండు రోజుల్లోనూ భారీగా దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే వేలాది మంది డీడీలు తీసి, శ్రావణ మాసం కోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చివరి రెండురోజులైన గురు, శుక్రవారాల్లో భారీ స్థాయిలో దరఖాస్తులు వస్తాయని, గతం కంటే ఇప్పుడు ఎక్కువే దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నామని ఎక్సైజ్ అధికారులు చెపుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు మద్యం షాపుల దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.870 కోట్ల ఆదాయం సమకూరింది. చివరి రెండు రోజుల్లో కలిపి మరో రూ.500 కోట్ల వరకు వస్తుందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది.



'తెలంగాణ చరిత్ర'ను ఆవిష్కరిస్తున్న ప్రొ.లింబాద్రి, డాక్టర్ డి.రవీంద్ర యాదవ్, గౌరీశంకర్

### చరిత్రను అవగాహన చేసుకుంటేనే పునఃనిర్మాణం శక్తిమంతం!

సాక్షి,హైదరాబాద్ : దేశ చరిత్రలో తెలంగాణ చరిత్ర అజరామరమైందని, కొత్త రాష్ట్రం ఏర్పాటు తర్వాత మనకు తెలియని మన మహోన్నతమైన చరిత్రను వెలికితీసే కృషి ముమ్మరంగా సాగుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ గడ్డపై ఎగిసిన విప్లవాలు, ఉద్యమాల సమగ్ర చరిత్ర అవగాహన చేసుకుంటేనే భవిష్యత్ తెలంగాణ పునఃనిర్మాణం శక్తిమంతంగా నిర్మించుకోగలమని వెల్లడించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలిలో బుధవారం చరిత్రకారులు అడపా సత్యనారాయణ, ద్యావనపల్లి సత్యనారాయణలు రచించిన ''తెలంగాణ చరిత్ర'' గ్రంథాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్.ఆర్. లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ డి.రవీంద్ర యాదవ్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ మహమ్మద్, ప్రొఫెసర్ వి.వెంకటరమణ పాల్గొన్నారు.

**గత విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏదీ?**

- కోవిడ్ తర్వాత పరిస్థితులు తారుమారు
- మూడేళ్లుగా పెరిగిపోతున్న బకాయిలు
- విద్యార్థులకు తప్పని కష్టాలు

# పైసా ఇవ్వలే...

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ప్రముఖ కాలేజీలో డి.సాయికిరణ్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఎంసెట్‌లో ఉత్తమర్యాంకు సాధించి కన్వీనర్ కోటాలో సీటు దక్కించుకున్న సాయికిరణ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హుడు. కానీ రెండేళ్లుగా వ్యక్తిగతంగా ఫీజు చెల్లిస్తున్నాడు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఆ నిధులు జమ కాగానే చెక్కు రూపంలో ఫీజు వెనక్కి ఇస్తామని కాలేజీ యాజమాన్యం చెప్పడంతో ధైర్యం చేశాడు.

> మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ దగ్గరున్న ఓ ఇంజనీరింగ్ కాలేజీలో జె.కార్తిక్ తాజాగా ఎంటెక్ పూర్తి చేశాడు. ఓ ప్రైవేటు కంపెనీలో ఇంటర్వ్యూ ద్వారా జాబ్‌కు ఎంపికయ్యాడు. ఒప్పందపత్రంపై సంతకంతోపాటు విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాలని కంపెనీ యాజమాన్యం స్పష్టం చేసింది. అయితే కాలేజీ యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజు చెల్లించాలంటూ రీయింబర్స్‌మెంట్‌కు మెలిక పెట్టింది. దీంతో అప్పు చేసి ఫీజు చెల్లించి కాలేజీకి నుంచి సర్టిఫికెట్లు తీసుకున్నాడు.

సాక్షి, హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయడం లేదు. కోవిడ్ తర్వాత నిధుల విడుదలలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. దాని ప్రభావం విద్యార్థుల చదువులు, ఇతర అంశాలపై పడుతోంది.

**కేటగిరీల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు(రూ.కోట్లలో)**

| కేటగిరీ | 2020-21 | 2021-22 | 2022-23 |
|---|---|---|---|
| ఎస్సీ | 1.2 | 78.74 | 375.33 |
| ఎస్టీ | 1.1 | 86.5 | 185.54 |
| బీసీ | 132.29 | 925.4 | 1125.2 |
| ఈబీసీ | 81.11 | 225.5 | 355.23 |
| మైనారిటీ | 25.25 | 135.54 | 300.26 |
| మొత్తం | 240.95 | 1451.68 | 2341.56 |



**టోకెన్లు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు...**



ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నిధులు విడుదల చేసిన తర్వాత వాటిని కాలేజీ ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేయడంలోనూ తాత్సారం చేస్తోంది. గతేడాది డిసెంబర్‌లో దాదాపు రూ.4వందల కోట్లకు సంబంధించి టోకెన్లు జనరేట్ చేసిన అధికారులు ట్రెజరీల్లో క్లియరెన్స్ ఇవ్వకుండా ఆపారు.
– గౌరి సతీశ్, కన్వీనర్, కేజీ టు పీజీ ప్రైవేటు విద్యా సంస్థల జేఏసీ

**బకాయిలు రూ.4,043.19 కోట్లు**

మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతున్నాయి. రూ.4043.19 కోట్ల మేర విద్యార్థులకు ఫీజులు, ఉపకార వేతనాలు రూపంలో చెల్లించాల్సి ఉన్నట్టు సంక్షేమ శాఖల గణాంకాలు చెబుతున్నాయి. గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల్లో పైసా విడుదల కాకపోగా, అంతకుముందు ఏడాది 40శాతం మాత్రమే నిధులు విడుదలయ్యాయి. సాధారణంగా అయితే విద్యాసంవత్సరం ముగిసిన వెంటనే నిధులు విడుదల చేస్తారు. కానీ మూడేళ్లుగా పరిస్థితి తారుమారైంది.

**బీసీ విద్యార్థులవే అధికం**

ఫీజు బకాయిల్లో అత్యధికం బీసీ సంక్షేమశాఖకు చెందినవే ఉన్నాయి. ఈ మూడేళ్లకు సంబంధించి బీసీ విద్యార్థులకు రూ.2182.89 కోట్ల బకాయిలున్నాయి. ఈబీసీ కేటగిరీలో మూడేళ్ల బకాయిలు రూ.661.84 కోట్లు ఉన్నాయి.

- ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలకు ప్రత్యేక అభివృద్ధి నిధి ద్వారా నిధుల సర్దుబాటు చేస్తున్నారు.
- మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలోనూ బకాయిలు 461.05కోట్లు ఉన్నాయి.

## గ్రూప్-1 ప్రిలిమ్స్ 'లీకేజీ'ని సీబీఐకి అప్పగించాలి

**హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు • విచారణకు స్వీకరించిన సీజే ధర్మాసనం**



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం లీకేజీ దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. పిల్‌పై అభ్యంతరాలను పక్కకు పెట్టి, పిటిషన్‌కు నంబర్ ఇవ్వాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం రిజిస్ట్రీని ఆదేశించింది. ఫైలింగ్ నంబర్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్, హైదరాబాద్ సీపీ, సీబీఐ డైరెక్టర్‌కు నోటీసులిచ్చింది. అలాగే పేపర్ లీకేజీ దర్యాప్తు ఎంతవరకు వచ్చిందో నివేదిక అందజేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఏప్రిల్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లోని అంశాలతో ఈ పిల్ దాఖలైంది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన రిజిస్ట్రీ నంబర్ కేటాయించలేదు. సీజే ధర్మాసనం వద్ద విచారణ సందర్భంగా హోం శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది రూపేందర్ వాదనలు వినిపిస్తూ.. గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పగించాలన్న పిటిషన్ ఇప్పటికే సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఆ పిటిషన్ విచారణ సందర్భంగా నిందితులపై కేసు నమోదు, అరెస్టు, దర్యాప్తు ఎక్కడి వరకు వచ్చింది.. వంటి అంశాలపై సిట్ మూడు నివేదికలను కూడా కోర్టుకు సమర్పించిందన్నారు. ఈ పిల్ దాఖలు చేసిన పిటిషనర్ బక్క జడ్సన్.. కాంగ్రెస్ పార్టీ నేత అని చెప్పారు. నిష్పక్షపాతంగా సిట్‌ను దర్యాప్తు చేయకుండా ధిక్కరణ పిటిషన్లు కూడా వేస్తూ అడ్డుకుంటున్నారని చెప్పారు.

**కిందిస్థాయి సిబ్బందిపైనే కేసులు..**

పిటిషనర్ తరఫున న్యాయవాది ఎస్.శరత్ కుమార్ వాదనలు వినిపించారు. పేపర్ లీకేజీ అంశంలో టీఎస్‌పీఎస్సీకి చెందిన కిందిస్థాయి సిబ్బందిపైనే సిట్ కేసులు పెట్టిందని.. ఉన్నతాధికారులను మాత్రం వదిలేసిందని చెప్పారు. పాస్‌వర్డ్ లీక్‌కు కారణమైన టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శిపై ఎలాంటి కేసు పెట్టలేదన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌తో పాటు మరికొన్ని నియామక పరీక్షల పేపర్లు లీక్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల్లో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయని వెల్లడించారు. పిల్‌కు నంబర్‌కు వేయాలని రిజిస్ట్రీని ఆదేశించడంతోపాటు దర్యాప్తును సీబీఐకి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్‌ను కూడా ఈ పిల్‌కు జత చేసేలా దరఖాస్తు చేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

## 'చెలిమి'కి అంకురం..

**వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి సబిత**




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యా వ్యవస్థలో శాస్త్రీయతను జోడిస్తామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. వివిధ రూపాల్లో విద్యార్థులకు ఎదురయ్యే ఒత్తిడులను తట్టుకునేలా 'చెలిమి' విద్యార్థుల్లో వ్యాపార దృక్పథాన్ని పెంచడంతో పాటు, వ్యవస్థాపక ఆలోచనలను పెంపొందించేందుకు 'అంకురం'అనే కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని శివరాంపల్లి ఉన్నత పాఠశాలలో చెలిమి, అంకురం కార్యక్రమాలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. చెలిమి కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించే వినూత్న ఆలోచన శక్తిని పెంపొందించేలా కృషి చేస్తామన్నారు. పిల్లలు తమ నిజ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా, వేగంగా పురోగమిస్తున్న ప్రపంచానికి అనుగుణంగా తమను తాము సమాయత్తం చేసుకొనేలా తరగతి గదిలో సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. విద్యార్థుల్లోని అభిరుచులను తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పాటు ఏయే రంగాల్లో రాణిస్తారనే విషయాన్ని తెలుసుకునేందుకు శాస్త్రీయ మదింపు చేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి జిల్లాలో ఒక్కో ఉన్నత పాఠశాలను ఎంపిక చేసి చెలిమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంకురం కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టులో భాగంగా 8 జిల్లాల్లో 35 కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో 11వ తరగతి విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తున్నామని చెప్పారు. మంచి భవిష్యత్‌ను అందించేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో శాసన సభ్యుడు ప్రకాశ్ గౌడ్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యా సంచాలకురాలు దేవసేన తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు చివరి చాన్స్

- నేటి నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు
- ఈ నెల 23న సీట్ల కేటాయింపు
- 25న కాలేజీల్లో నేరుగా స్పాట్ అడ్మిషన్లు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఈ నెల 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కన్వీనర్ సీటు కౌన్సెలింగ్ ద్వారా పొందడానికి ఇదే చివరి అవకాశం. ఇప్పటివరకూ సీటు కోసం ప్రయత్నించని వారు ఉంటే ఈ నెల 18న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలని సాంకేతిక విద్య కమిషనర్ వాకాటి కరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 17 నుంచి 19 వరకూ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ఈ నెల 23వ తేదీన ప్రత్యేక దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రెండు రోజుల్లో సీటు వచ్చిన అభ్యర్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. దీని తర్వాత కూడా మిగిలిపోయిన సీట్లను ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్ల పేరిట ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా కాలేజీల్లోనే భర్తీ చేస్తారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సాంకేతిక విద్య విభాగం విడుదల చేయాల్సి ఉంది.

**అందుబాటులో 19 వేల సీట్లు**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ 19,049 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన సీట్లు దాదాపు 4 వేలకు పైనే ఉన్నాయి. ఒక్క సీఎస్‌సీలోనే 3,034 సీట్లు మిగిలాయి. సివిల్ ఇంజనీరింగ్‌లో 2,505, ఈసీఈలో 2,721, ఈఈఈలో 2,630, ఐటీలో 1,785, మెకానికల్‌లో 2,542 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది పలు కాలేజీలు సివిల్, మెకానికల్ సీట్లు రద్దు చేసుకుని, ఆ స్థానంలో కంప్యూటర్ సైన్స్ సీట్లు పెంచుకున్నాయి. వీటితో పాటు మరో 7 వేల సీట్లు కొత్తగా కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలో పెరిగాయి. మొత్తంగా కంప్యూటర్ సైన్స్ సీట్లు 14 వేల వరకు పెరిగాయి. అయితే గ్రామీణ ప్రాంతాలకు చేరువలో ఉండే కాలేజీల్లో కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నా అక్కడ చేరేందుకు విద్యార్థులు ఇష్టపడటం లేదు. ఆయా కాలేజీల్లో మౌలిక వసతులు, సరైన ఫ్యాకల్టీ లేదని విద్యార్థులు భావిస్తున్నారు. కాగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు 90 శాతం వరకూ భర్తీ అయ్యాయి.

**లక్షకు చేరువలో చేరికలు**

ఈ ఏడాది ఇంజనీరింగ్‌లో కన్వీనర్, యాజమాన్య కోటా కలిపి లక్ష మంది వరకు చేరే వీలుందని తెలుస్తోంది. రాష్ట్రంలో మొత్తం 174 కాలేజీలుంటే, వీటిలో 83,766 కన్వీనర్ కోటా సీట్లు, మరో 33 వేలు యాజమాన్య కోటా సీట్లు ఉన్నాయి. కన్వీనర్ కోటాలో ఇప్పటికే 65 వేల మంది వరకూ చేరారు. ప్రత్యేక కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్ల ద్వారా మరో 6 వేల మంది వరకూ చేరే వీలుందని అంచనా వేస్తున్నారు. ఇక యాజమాన్య కోటా కింద దాదాపు 30 వేల వరకూ భర్తీ అయ్యే వీలుందని భావిస్తున్నారు.

## ఐఎంఎస్ స్కామ్‌లో తుదిదశకు ఈడీ దర్యాప్తు

**ఈడీ అడిగిన పత్రాలను అధికారులకు అందజేసిన దేవికారాణి తరఫు వ్యక్తులు**

సాక్షి, హైదరాబాద్: ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) కుంభకోణంలో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) దర్యాప్తు తుది దశకు చేరుకుంది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు అడిగిన పత్రాలను కుంభకోణంలో కీలక నిందితురాలు దేవికారాణి తరఫు వ్యక్తులు బుధవారం సమర్పించినట్లు తెలిసింది. ఐఎంఎస్ స్కాంలో మనీలాండరింగ్‌పై మాజీ డైరెక్టర్ దేవికారాణితో పాటు సహనిందితుల్ని ఒక్కొక్కరిగా పిలిచి ఈడీ విచారణ చేస్తోంది. ఐఎంఎస్‌లో నిధుల అవకతవకలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు 2019 సెప్టెంబరులో ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఏసీబీ నమోదు చేసిన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఏసీబీ నుంచి సేకరించిన సమాచారం, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు 2021 నవంబరులో నిందితుల నుంచి రూ.144 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తుల్ని ఈడీ జప్తు చేసింది. 2015-19 వరకు మందులు, మెడికల్ కిట్ల కొనుగోళ్ల పేరుతో రూ.211 కోట్ల నిధులు గోల్‌మాల్ జరిగినట్లు ఏసీబీ వెలుగులోకి తేవడం తెలిసిందే.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.